www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 12-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 237 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి రా. 10.27 తదుపరి త్రయోదశి; నక్షత్రం: అశ్విని ఉ. 9.52 తదుపరి భరణి; వర్జ్యం: శే. ఉ. 7.39, రా. 6.39-8.07; దుర్ముహూర్తం: ఉ. 10.19-11.03, మ. 2.42-3.26; అమృతఘడియలు: తె. 3.26-4.54; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.39, సూర్యాస్తమయం: 5.38 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

హెల్మెట్ నిబంధన అమలేదీ?

చలానాలు కట్టనివారి ఇళ్లకు విద్యుత్, నీళ్లు నిలిపివేయాలి
హెల్మెట్ లేక 3 నెలల్లో 667 మంది చనిపోవడం చిన్నవిషయం కాదు
అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.. పోలీసులు, ఎంవీఐ అధికారుల పనితీరుపై అసంతృప్తిగా ఉన్నాం: హైకోర్టు
విచారణ 18కి వాయిదా.. హాజరు కావాలని ట్రాఫిక్ ఐజీకి ఆదేశం



14

జనం మెచ్చేలా!

మనం నచ్చేలా పాలన

కలెక్టర్ల సమర్థతతోనే ప్రజలకు న్యాయం
వైసీపీ పాలనలో అన్ని శాఖలూ నిర్వీర్యం
వచ్చే రెండేళ్ల నిధులూ ముందే వాడేశారు
ఇప్పుడిప్పుడే చీకట్లు తొలగిపోతున్నాయి
ఆరు నెలల్లోనే పెట్టుబడులు వస్తున్నాయి
సంక్రాంతి నాటికి గోతులు లేని రోడ్లు
'రెవెన్యూ' ఫిర్యాదులు పరిష్కరించాల్సిందే
15 శాతం జీఎస్‌డీపీ వృద్ధిరేటే లక్ష్యం
కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు స్పష్టీకరణ



కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సీఎస్ నీరబ్

రేషన్ మాఫియాకు కళ్లెం

బియ్యం రీసైక్లింగ్ చేసేందుకు వీల్లేదు
సర్వీసూ ఓ ప్రొడక్టే.. సేవారంగానికి ప్రచారం కల్పించండి
వినూత్నంగా ఆలోచిస్తేనే అభివృద్ధి సాధ్యం
ఒక్క వ్యవసాయంతోనే ప్రగతిని సాధించలేం
అదనంగా సేవల రంగాన్ని కూడా పెంచాలి
వారానికి ఒక రోజు క్షేత్ర పర్యటన.. సీఎం సూచన

నిస్సహాయంగా మారొద్దు

ఐఏఎస్, ఐపీఎస్‌లకు డిప్యూటీ సీఎం హితవు
అక్రమాలను మీరు అడ్డుకుంటే మంత్రులు వెళ్లక్కర్లేదు
మూలాలు కదిలించే స్థాయిలో వైసీపీ విధ్వంసం
అధికారులతో సినిమా టికెట్లు అమ్మించింది
అయినా ఐఏఎస్‌లు అభ్యంతరం చెప్పలేదు: పవన్

వైసీపీ పాలకులు ఎంత తెలివిగా వ్యవహరించారంటే... రాబోయే రెండేళ్ల ఆర్థిక సంఘం నిధులు కూడా వాడేశారు. అంటే కొత్త ఆర్థిక సంఘం ఏర్పడేవరకు నిధుల్లేని పరిస్థితి. 14వ ఆర్థిక సంఘం కాలంలో మేము రూ.22,112 కోట్లు తీసుకుంటే, 15వ ఆర్థిక సంఘం కాలంలో వైసీపీ ప్రభుత్వం ఏకంగా రూ.62 వేల కోట్లు డ్రా చేసింది. ఇది తెలిసి నేనే ఆశ్చర్యపోయా! – చంద్రబాబు

12



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న గూగుల్, ప్రభుత్వ ప్రతినిధులు

ఏపీతో గూగుల్

విశాఖలో సెంటర్ ఏర్పాటుకు కుదిరిన ఒప్పందం
రాష్ట్రానికి ఏఐ సేవలు.. చంద్రబాబు, లోకేశ్‌తో బృందం భేటీ
ఐటీని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటాం: బాబు

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌తో కీలక భాగస్వామిగా ఉంటామని ప్రఖ్యాత ఐటీ దిగ్గజం గూగుల్ ప్రకటించింది. విశాఖపట్నంలో గూగుల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రంలో కృత్రిమ మేధ (ఏఐ) సేవలు అందించేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. బుధవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌తో గూగుల్ గ్లోబల్ నెట్‌వర్క్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (జీజీఏఐ) వైస్ ప్రెసిడెంట్ వికాశ్ కోలే బృందం సమావేశమైంది. చంద్రబాబు, లోకేశ్ సమక్షంలో

మిగతా 14వ పేజీలో...



భారత్ అమ్ములపొదిలో
వోరోనెజ్
రక్షణ కవచం

గగనతల రక్షణకు రష్యా సాంకేతికత
8 వేల కి.మీ దూరంలోనే క్షిపణుల గుర్తింపు
రూ.34 వేల కోట్ల డీల్
కర్ణాటకలోని చిత్రదుర్గ వద్ద ఏర్పాటు!

2

టెన్త్, ఇంటర్ పరీక్షలు మార్చిలో

13

1 నుంచి 20 వరకూ ఇంటర్ ఎగ్జామ్స్
విద్యార్థులకు ఫిబ్రవరిలో ప్రాక్టికల్స్
17 నుంచి 31 వరకూ టెన్త్ పరీక్షలు
షెడ్యూలు విడుదల చేసిన మంత్రి లోకేశ్

అమరావతే రాజధాని



మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా అభివృద్ధి పనులు
హైకోర్టు త్రిసభ్య బెంచ్ తీర్పును అమలుచేస్తాం
రైతులకు ఇచ్చిన చట్టబద్ధ హామీలను నెరవేరుస్తాం
మూడేళ్లలో అభివృద్ధి పనులు పూర్తిచేస్తాం
ఈ అంశాలు పరిగణించి ఎస్ఎల్‌పీని పరిష్కరించండి
ప్రభుత్వం తరఫున సుప్రీంలో సీఎస్ అఫిడవిట్

2

సమగ్ర సమాచార వేదికగా ఆర్టీజీఎస్

పౌర సేవల కోసం సమగ్ర డేటా సేకరణ.. రియల్ టైమ్‌లో పథకాల పర్యవేక్షణ
త్వరలోనే ప్రతి గ్రామానికీ ప్రొఫైల్.. వాట్సాప్ ద్వారా ఫిర్యాదు సదుపాయం
ఆర్టీజీఎస్‌లో డేటా లేక్ ఏర్పాటు.. దేశంలోనే తొలిసారి: సీఈవో దినేశ్

13

వాట్సాప్ గవర్నెన్స్ దేశంలోనే తొలిసారి

ఇది యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలి.. కొత్త టెక్నాలజీలో సమస్యలు సహజం
వాటిని అధిగమిస్తూ ముందుకు సాగాలి.. కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు

12

పీఎఫ్ సొమ్ము ఏటీఎం ద్వారా విత్‌డ్రా



» జనవరిలో అందుబాటులోకి... కేంద్రం యోచన

న్యూఢిల్లీ, డిసెంబరు 11: ఉద్యోగ భవిష్యనిధి సొమ్ము ఉపసంహరణ మరింత సులభతరం కానుంది. ఉద్యోగులు తమ పీఎఫ్‌ను ఏటీఎం ద్వారా విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు కార్మికశాఖ కార్యదర్శి సుమిత్రా దావ్రా తెలిపారు. 2025 జనవరి నుంచి ఈ సేవలు అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు. చందాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు గాను ఐటీ వ్యవస్థలను ఆధునీకీకరిస్తున్నామని, క్లెయిమ్‌ల పరిష్కారం వేగవంతంగా జరిగేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కాగా, పీఎఫ్ సొమ్మును విత్‌డ్రా చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఒక కార్డును జారీ చేయనుంది. ప్రస్తుతం ఈపీఎఫ్‌వోలో 7కోట్ల మందికి పైగా చందాదారులున్నారు.

గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కోసం పథకం!

న్యూఢిల్లీ, డిసెంబరు 11: గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు సామాజిక భద్రత, ఇతర ప్రయోజనాలు కల్పించేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. ఈ-కామర్స్ సేవల రంగంలో వారు సమర్థవంతంగా పనిచేసేందుకు, దేశ ఆర్థిక వ్యవస్థలో తమ వంతు పాత్ర పోషించేందుకు వారికి సామాజిక భద్రత అవసరమని, దాని కోసం పథకం రూపొందిస్తున్నామని కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శి సుమితా దావ్రా తెలిపారు. బుధవారం ఆమె భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ ఆర్థిక విధాన వేదిక' కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ అంశం ప్రస్తావించారు. కొత్త కార్మిక చట్టం గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు నిర్వచనం ఇవ్వడంతో పాటు వారికి సామాజిక భద్రత కల్పించాలని నిర్దేశించిందని చెప్పారు. కాగా, గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు పెన్షన్, ఆరోగ్య బీమా సదుపాయం కల్పిస్తామని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అక్టోబరులో ప్రకటించారు. దేశంలో 2020-21 నాటికి ఈ కార్మికులు 77 లక్షల మంది ఉన్నారని నీతి ఆయోగ్ అంచనా వేయగా... 2029-30 కల్లా వారి సంఖ్య 3 కోట్లు దాటుతుందని భావిస్తున్నారు.

'జమిలి'తో పెరగనున్న జీడీపీ!

» 1 నుంచి 1.5 శాతానికి పెరుగుతుంది: కోవింద్



న్యూఢిల్లీ, డిసెంబరు 11: జమిలి ఎన్నికలతో దేశంలో సమూల మార్పులు చోటుచేసుకుంటాయని ఈ ఎన్నికలకు సంబంధించి కేంద్రం నియమించిన కమిటీ ఛైర్మన్, మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ అన్నారు. జమిలి ఎన్నికల నిర్వహణ వల్ల దేశ జీడీపీ 1 శాతం నుంచి 1.5 శాతానికి పెరుగుతుందన్నారు. ఇది ఆర్థిక నిపుణులు చెబుతున్న విషయమని తెలిపారు. లోక్‌సభకు, దేశంలోని అన్ని రాష్ట్రాల శాసనసభలకు కలిపి ఒకేసారి జమిలి ఎన్నికల నిర్వహించాలన్నది ఏ ఒక్క రాజకీయ పార్టీ అభిప్రాయమో కాదని, దేశ ప్రజలందరి కోరిక అని కోవింద్ చెప్పారు. అయితే ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఇతర పార్టీల ఆమోదం పొందాలని సూచించారు. జమిలి ఎన్నికల ప్రతిపాదనను కేంద్ర మంత్రివర్గం ఈ ఏడాది సెప్టెంబరులోనే ఆమోదించిన విషయం తెలిసిందే. దీని ప్రకారం.. లోక్‌సభకు, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంతోపాటు ఆ తరువాత 100 రోజుల్లో మున్సిపాలిటీలు, పంచాయతీ ఎన్నికలను పూర్తి చేయాల్సి ఉంటుంది.

లోకం తీరు



రియల్టర్‌ను అపహరించిన వైసీపీ నేత

» రూ.రెండు కోట్లు ఇవ్వాలంటూ బెదిరింపు

» ఇవ్వలేననడంతో కొండపై నుంచి తోసివేత

» గుంటూరు జిల్లా నల్లపాడులో ఘటన


చికిత్స పొందుతున్న నాగేశ్వరరావు

గుంటూరు, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక అరాచకాలతో వైసీపీ నేతలు రెచ్చిపోతున్నారు. గుంటూరు జిల్లా నల్లపాడుకు చెందిన ఇమిడాబత్తిని నాగేశ్వరరావు అనే వ్యక్తి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. మిర్చి వ్యాపారం చేసే అదే గ్రామానికి చెందిన వైసీపీ నేత దుగ్గెంపూడి లెనిన్‌రెడ్డి దురలవాట్ల కారణంగా అప్పుల పాలయ్యాడు. కష్టపడకుండా డబ్బు సంపాదించాలని లెనిన్‌రెడ్డి పథకం రూపొందించాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం నాగేశ్వరరావును లెనిన్‌రెడ్డి అపహరించాడు. 'పని ఉంది.. మెయిన్‌రోడ్డు దాకా వెళదాం' అంటూ ఆయనను కారు ఎక్కించుకున్నాడు. ఆ తర్వాత అటూ ఇటూ తిప్పి చివరకు కైలాసగిరి కొండ వద్దకు లెనిన్‌రెడ్డి తీసుకెళ్లాడు. దీంతో తనను అపహరించారని నాగేశ్వరరావు గ్రహించారు. అక్కడ ఓ న్యాయవాది, మరో వ్యక్తి...లెనిన్‌రెడ్డి వెంట ఉన్నారు. వారంతా నాగేశ్వరరావును రూ.2కోట్లు ఇవ్వాలని బెదిరించారు. అంత డబ్బు తన వద్ద లేదని చెప్పగా, రెండు కోట్లు ఇవ్వకుంటే ఇదే ఆఖరి రోజు అంటూ లెనిన్‌రెడ్డి బెదిరించాడు. అయినా నాగేశ్వరావు లొంగక పోవడంతో...టవల్‌తో రెండు చేతులు వెనక్కు విరిచికట్టి కొండపై నుంచి కిందకు నెట్టేశాడు. అప్పుడే అటుగా వచ్చిన స్థానిక యువకుడు.. తీవ్ర గాయాలతో పడి ఉన్న నాగేశ్వరరావు వద్దకు వచ్చాడు. ఆ యువకుడి సాయంతో ఆయన అక్కడి నుంచి బయటపడ్డారు. నేరుగా జీజీహెచ్‌కు వెళ్లి అడ్మిట్ అయ్యారు. కాగా, లెనిన్‌రెడ్డిపై గతంలో పలు కేసులు ఉన్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. లెనిన్ రెడ్డి సోదరుడు బాల అంజిరెడ్డి పై కూడా పలు కేసులు ఉన్నాయని పోలీసులకు వెల్లడించారు.

ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రంగా ఏపీ

» కొత్త ఏపీ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ విడుదల

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విజన్-2047లో భాగంగా ఏపీని విద్యుత్తు వాహనాల తయారీకి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఆంధ్రప్రదేశ్ సస్టైనబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ (4.0) 2024-29ను ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో పర్యావరణాన్ని పరిరక్షించడంపై దృష్టి సారించిన ప్రభుత్వం విద్యుత్తు వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించింది. దానికి అవసరమైన విద్యుత్తు వాహనాల విడిభాగాలు, చార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీలు, సంబంధిత పరికరాల తయారీదారులకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహకాలను పాలసీలో ప్రకటించారు. వీటిని ఎంఎస్ఎంఈలు పెట్టుబడి రాయితీ రూపంలో క్లెయిమ్ చేసుకోవచ్చు.

భారత్ అమ్ములపొదిలో..
వోరోనెజ్ 'రక్షణ' కవచం!

» గగనతల రక్షణకు రష్యా సాంకేతికత

» 8 వేల కి.మీ దూరంలోనే.. క్షిపణులను గుర్తించే అధునాతన వ్యవస్థ

» 34 వేల కోట్ల డీల్ కోసం భారత్ చర్చలు

» చిత్రదుర్గ వద్ద ఏర్పాటుకు సన్నాహాలు



న్యూఢిల్లీ, డిసెంబరు 11: గగనతల రక్షణలో భారత్ అమ్ములపొదిలో సరికొత్త కవచం చేరనుంది. రష్యాకు చెందిన అల్మాజ్-యాంటీ సంస్థ అభివృద్ధి చేసిన 'వోరోనెజ్ రాడార్' వ్యవస్థ అందుబాటులోకి వస్తే.. శత్రువులు ప్రయోగించే బాలిస్టిక్ క్షిపణులను 8 వేల కిలోమీటర్ల దూరం నుంచే గుర్తించే సామర్థ్యం మన సొంతం అవుతుంది. అంతేకాదు.. శత్రువుల నిఘా విమానాలు(స్టెల్తర్ ఫైటర్), యుద్ధ విమానాలు, అంతరిక్ష వస్తువులను సైతం వోరోనెజ్ రాడార్ వ్యవస్థ గుర్తించగలదు. ఆ వెంటనే అప్రమత్తమై.. శత్రు క్షిపణులు, నిఘా/యుద్ధ విమానాలను గాల్లోనే అడ్డుకుంటుంది.

కర్ణాటకలో ఏర్పాటు

వోరోనెజ్ వ్యవస్థను కర్ణాటకలోని చిత్రదుర్గ వద్ద ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రూ.34 వేల కోట్లతో అల్మాజ్-యాంటీతో ఒప్పందం కుదుర్చుకోనుంది. ఇప్పటికే అల్మాజ్-యాంటీ డిప్యూటీ ఛైర్మన్ వ్లాదిమిర్ మెజీవ్నికోవ్ నేతృత్వంలోని బృందం గత నెల ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో పర్యటించింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు చిత్రదుర్గ సరైన ప్రదేశమని వెల్లడించింది. దీంతో.. డీల్ ఒప్పందాల కోసం డీఆర్‌డీవో అనుబంధ సంస్థ ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్(ఈఆర్‌డీవో) చర్చలు ప్రారంభించింది. ఈ విషయంలో భారత్-రష్యా మధ్య చర్చలు తుది దశలో ఉన్నాయని 'సండే గార్డియన్' ఓ కథనాన్ని ప్రచురించింది. ప్రస్తుతం రష్యా రాడార్, క్షిపణి రక్షణ, గగనతల రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసే అతిపెద్ద కంపెనీల్లో అల్మాజ్-యాంటీ ఒకటి కావడం గమనార్హం..!

మేకిన్ ఇండియాకు ఊతం!

కేంద్ర ప్రభుత్వం రక్షణకు సంబంధించి పూర్తిస్థాయి విదేశీ సాంకేతికతపై మొగ్గుచూపుతోంది. ఒకవేళ విదేశీ కంపెనీల నుంచి కొనుగోళ్లు జరిపినా.. సాంకేతిక బదిలీ అంశంపై దృష్టిసారిస్తోంది. ఈ క్రమంలో 50 దాకా భారత భాగస్వాములు, స్టార్టప్ లు వోరోనెజ్ వ్యవస్థలో 60% ఉద్పాదకతను చేపడతాయని తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

ఎలా పనిచేస్తుంది..?

- వోరోనెజ్ వ్యవస్థ 8 వేల కిలోమీటర్ల దూరంలోనే శత్రువుల బాలిస్టిక్ క్షిపణులను గుర్తించగలదు. ఈ వ్యవస్థలోని ఒక రాడార్ శత్రు క్షిపణిని గుర్తించి, యాక్టివేట్ అయితే.. మరో రీజియన్‌లోని రాడార్ గనక అదే క్షిపణిని గుర్తిస్తే.. మొదటి రాడార్‌కు అదనపు సమాచారాన్ని అందజేస్తుంది.
- యుద్ధ విమానాలు, స్టెల్తర్ ఫైటర్లు, అంతరిక్ష వస్తువులను కూడా ఈ రాడార్లు గుర్తించి, వెంటనే సమాచారాన్ని అందజేస్తాయి.
- ఈ రాడార్లలోని అరే టెక్నాలజీ.. శత్రువుల టార్గెట్లను వేగంగా పసిగడతాయి.
- డ్నెపర్, డారిల్ వంటి పాత తరం రాడార్ వ్యవస్థలకంటే వోరోనెజ్ వ్యవస్థ సమర్థంగా పనిచేస్తుంది. రష్యా వద్ద ఉన్న వోరోనెజ్ రాడార్ వ్యవస్థ ఆ దేశం మొత్తానికి రక్షణగా నిలుస్తోంది.
- ఒప్పందం కుదిరితే.. భారత్‌కు వోరోనెజ్-ఎం రకం రాడార్లు వచ్చే అవకాశాలున్నాయి. ఈ రకం రాడార్లు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే శత్రువుల క్షిపణులను గుర్తిస్తాయి. మధ్యశ్రేణి, దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణుల నుంచి రక్షణ కల్పిస్తాయి. దీంతోపాటు.. వోరోనెజ్-ఎం(వీహెచ్ఎఫ్ బ్యాండ్) కూడా ఇవే పనులను చేస్తుంది. వోరోనెజ్-డీఎం(యూహెచ్ఎఫ్ బ్యాండ్) చిన్న లక్ష్యాలను సైతం మెరుగైన రిజల్యూషన్‌తో.. అత్యంత కచ్చితంగా ట్రాక్ చేస్తాయి.

చైనా-పాక్‌ల నుంచి రక్షణ

చైనా, పాకిస్థాన్ ప్రయోగించే క్షిపణుల నుంచి ఈ వ్యవస్థ ముందస్తు హెచ్చరికలను అందించగలదు. ఇది అయానోస్పియర్ నుంచి.. తిరిగి భూమికి వచ్చే అధిక ఫ్రీక్వెన్సీ సంకేతాలను ప్రసారం చేస్తుంది. అవి దీర్ఘశ్రేణి క్షిపణులు, యుద్ధ విమానాలు, నౌకలను గుర్తించగలవు. రష్యా కూడా.. ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా నుంచి ఎదురయ్యే ప్రమాదాలను పర్యవేక్షించడానికి వ్యూహాత్మకంగా వోరోనెజ్-ఎం రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంది. భారత వైమానిక దళానికి కూడా ఇలాంటి రాడార్ వ్యవస్థ అవసరం. సరిహద్దుల్లో చైనా పెద్ద సంఖ్యలో స్టెల్త్ ఫైటర్లు, డ్రోన్లను మోహరించింది. చైనా నుంచి పాకిస్థాన్ జే-35 స్టెల్త్ ఫైటర్లను కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే రష్యాతో ఒప్పందాలు కుదుర్చుకోకూడదని అమెరికా చెబుతున్నా.. భారత్ వోరోనెజ్ వ్యవస్థపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

రాజ్యసభలో అంతరాయాలకు చైర్మన్ ధన్‌ఖడే కారణం

» విసిగిపోయి.. మరో మార్గం లేకే 'అవిశ్వాసం'

» కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. రాజ్యసభలో అంతరాయాలకు చైర్మన్ తీరే కారణమని, ఆయన ప్రవర్తన ఆ పదవి గౌరవానికి విరుద్ధంగా ఉందని మండిపడ్డారు. బుధవారం ఇండియా కూటమి నేతలతో కలిసి రాజ్యసభలో ప్రతిపక్ష నేత కూడా అయిన ఖర్గే మీడియాతో మాట్లాడారు. ధన్‌ఖడ్ ఆయన పదవికి ఉన్న గౌరవాన్ని మరిచి, ప్రభుత్వ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎంతో అనుభవం కలిగిన ప్రతిపక్ష నేతలకూ ఉపన్యాసాలు ఇస్తున్నారని, పాఠశాల హెచ్‌ఎంలా వ్యవహరిస్తున్నారన్నారు. అధికార పక్షానికి వంతపాడుతూ, ప్రతిపక్ష నేతలను మాట్లాడనీయకుండా నిలువరిస్తున్నారని ఆరోపించారు. చైర్మన్‌పై వ్యక్తిగతంగా తమకు ఎలాంటి వ్యతిరేకతా లేదని, అయితే ఆయన తీరుతో విసిగిపోయిన తమకు అవిశ్వాస తీర్మానం తప్ప మరో మార్గం కనిపించలేదని చెప్పారు. 1952 నుంచి ఇప్పటి వరకు ఆర్టికల్ 67 కింద ఉప రాష్ట్రపతికి వ్యతిరేకంగా తీర్మానం రాలేదన్నారు. ఆ పదవిలో కొనసాగినవారు గతంలో ఎన్నడూ రాజకీయాలు చేయలేదని, నిష్పక్షపాతంగా వ్యవహరించారని తెలిపారు

2,155 కోట్లతో భద్రాచలం, కొవ్వూరు రైల్వేలైన్: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని భద్రాచలం, ఆంధ్రలోని కొవ్వూరు(119 కి.మీ) మధ్య కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టును మంజూరు చేశామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. రూ.2,155 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును నిర్మించనున్నట్లు తెలిపారు. లోక్‌సభలో బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

అమరావతే రాజధాని

» మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా అభివృద్ధి పనులు

» హైకోర్టు త్రిసభ్య బెంచ్ తీర్పును అమలు చేస్తాం

» రైతులకు ఇచ్చిన చట్టబద్ధ హామీలను నెరవేరుస్తాం

» మూడేళ్లలో అభివృద్ధి పనులు పూర్తిచేస్తాం

» ఈ అంశాలు పరిగణించి ఎస్‌ఎల్‌పీని పరిష్కరించండి

» ప్రభుత్వం తరఫున సుప్రీంలో సీఎస్ అఫిడవిట్

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతే ఉంటుందని రాష్ట్రప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలుచేశారు. రాజధాని నిర్మాణం కోసం భూములు త్యాగంచేసిన రైతులకు ఇచ్చిన హామీ మేరకు మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. "మాస్టర్ ప్లాన్‌లో పేర్కొన్నట్లు అమరావతి అభివృద్ధికి తోడ్పడే విధంగా నవ నగరాలతో (ఫైనాన్షియల్ సిటీ, గవర్నమెంట్ సిటీ, జస్టిస్ సిటీ, నాలెడ్జ్ సిటీ, మీడియా సిటీ, స్పోర్ట్స్ సిటీ, హెల్త్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ, టూరిజమ్ సిటీలు) అమరావతిని అభివృద్ధి చేస్తాం. ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌లో భాగంగా రైతులతో చేసుకున్న ఒప్పందం మేరకు వారికిచ్చిన అన్ని చట్టబద్ధమైన హామీలను నెరవేరుస్తాం. రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు తిరిగి ఇచ్చిన తరువాత ఏపీసీఆర్డీయే వద్ద ఉన్న భూమిలో నవ నగరాల అభివృద్ధి చేసేందుకు వీలుగా.....పెట్టుబడులను ఆకర్షిస్తాం. వివిధ సంస్థలకు భూములు కేటాయిస్తాం. ఉద్యోగావకాశాలు, మౌలిక వసతులు కల్పిస్తాం. హైకోర్టు, అసెంబ్లీ, కౌన్సిల్, రాష్ట్ర సచివాలయం కోసం శాశ్వత భవనాలు సిద్ధమైన తరువాత ప్రస్తుతం ఉన్న భవనాలను ఇతర అవసరాల కోసం వినియోగిస్తాం. హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, అఖిలభారత సర్వీస్ అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాసాల కోసం 2018-19లోనే భవన నిర్మాణాలు ప్రారంభమయ్యాయి" అని సీఎస్ తెలిపారు.

కోర్టు ఏం చెప్పిందంటే..

2019 సాధారణ ఎన్నికల తరువాత కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం అమరావతి అభివృద్ధి పనులను పూర్తిగా పక్కన పెట్టేసిందని సీఎస్ తన కౌంటరులో వెల్లడించారు. "2020లో మూడు రాజధానుల ఏర్పాటుకు వీలుగా సీఆర్డీయే చట్టాన్ని అప్పటి ప్రభుత్వం సవరించింది. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా ప్రభుత్వం రాజధాని అమరావతిని అభివృద్ధి చేపట్టకపోవడాన్ని సవాల్ చేస్తూ రైతులు అదే ఏడాది హైకోర్టును ఆశ్రయించారు. ఆ వ్యాజ్యాలపై తుది విచారణ జరిపిన హైకోర్టు 2022 మార్చి 3న రైతులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. రాజధాని అమరావతి అభివృద్ధి కోసం పలు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను అనుసరించి.. భూ సమీకరణలో భాగంగా రైతులతో చేసుకున్న ఒప్పందం మేరకు అమరావతి రాజధాని నగరాన్నీ, రాజధాని ప్రాంతాన్నీ ఆరునెలల్లో నిర్మించాలి.. అభివృద్ధి చేయాలి.. సీఆర్డీఏ చట్టంలోని సెక్షన్ 58 ప్రకారం అమరావతి రాజధాని నగరం, రాజధాని ప్రాంతంలో కనీస అవసరాలైన రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను తీర్పు ఇచ్చిన తేదీ నాటి నుంచి నెలరోజుల్లో పూర్తి చేయాలి. సెక్షన్ 61 ప్రకారం టౌన్‌ప్లానింగ్ స్కీమ్‌ల కింద నవ నగరాలను పూర్తి చేయాలి. భూసమీకరణ కింద భూములు ఇచ్చిన రైతులకు తిరిగి ఇచ్చే పునర్నిర్మించిన ప్లాట్లు...నివాసానికి సరిపోయే విధంగా అప్రోచ్ రోడ్లు, తాగునీరు, ప్రతి ప్లాట్‌కు విద్యుత్ కనెక్షన్, డ్రైనేజీ సదుపాయాలు కల్పించాలి. తీర్పు ఇచ్చిన తేదీ నాటి నుంచి మూడు నెలల్లో అభివృద్ధి చేసిన ప్లాట్లను భూములు ఇచ్చిన రైతులకు అప్పగించాలి. భూసమీకరణ పథకం ద్వారా రైతుల నుంచి తీసుకున్న భూమిని రాజధాని నగర నిర్మాణం, రాజధాని ప్రాంత అభివృద్ధికి వినహా, ఇతరులకు అన్యాక్రాంతం/తనఖాపెట్టడంకానీ, థర్డ్ పార్టీకి హక్కులు కల్పించవద్దని రాష్ట్ర ప్రభుత్వం, సీఆర్డీఏను ఆ తీర్పులో హైకోర్టు ఆదేశించింది" అని సీఎస్ తెలిపారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్‌పీ) దాఖలు చేసిందని పేర్కొన్నారు. "మారిన పరిస్థితుల నేపథ్యంలో హైకోర్టు నిర్దేశించిన కాలపరిమితి లోపు పనులు పూర్తి చేయడం సాంకేతికంగా సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో వచ్చే మూడేళ్లలోపు హైకోర్టు నిర్దేశించిన వివిధ అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన పూర్తి చేస్తాం. వీటి అన్నింటితోపాటుగా కోర్టు ఇచ్చే ఆదేశాలను అమలు చేస్తాం. అందులోభాగంగా.. ఫామ్ 9.14 మేరకు రైతులతో చేసుకున్న ఒప్పందం ప్రకారం సీఆర్డీయే చట్టంలో పేర్కొన్న విధంగా ఏపీ రాష్ట్రానికి ఏకైక రాజధానిగా అమరావతి నగరాన్ని అభివృద్ధి చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వ విభాగాలన్నీ అమరావతిలోనే ఉంటాయి. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎస్ఎల్‌పీని పరిష్కరించండి" అని సీఎస్ తన కౌంటర్‌లో కోరారు.

సూసైడ్ నోట్‌తో బయటపడ్డ భార్య క్రూరత్వం

బెంగళూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అతుల్ సుభాష్ ఆత్మహత్య తర్వాత వెలుగులోకి వచ్చిన 40 పేజీల సూసైడ్ నోట్.. ఆయన భార్య క్రూరత్వాన్ని బయటపెట్టింది. బెంగళూరులో అతుల్ ఆత్మహత్యకు పాల్పడిన విషయం సోమవారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అతుల్ 2019లో నిఖితను పెళ్లి చేసుకున్నారు. ఆమె ఢిల్లీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. మనస్పర్థలు రావడంతో భార్య నిఖిత, అత్త నిశా, బావమరిది అనురాగ్, భార్య మేనమామ సుశీల్ తనను వేధించారని అతుల్ సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. తనపై హత్యాయత్నం, వరకట్న వేధింపులు, అసహజ లైంగిక వేధింపుల ఆరోపణతో యూపీలో 9 కేసులు నమోదు చేశారని, ఆ కేసుల్లో రాజీ కోసం రూ.3 కోట్లు డిమాండ్ చేశారని వివరించారు. ప్రతి కేసులోనూ బెంగళూరు నుంచి యూపీ కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదని, ఏడాదిలో 40 సార్లు నోటీసులు వచ్చాయని లేఖలో పేర్కొన్నారు. తన నాలుగేళ్ల కుమారుడిని చూసేందుకూ రెండేళ్లుగా అనుమతించడంలేదని తెలిపారు. తెలంగాణ హైకోర్టులో దాఖలైన ఓ వరకట్న వేధింపుల కేసును కొట్టివేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా అతుల్ ఆత్మహత్య అంశాన్ని తాజాగా సుప్రీంకోర్టు ప్రస్తావించింది. వరకట్న వేధింపుల చట్టాన్ని మహిళలు దుర్వినియోగం చేసే ప్రవృత్తి దేశంలో పెరుగుతోందని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం అభిప్రాయపడింది. వరకట్నం కేసులను నిర్ధారించే ముందు అనవసరమైన వేధింపులను నియంత్రించాలని దిగువ కోర్టులకు సూచించింది. ఆత్మహత్యకు ముందు అతుల్ చేసిన 80 నిమిషాల వీడియో, 40 పేజీల సూసైడ్ నోట్‌లోని అంశాలను ధర్మాసనం ప్రస్తావించింది.

కాబోయే కోడలికి కీలక పదవి అప్పగించిన ట్రంప్



వాషింగ్టన్, డిసెంబరు 11: అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్ వరుసగా తన బంధువులకు కీలక పదవులు అప్పగిస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు వియ్యంకులకు కీలక బాధ్యతలు అప్పగించిన ఆయన తాజాగా కాబోయే కోడలు కింబర్లీ గిల్ఫోయిల్‌కు కీలక పదవిని కట్టబెట్టారు. ఆమెను గ్రీస్‌కు అమెరికా రాయబారిగా నియమిస్తున్నట్లు ట్రంప్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ట్రంప్ పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్‌కు కింబర్లీకి 2020లో నిశ్చితార్థం జరిగింది.

బీజేపీ ఎంపీల వ్యాఖ్యలను తొలగించండి

» సభ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోండి

» లోక్‌సభ స్పీకర్‌కు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విజ్ఞప్తి



న్యూఢిల్లీ, డిసెంబరు 11: కాంగ్రెస్-సోరోస్ అంశంలో తనని అవమానించేలా బీజేపీ ఎంపీలు సభలో చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను బుధవారం స్వయంగా కలిసిన రాహుల్ గాంధీ.. సభ సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాహుల్ గాంధీకి హంగేరికి చెందిన బిలియనీర్ జార్జి సోరోస్‌కు సంబంధాలు ఉన్నాయని బీజేపీ ఎంపీలు నిషికాంత్ దూబే, సంబిత్ పాత్రా డిసెంబరు 5న ఆరోపించారు. ఆ మరుసటి రోజున నిషికాంత్ దూబే లోక్‌సభలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ హస్తం సోరోస్ చేతిలో ఉందని, అమెరికా ప్రభుత్వం, జార్జి సోరోస్ ఇచ్చే నిధులతో పని చేసే ఓసీసీఆర్‌పీ(ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు)తో కాంగ్రెస్‌కు సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. భారత్ జోడో యాత్ర కోసం రాహుల్ గాంధీ.. సోరోస్ దగ్గర డబ్బు తీసుకున్నారా ? అని ప్రశ్నించారు. తీవ్ర దుమారం రేపిన ఈ వ్యాఖ్యలనే రికార్డుల నుంచి తొలగించాలని రాహుల్ కోరారు. అయితే, తాను చేసిన విజ్ఞప్తికి సభాపతి సానుకూలంగా స్పందించారని, తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని స్పీకర్‌తో భేటీ అనంతరం రాహుల్ గాంధీ విలేకరులతో అన్నారు. అదానీ అంశంపై చర్చ జరగకూడదనే లక్ష్యంతో బీజేపీ ఎంపీలు తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

రాజ్‌నాథ్‌కు గులాబీ

ఓవైపు అదానీ, మోదీ చిత్రాలు.. మరోవైపు 'అదానీ-మోదీ భాయ్ భాయ్' అనే మాటలు ముద్రించి ఉన్న సంచులతో మంగళవారం పార్లమెంట్ వద్ద నిరసన తెలియజేసిన ఇండియా కూటమి ఎంపీలు బుధవారం మరింత వినూత్నంగా తమ నిరసన తెలియజేశారు. పార్లమెంట్ భవనం ప్రవేశ ద్వారం వద్ద బీజేపీ ఎంపీలకు జాతీయ జెండా(త్రివర్ణ పతాకం ముద్రించిన కార్డులు), చిన్న గులాబీ పువ్వు ఇచ్చి స్వాగతిస్తూ సభ సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఇదే క్రమంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు రాహుల్ గాంధీ జాతీయ జెండా, గులాబీ పువ్వు అందజేశారు. కానీ, రాజ్‌నాథ్ వాటిని స్వీకరించకుండానే ముందుకు వెళ్లిపోయారు. కాగా, ఎంతో మంది సామాన్యులకు జీవనాడి లాంటి ప్రభుత్వ రంగ బ్యాంకు(పీఎస్‌బీ)లను మోదీ ప్రభుత్వం.. కొన్ని ధనిక, శక్తిమంతమైన సంస్థలకు ప్రైవేటు పెట్టుబడి సంస్థలుగా మార్చేసిందని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. బుధవారం అఖిల భారత బ్యాంకింగ్ అధికారుల సమాఖ్యకు చెందిన ప్రతినిధులతో రాహుల్ సమావేశమయ్యారు. అనంతరం 'ఎక్స్'లో ఈ మేరకు పోస్టు చేశారు. తన మోసపూరిత స్నేహితుల కోసం ప్రభుత్వ రంగ బ్యాంకులను అపరిమిత నిధుల వనరుగా చూడటాన్ని మోదీ ప్రభుత్వం ఇకనైనా నిలివేయాలని అన్నారు.


నెహ్రూ-గాంధీ కుటుంబం, సోరోస్‌ది ఎన్నో ఏళ్ల బంధం


కాంగ్రెస్- సోరోస్ అంశంలో బీజేపీ తన దాడిని తీవ్రం చేసింది. నెహ్రూ-గాంధీ కుటుంబం, జార్జి సోరోస్ మధ్య బంధం ఈనాటి కాదని, ఎన్నో ఏళ్ల అనుబంధమని పేర్కొంటూ బుధవారం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. జార్జి సోరోస్ మాదిరిగానే హంగేరికి చెందిన ఫోరీ నెహ్రూ.. జవహర్‌లాల్ నెహ్రూ కుటుంబానికి చెందిన బీకే నెహ్రూను వివాహం చేసుకున్నారని, తద్వారా ఫోరీ నెహ్రూకు రాహుల్ గాంధీతో చుట్టరికం ఉందని బీజేపీ పేర్కొంది. బీకే నెహ్రూ అమెరికాలో భారత రాయబారిగా పని చేసిన రోజుల్లో జార్జి సోరోస్ పలుమార్లు ఫోరీ నెహ్రూను కలిశారనేందుకు ఆధారాలున్నాయని తెలిపింది. ఈ నేపథ్యం నెహ్రూ-గాంధీ కుటుంబం తమ ఆర్థిక ప్రగతి కోసం దేశ ప్రయోజనాల విషయంలో ఎంత మేరకు రాజీపడిందనే ప్రశ్నలు లేవనెత్తుతుందని బీజేపీ పేర్కొంది.

ట్రంప్ కార్యవర్గంలో బిలియనీర్లు

» అందరి సంపద కలిపి 382 బిలియన్ డాలర్లు

» 172 దేశాల జీడీపీ కన్నా వారి ఆస్తి ఎక్కువ


ఎలాన్ మస్క్


వివేక్ రామస్వామి


ఐజాక్‌మన్

వాషింగ్టన్, డిసెంబరు 11: మధ్యతరగతి అమెరికన్లను రక్షిస్తాం.. సాధారణ అమెరికా పౌరుల కోసం పోరాడతాం.. అని ఎన్నికల ప్రచారంలో డొనాల్డ్ ట్రంప్ పదేపదే చెప్పారు. అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఇప్పుడు ఆ మధ్యతరగతి కోసం తన కార్యవర్గంలోకి అపర కుబేరులను ఎంపిక చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు తన కార్యవర్గంలోకి బిలియనీర్లు అయిన ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి, లిండా మెక్‌మహోన్, హోవార్డ్ లుట్నిక్, డగ్ బర్గమ్, స్కాట్ బెసెంట్, జారెడ్ ఐజాక్‌మన్, స్టీవెన్ విట్కాఫ్, వారెన్ స్టీఫెన్స్‌లను తీసుకున్నారు. ప్రస్తుతం వీరి మొత్తం ఆస్తి విలువ సుమారు 382.2 డాలర్లు. అంటే దాదాపు రూ. 32 లక్షల కోట్లు. ఇది ఎంత పెద్ద సంపద అంటే.. ప్రపంచంలో 172 దేశాలకు అంత జీడీపీ కూడా లేదు. కాగా, ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ కేబినెట్‌లోని వారి మొత్తం సంపద 118 మిలియన్ డాలర్లు. అయితే గతంలో ట్రంప్ కేబినెట్ మొత్తం ఆస్తి విలువ 6.2 బిలియన్ డాలర్లు మాత్రమే అని ఫోర్బ్స్ వెల్లడించింది.

ట్రంప్ కార్యవర్గంలోకి కుబేరులు

ఎలాన్ మస్క్: డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీకి అధిపతిగా ప్రపంచ కుబేరుడు మస్క్‌ను ట్రంప్ ఎంపిక చేసుకున్నారు. మస్క్ ప్రస్తుత సంపద మొత్తం 363.3 బిలియన్ డాలర్లు.

వారెన్ స్టీఫెన్స్: బ్రిటన్‌లో అమెరికా రాయబారిగా స్టీఫెన్స్‌ను ట్రంప్ ఎంపిక చేశారు. వారసత్వంగా వచ్చిన ఆర్థిక సేవల కంపెనీ స్టీఫెన్స్ ఇన్‌కార్పోరేషన్‌కు అధిపతి వారెన్ స్టీఫెన్స్. అతని మొత్తం ఆస్తి 3.4 బిలియన్ డాలర్లు.

లిండా మెక్‌మహోన్: ప్రపంచ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు మెక్‌మహోన్ కో ఫౌండర్. లిండాకు విద్యాశాఖ పగ్గాలు అప్పగించే అవకాశముంది. మెక్‌మహోన్ కుటుంబం సంపద 3 బిలియన్ డాలర్లు.

జారెడ్ ఐజాక్‌మన్: నాసా అధిపతిగా ఐజాక్‌మన్‌ను ట్రంప్ ఎంపిక చేశారు. మస్క్‌కు సన్నిహితుడైన ఆయన స్పేస్ ఎక్స్‌లో పెట్టుబడి పెట్టారు. ఐజాక్‌మన్ మొత్తం ఆస్తి విలువ 1.7 బిలియన్ డాలర్లు.

హోవార్డ్ లుట్నిక్: కేంటర్ ఫిట్జ్‌గెరాల్డ్ అనే ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్‌కు హోవార్డ్ అధిపతి. కామర్స్ సెక్రటరీగా ట్రంప్ అవకాశం ఇచ్చారు. లుట్నిక్ మొత్తం ఆస్తి విలువ 1.5 బిలియన్ డాలర్లు.

వివేక్ రామస్వామి: మస్క్‌తో పాటు డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీని లీడ్ చేసే అవకాశం వివేక్‌కు ట్రంప్ ఇచ్చారు. ఆయన మొత్తం ఆస్తి విలువ ఒక బిలియన్ డాలర్లు.

స్టీవెన్ విట్కాఫ్: మధ్యప్రాచ్యానికి ప్రత్యేక రాయబారిగా విట్కాఫ్‌ను ట్రంప్ ఎంపిక చేశారు. ఫ్లోరిడాలో రియల్ ఎస్టేట్ పెట్టుబడిదారుడైన విట్కాఫ్ మొత్తం సంపద విలువ ఒక బిలియన్ డాలర్లు.

రజనికి బిగుస్తున్న ఉచ్చు!

- మాజీ మంత్రిపై ఏసీబీ విచారణ
- ప్రభుత్వానికి విజిలెన్స్ సిఫారసు
- 2కోట్ల ముడుపులు తీసుకున్నట్లు నిర్ధారణ
- ఆమె చెబితేనే క్రషర్‌పై దాడులు: జాషువా

(గుంటూరు సిటీ-ఆంధ్రజ్యోతి)



వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజనికి ఉచ్చు బిగుస్తోంది. పల్నాడు జిల్లా యడ్లపాడుకు చెందిన శ్రీలక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి రూ.2.20 కోట్లు అక్రమంగా వసూలు చేసిన వ్యవహారంలో ఆమెపై ఏసీబీ విచారణ జరిపించాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రభుత్వానికి సిఫారసు చేసింది. బాధితుని వద్ద నుంచి రజని రూ.2 కోట్లు, గుంటూరు విజిలెన్స్ మాజీ ఏఎస్పీ పి.జాషువా రూ.10 లక్షలు, రజని పీఏ రూ.10 లక్షలు బెదిరించి తీసుకున్నట్లు విజిలెన్స్ నిర్ధారించింది. రజని మంత్రిగా ఉన్నప్పుడు చిలకలూరిపేట నియోజకవర్గంలో భారీ బెదిరింపులకు పాల్పడ్డారు. పలువురు వ్యాపారులను నేరుగా బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. యడ్లపాడులోని శ్రీలక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ పార్టనర్ నంబూరి శ్రీనివాసరావుని రూ.5కోట్లు ముడుపులు ముట్టజెప్పాలని బెదిరించారు. మొదట బాధితులను కార్యాలయానికి పిలిపించిన రజని పీఏ బేరం మాట్లాడారు. తామెందుకు డబ్బులివ్వాలని బాధితులు నిలదీయడంతో రజని నేరుగా సీన్‌లోకి వచ్చారు. అడిగినంత ఇవ్వకపోతే ఇబ్బందులు పడతారని రజని బెదిరించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ముడుపులు ముట్టజెప్పేందుకు క్రషర్ యజమానులు ఒప్పుకోకపోవడంతో ఏఎస్పీ జాషువాను రంగంలోకి దించారు. జాషువా ఆ సంస్థ వ్యాపారలావాదేవీలపై తనిఖీలు చేశారు. పలుమార్లు క్రషర్‌కి వెళ్లిన జాషువా బృందం రూ.50కోట్ల వరకు మైనింగ్ రాయల్టీ ఎగ్గొట్టినట్లు ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని బెదిరించారు. దీంతో బాధితులు రజనికి రూ.2కోట్లు, జాషువాకు రూ.10 లక్షలు, మంత్రి పీఏకి రూ.10 లక్షలు సమర్పించుకున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత క్రషర్ పార్టనర్ నంబూరి శ్రీనివాసరావు తమకు జరిగిన అన్యాయంపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను అందజేశారు. ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించేందుకు నాటి విజిలెన్స్ ఏఎస్పీ జాషువా నకిలీ తనిఖీలు చేపట్టినట్లు తేల్చారు. ఒక సంస్థపై విచారణ జరపాలంటే డీజీ అనుమతి తీసుకోవాలి. అనుమతి ఏమీ లేకుండానే ఏఎస్పీ క్రషర్ యజమానులను విచారణ పేరుతో వేధించినట్లు అధికారులు తేల్చారు. ముడుపుల విషయంలో తమకు సంబంధం లేదని రజని, ఆమె పీఏ చెప్పినప్పటికీ, డబ్బులు తీసుకున్నట్లుగా విజిలెన్స్ అధికారులు ఆధారాలు సేకరించి నివేదికలో పొందుపరిచారు. రజని ఒత్తిడితోనే ఫేక్ విచారణ చేపట్టినట్లు జాషువా అంగీకరించినట్లు తెలుస్తోంది. అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను విజిలెన్స్ అధికారులు సేకరించారు. నియోజకవర్గంలోని మరికొన్ని క్రషర్ల యజమానులను కూడా రజనీ బృందం బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ముడుపుల వ్యవహారం కేసును ఏసీబీకి అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నివేదిక అక్టోబరులోనే ప్రభుత్వానికి చేరింది. త్వరలో ఏసీబీ విచారణకు ప్రభుత్వం ఆదేశించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

నరకం చూపించారు

విడదల రజనీ మంత్రిగా ఉన్నప్పుడు మమ్మల్ని చాలా వేధించారు. మొదట రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మేము లొంగకపోవడంతో విజిలెన్స్ విచారణ పేరుతో నరకం చూపించారు. అప్పటి విజిలెన్స్ ఏఎస్పీ జాషువా కూడా ఇందులో కీలక పాత్ర పోషించారు. ఏ నాయకుడి దగ్గరకు వెళ్లి చెప్పుకున్నా న్యాయం జరగలేదు. చేసేది లేక రూ.2.20 కోట్లు సమర్పించుకున్నాం.

- నంబూరు శ్రీనివాసరావు, శ్రీ లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ పార్టనర్

రాజమండ్రి టు ఢిల్లీ.. నేటి నుంచి ఇండిగో ఎయిర్‌బస్

రాజమహేంద్రవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని మధురపూడి విమానాశ్రయం నుంచి ఢిల్లీకి గురువారం నుంచి ఇండిగో ఎయిర్ బస్ సర్వీసు మొదలవుతుందని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు చెప్పారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ గురువారం ఉదయం 6.30కు ఢిల్లీ నుంచి, మధురపూడి నుంచి ఉదయం 9కి ఢిల్లీ బయలుదేరుతుందన్నారు.

ప్యాలెస్ రాజ్ పోయింది పనిచేసే ప్రభుత్వమొచ్చింది

- 6 నెలల్లో అనేక ప్రజానుకూల నిర్ణయాలు: టీడీపీ

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ప్యాలెస్ రాజ్ పోయింది. పనిచేసే ప్రభుత్వం వచ్చింది. ప్రభుత్వం ఏం పనిచేస్తోందో ప్రజలకు ప్రతి రోజూ కనిపిస్తోంది' అని తెలుగుదేశం పార్టీ వ్యాఖ్యానించింది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఆప్కాబ్ మాజీ ఛైర్మన్ టీడీ జనార్దనరావు, పార్టీ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి బుధవారం ఇక్కడ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఆరు నెలల్లో అనేక ప్రజానుకూల నిర్ణయాలు తీసుకొంది. పింఛను రూ.1,000 పెంచి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు రెండు నెలలూ కలిపి మరీ ఇచ్చారు. ఈ పద్దు కింద ఐదేళ్లలో పేదలకు రూ.1.60 లక్షల కోట్లు ఈ ప్రభుత్వం పంపిణీ చేయనుంది. 198 అన్న క్యాంటీన్లను తిరిగి తెరిచింది. దీపం పథకం కింద 80 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తోంది. రూ.861 కోట్లతో రోడ్ల మరమ్మతులు చేపట్టింది. ఉచిత ఇసుక పథకం కింద తక్కువ ధరకు ఇసుకను ప్రజలకు అందచేస్తోంది. జే బ్రాండ్లు ఎత్తివేసి తక్కువ ధరకు నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేస్తోంది. అమరావతికి రూ.15 వేల కోట్లు, పోలవరానికి రూ.12 వేల కోట్లు కేంద్రం నుంచి సాధించి పనులు మొదలు పెట్టారు. రూ.నాలుగున్నర వేల కోట్లతో 13 వేల పంచాయితీల్లో 30 వేల పనులు ప్రారంభించారు. సంక్రాంతి నాటికి ఇవి పూర్తవుతాయి. పదహారు వేల ఉపాధ్యాయ పోస్టులు, 6,000 పోలీసు ఉద్యోగాల భర్తీ చేపట్టారు. రూ.నాలుగు లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడంతో ఐదు లక్షల మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయి. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసేసి లాండ్ గ్రాబింగ్ యాక్ట్ తెచ్చారు. డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారు. విపత్తు సాయం ఒక హెక్టారుకు రూ.10 వేల నుంచి రూ.25 వేలకు పెంచారు. ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లో ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటుకు అసెంబ్లీ తీర్మానం చేసింది. విశాఖ రైల్వే జోన్‌కు 52 ఎకరాల భూమి ఇచ్చారు. రాయలసీమ, ఉత్తరాంధ్రల్లో సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో వేగం పెంచారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించినా కూటమి ప్రభుత్వం ఇన్ని పనులు ఆరు నెలల్లో చేయడం చాలా గొప్ప విషయం' అని వర్ల రామయ్య పేర్కొన్నారు. మాటలు చెప్పి మోసం చేసే ప్రభుత్వం స్థానంలో పనిచేసి చూపించే ప్రభుత్వం వచ్చిందని టీడీ జనార్దన్ అన్నారు. లూటీ, లాఠీ ప్రభుత్వం పోయి ప్రజలతో సన్నిహితంగా పనిచేసే ప్రభుత్వం వచ్చిందని, రాష్ట్రంలో ప్రజలు స్వేచ్ఛగా బతకగలిగే వాతావరణం నెలకొందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రాన్ని సకల రంగాల్లో కుప్పకూల్చి వెళ్లిన జగన్ తాను దిగిపోయి ఇంకా ఆరు నెలలు కూడా కాక ముందే కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం మొదలు పెట్టారని గురజాల మాల్యాద్రి ధ్వజమెత్తారు. జగన్మోహన్ రెడ్డి, ఆయన పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ మొహం కూడా చూడటం లేదని, ప్యాలెస్‌లో కూర్చుని బురద చల్లి వినోదిస్తున్నారని విమర్శించారు. జగన్ వసూలు చేసిన లంచాలు, కొట్టేసిన వాటాలు రోజుకొకటి వెలుగులోకి వస్తుంటే వాటికి సమాధానం చెప్పే దమ్ము లేక టీడీపీపై ఆరోపణలతో కాలం గడుపుతున్నారని ఆరోపించారు.

'అనంత'లో 14 నుంచి హెచ్‌ఆర్‌ఎఫ్ మహాసభలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలకు సంబంధించి మానవ హక్కుల వేదిక(హెచ్‌ఆర్‌ఎఫ్) 10వ రాష్ట్ర మహాసభలు ఈనెల 14,15 తేదీల్లో అనంతపురంలో నిర్వహించనున్నారు. ఈమేరకు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యాజీ శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కులగణనపై ఎస్ఎన్ సాహూ.. బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలపై మాలిని సుబ్రహ్మణ్యం... కాషాయీకరణ, కార్పొరేటీకరణపై విశ్రాంత చరిత్ర అధ్యాపకుడు కొప్పర్తి వెంకటరమణమూర్తి ప్రసంగిస్తారని తెలిపారు.

ఆన్‌లైన్‌లో పేరున్నా... భూమి లేదంటున్నారు

- అధికారులపై దళితుడి ఫిర్యాదు
- కేటాయించిన స్థలాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది
- 'దేశం' నేతలకు దళితులు, గిరిజనుల విజ్ఞప్తి

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): 'రెవెన్యూ రికార్డుల్లో నా తండ్రి పేరుతో భూమి ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నా భూమి లేదని అధికారులు అబద్ధాలు చెబుతున్నారు' అని దళితుడు కర్ర యోహాను ఫిర్యాదు చేశారు. బుధవారం ఆయన టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఈమేరకు వినతి పత్రం ఇచ్చారు. మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఈ వినతులు స్వీకరించారు. 'బాపట్ల జిల్లా రేపల్లె మండలం రాజుకాలువలో గతంలో నా తండ్రికి ప్రభుత్వం భూమి ఇచ్చింది. దానికి హక్కులు కల్పించాలని తిరుగుతుంటే అసలు భూమే లేదని అధికారులు దబాయిస్తున్నారు' అని యోహాను వాపోయారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం గుత్తికొండ నుంచి దళితులు, గిరిజనులు.. 'మాకు టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. మళ్లీ వాటిని మంజూరు చేయాలి' అని విజ్ఞప్తి చేశారు. 'నా పొలాన్ని కబ్జా చేశారు. నన్ను చంపడానికి చూస్తున్నారు' అంటూ బాపట్ల జిల్లా చుండూరుకు చెందిన సిడెపూడి శ్రీనివాసరెడ్డి కోరారు. నంద్యాల మండలం కొత్తపల్లెకి చెందిన పసుపులేటి లక్ష్మీదేవి 'నా భర్త భూమిలో ఒక ఎకరం అమ్మి కూతురు పెళ్లి చేశా. నా భర్త బంధువులు మాపై దాడిచేసి ఇంటికి తాళం వేశారు. మమ్మల్ని బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి' అని కోరారు. తన భూమి సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని సంతమాగులూరు మండలం ఫతేపురానికి చెందిన యాగాల కోటేశ్వరరావు కోరారు. నెల్లూరు జిల్లా చిరమనలో కబ్జాకు గురైన తన భూమిని విడిపించాలని చల్లకొలుచు మాలకొండయ్య కోరారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని టీడీపీ నేతలు చెప్పారు.

జగన్ అక్రమాలపై మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి: బీజేపీ

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్ అక్రమాలు తేల్చేందుకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని బీజేపీ ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, పార్థసారథి అన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో బుధవారం 'వారధి'లో పాల్గొన్న కమలం పార్టీ శాసనసభ్యులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... 'ప్రభుత్వమే ఒక మాఫియాగా ఏర్పడి కేవీ రావు లాంటి వ్యాపారవేత్తలను బెదిరించి వాటాలు లాక్కోవడంలాంటి ఘటనలు రోజుకొకటి వెలుగులోకి వస్తున్నాయి. ఆర్.కృష్ణయ్యను రాజ్యసభకు ఎంపిక చేసి బీజేపీ బీసీలకు ప్రాధాన్యమిచ్చే పార్టీ అని మరోమారు నిరూపించుకుంది' అని వ్యాఖ్యానించారు.

'సెకీ'పై కౌంటర్‌ను పరిశీలించాలి

- 2 వారాల గడువు కోరిన ఏజీ.. అంగీకరించిన హైకోర్టు

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ) నుంచి 7వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేసేందుకు గత వైసీపీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాల్లో గత సర్కారు వేసిన కౌంటర్‌ను పరిశీలించాల్సి ఉందని అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు తెలిపారు. అదనపు వివరాలతో అఫిడవిట్ దాఖలు చేస్తామని, 2 వారాల సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. దీనికి అంగీకరించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం.. పిటిషన్లపై విచారణను జనవరి చివరి వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. సెకీ నుంచి యూనిట్ రూ.2.49 చొప్పున 7 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు రాష్ట్రప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని సీఈఆర్సీ నిర్ధారించడాన్ని సవాల్ చేస్తూ టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వేర్వేరుగా పిటిషన్లు వేశారు. సెకీ నుంచి విద్యుత్ కొనుగోలుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలుపడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరారు.

జీవోలన్నీ వరుస క్రమంలోనే అప్‌లోడ్ చేస్తున్నారా?

- పూర్తి వివరాలు సమర్పించండి.. ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

రాష్ట్రప్రభుత్వం జారీచేసే అన్ని జీవోలనూ జీవోఐఆర్ వెబ్‌సైట్‌లో వరుస క్రమంలో అప్‌లోడ్ చేయాల్సిన అవసరం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. ఇదే విధానాన్ని అవలంబిస్తున్నారా? అని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ)ని ఆరా తీసింది. వివరాలు సమర్పించేందుకు ఎస్‌జీపీ సమయం కోరడంతో విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటిరవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ జీవోలను వెబ్‌సైట్‌లో పెట్టకపోవడాన్ని సవాల్ చేస్తూ నెల్లూరుకి చెందిన జీఎంఎన్ఎస్ దేవి, గుంటూరు జిల్లాకు చెందిన కోమటి శ్రీనివాసరావు, న్యాయవాది ఎస్ఆర్ ఆంజనేయులు, తెలుగువన్. కామ్ డిజిటల్ మీడియా ఎండి కంఠంనేని రవిశంకర్, బాపట్ల జిల్లా పరుచూరు మండలానికి చెందిన చెన్నుపాటి సింగయ్య హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. ఇవి బుధవారం విచారణకు రాగా ప్రభుత్వం తరఫున ఎస్‌జీపీ ఎస్.ప్రణతి వాదనలు వినిపించారు. అన్ని జీవోలనూ జీవోఐఆర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు.

హోలోగ్రామ్ కాంట్రాక్టులో ప్రతివాదిగా సీఐడీ

- హైకోర్టు ఉత్తర్వులు.. విచారణ నెల రోజులకు వాయిదా

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మద్యం బాటిళ్లపై హై సెక్యూరిటీ హోలోగ్రామ్ కాంట్రాక్టును వైసీపీ ప్రభుత్వం ఓ సంస్థకు అప్పగించింది. ఆ వ్యవహారంలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. బుధవారం ఆ కేసు విచారణకు రాగా, రాష్ట్ర సీఐడీని ప్రతివాదిగా చేరుస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. వైసీపీ హయాంలో హోలోగ్రామ్ తయారీ, సరఫరా కాంట్రాక్టును 'కుంభత్ హోలో గ్రాఫిక్స్' సంస్థకు అప్పగించారని, ఈక్రమంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని, సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ చెన్నైకి చెందిన సీనియర్ పాత్రికేయుడు వి.శివరామన్ 2021లో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ బుధవారం విచారణకు వచ్చింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చట్టమే గెలవాలి...!

సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ రోజునుంచి ప్రార్థనాస్థలాల (ప్రత్యేక నిబంధనలు)చట్టం–1991మీద దాఖలైన పిటిషన్లను విచారించబోతోంది. స్వాతంత్ర్యం సిద్ధించిన 1947 ఆగస్టు 15నాటికి దేశంలోని ఆయా ప్రార్థనాస్థలాల మతస్థితిని యథాతథంగా పరిరక్షిస్తూ, వాటి స్వరూప స్వభావాలను మార్చే అన్ని ప్రయత్నాలను ఈ చట్టం నిషేధిస్తున్నది. అయోధ్యలో రామజన్మభూమి–బాబ్రీ మసీదు వివాదం నేపథ్యంలో, పీవీ నరసింహారావు ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టం ఆ ఒక్క వివాదాన్ని మాత్రం మినహాయిస్తూ మిగతా ప్రార్థనాస్థలాల జోలికి ఎవరూ పోకుండా అడ్డుకొనే ప్రయత్నం చేసింది. ఈ చట్టం రాజ్యాంగవిరుద్ధమనీ, కొట్టివేయాలనీ కోరుతూ దాఖలైన ఆరుపిటిషన్లపై న్యాయస్థానం చేపడుతున్న ఈ విచారణ భవిష్యత్ భారతంలో లౌకికవాదం, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ముఖ్యమైనది. అయోధ్య వివాదం పరిష్కారంతో ఇక ఈ తరహా ఘర్షణలకు తెరపడుతుందనీ, సయోధ్య వెల్లివిరుస్తుందనీ అంతా అనుకున్నారు. కానీ, కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తులు వరుసగా రేపుతున్న మరిన్ని వివాదాలు మతవైషమ్యాలు పెంచుతున్న తరుణంలో, ఈ చట్టం ఉనికిమీద సర్వోన్నత న్యాయస్థానం రాబోయేరోజుల్లో ఏమి చెబుతుందోనని దేశప్రజలు ఎదురుచూస్తున్నారు.

పిటిషన్‌దారులలో సుబ్రహ్మణ్యస్వామి, న్యాయవాది అశ్విన్ ఉపాధ్యాయ పేర్లు ముఖ్యంగా చెప్పుకోవాలి. మధ్యయుగాల్లో కొందరు మతోన్మాదులు చేసిన అకృత్యాలకు ఈ నవయుగంలో జనం తన్నుకుచావకూడదన్న లక్ష్యంతో ఈ చట్టం రూపొందితే, దాని ఉద్దేశాన్ని వీరు తప్పుబడుతున్నారు. ఆనాటి దండయాత్రికుల దురాగతాలను ప్రశ్నించనివ్వకుండా, ఆ దురాక్రమణలను సవాలు చేయనివ్వకుండా ఈ చట్టం అడ్డుపడుతున్నదని వారి ఆరోపణ. యథాతథస్థితి పేరిట న్యాయస్థానాలనుంచి ప్రార్థనాస్థలాల వివాదాలకు పరిష్కారం దక్కనివ్వకుండా చేస్తున్నదనీ, అప్పటి చారిత్రక, సాంస్కృతిక అకృత్యాలకు ఇప్పుడు మరమ్మతులు జరగాల్సిందేనని వారి వాదన. అయోధ్య వివాదం దేశాన్ని ఎంతగా కుదిపేసిందో తెలిసిందే. దానికి న్యాయస్థానం అందించిన పరిష్కారంమీద భిన్నాభిప్రాయాలున్న విషయాన్ని అటుంచితే, అగ్గి అక్కడితో ఆరిపోకుండా దావానలంలాగా వ్యాపిస్తూండటం విచారకరం. పురాతన ఆలయాలను కూల్చి మసీదులు కట్టారనీ, అర్చనకు అనుమతించాలంటూ స్థానిక న్యాయస్థానాల్లో పిటిషన్లు వేస్తూండటం, అవి సరేననడం చూస్తున్నదే. మసీదు అడుగున ఏమున్నదో తేల్చడానికి దిగువకోర్టులు సర్వేలకు అనుమతిస్తుంటే, హైకోర్టులు సమర్థిస్తుంటే, సుప్రీంకోర్టు ఆట నియమాలను స్వల్పంగా మార్చి కానివ్వమనడం జరిగిపోతోంది. వారణాసిలో జ్ఞానవాపి, మధురలో షాహీ ఈద్గా, సంభాల్‌లో షాహీ జామా..ఇలా వివాదాలు సాగిపోతున్నాయి.

సుప్రీంకోర్టు 2019నాటి అయోధ్య తీర్పులో ఈ చట్టాన్ని ఘనంగా ప్రశంసించింది. అలనాటి ఘోరాలు, చారిత్రక అన్యాయాలను సరిదిద్దవలసిందేనంటూ వర్తమానంలో ఆయా మతస్థలాల రూపురేఖలను మార్చేందుకు చేసే ఏ ప్రయత్నాన్నీ అనుమతించకుండా, ఆదిలోనే అడ్డుపడుతూ ఈ చట్టం ఎంతో మంచిపనిచేసింది.. దేశప్రజల శాంతియుత సహజీవనానికి ఇది అత్యావశ్యకం అని గొప్పగా వ్యాఖ్యానించింది. కానీ, అదే న్యాయస్థానం ఈ చట్టాన్ని పరోక్షంగా బలహీనపరిచింది. అడుగున మందిరాలున్నాయన్న వాదనతో మసీదులను దెబ్బతీసే ప్రయత్నాలను నిలువరించలేదు. మూలాలు తెలుసుకుంటామని అంటున్నారు కానీ, స్వరూపాన్ని మారుస్తామనలేదు కదా అంటూ మాజీ చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ రెండేళ్ళ క్రితం జ్ఞానవాపి వివాదంలో వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై కేంద్రప్రభుత్వం తన వైఖరి తెలియచేయకుండా, సర్వోన్నతన్యాయస్థానం తనకుతానుగా చొరవచూపకుండా, మరోపక్క దిగువకోర్టులను నియంత్రించకుండా ఒక జగన్నాటకం ఇంతకాలం సాగింది. అయోధ్యతో సరి, ఇక భవిష్యత్తులో సామాజిక అశాంతి రేగకూడదన్న ఈ చట్టం లక్ష్యం నెరవేరకుండా పోయింది. సంభాల్‌లో ఇటీవల జరిగిన హింస దేశ భవిష్యత్ పరిణామాలకు సంబంధించిన ఓ బలమైన హెచ్చరిక. బాబ్రీ కూల్చివేతకు ఒక ఏడాదిముందుగా, ఎంతో ముందుచూపుతో తయారైన ఈ మూడుదశాబ్దాలనాటి చట్టాన్ని నిలబెట్టుకోవడం దేశానికి శ్రేయస్కరం.

పంజాబీ పార్టీ ఎలా పతనమయింది?

పంజాబ్‌లో సంభవిస్తున్న పరిణామాలు తీవ్ర కలవరపాటు కలిగిస్తున్నాయి. అకాలీదళ్ నాయకుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై హత్యాయత్నం గురించి మాత్రమే నేను ప్రస్తావించడం లేదు. నా వ్యాకులతకు ప్రధాన కారణం శిరోమణి అకాలీదళ్‌లో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించేందుకు అఖల్ తఖ్త్ జోక్యం చేసుకున్న తీరు. ఒక రాజకీయ పార్టీ వ్యవహారాలలో ఆ సిక్కు మత పీఠం ప్రమేయం పెట్టుకున్న వైనం లోతైన, విస్తృత రాజకీయ, న్యాయ సంబంధ, రాజ్యాంగపరమైన సమస్యలను లేవనెత్తుతోంది. వాటి గురించి మౌనం వహించడం తగదు. మన లౌకిక గణతంత్ర రాజ్యాన్ని (సెక్యులర్ రిపబ్లిక్) కూల్చివేసేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఒక రాజకీయ పార్టీ (అది కేవలం ఒక రాష్ట్రానికి మాత్రమే పరిమితమైనదే అయినా) అంతర్గత విషయాలలో ఒక మత సంస్థ నిర్ణయాత్మకంగా వ్యవహరించడాన్ని ఎట్టి పరిస్థితులలోను ఉపేక్షించకూడదు.

అఖల్ తఖ్త్– అకాలీదళ్ సంబంధాల తాజా వాస్తవాలు సూటిగా ఉన్నాయి. వరుసగా సార్వత్రిక, శాసనసభ ఎన్నికలలో పరాజయాలను చవిచూసిన శిరోమణి అకాలీదళ్ ప్రస్తుతం మనుగడ సంక్షోభంలో ఉన్నది. తండ్రి ప్రకాశ్ సింగ్ బాదల్ రాజకీయ వారసత్వాన్ని పొందిన నాటి నుంచి దుష్పరిపాలన, అవినీతి, రాజకీయ అవివేకం ఆరోపణలతో సుఖ్‌బీర్ సింగ్ బాదల్ పార్టీలో తీవ్ర సవాళ్ల నెదుర్కొంటున్నారు. సుఖ్‌బీర్ నాయకత్వ శైలిని మొదటి నుంచీ వ్యతిరేకించినవారు ఇటీవల మరింత మద్దతుతో, పూర్తిస్థాయిలో తిరుగుబాటు చేశారు. అకాలీదళ్ చీలిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. అకాలీదళ్‌కు ఏర్పడ్డ ఈ విపత్కర పరిస్థితిలో సిక్కుమత సర్వోన్నత ధార్మిక సంస్థ అఖల్ తఖ్త్ రంగ ప్రవేశం చేసింది.

మన రాజకీయ రంగంలో శిరోమణి అకాలీదళ్ లేకపోతే జరిగేదేమిటి? కేవలం పంజాబ్ మాత్రమే కాదు, యావద్భారతదేశమూ తీవ్రంగా నష్టపోతుంది. ఒక రాజకీయ శూన్యత నెలకొంటుంది. ఆ శూన్యత, తీవ్రవాద శక్తుల విజృంభణకు దారితీస్తుంది. పంజాబ్ లోపల, వెలుపల ఉన్న సిక్కు మతస్థులలో అనేక మంది ఇప్పటికీ 1984 నాటి తీవ్ర మనస్తాపం నుంచి తేరుకోనే లేదు. ఆ నాటి సిక్కుమత వ్యతిరేక మారణకాండ వారిని ఇప్పటికీ కోపోద్రిక్తులను చేస్తోంది. ఆ హత్యాకాండకు పాల్పడినవారు ఇప్పటికీ ఎటువంటి శిక్షలకు గురికాకుండా స్వేచ్ఛగా ఉండడం ఎంతో మంది సిక్కులను బాధిస్తోంది. అయితే పంజాబ్, జాతీయ రాజకీయాలలో అకాలీదళ్ నిర్వహిస్తున్న పాత్ర సిక్కు మతస్థులకు ఎంతో ఓదార్పునిస్తోంది. '1984' మానసిక గాయాలకు ఒక విధంగా ఉపశమనం కలిగిస్తోంది. సరే, సుఖ్‌బీర్ బాదల్ తన తండ్రి ప్రకాశ్ సింగ్ బాదల్ రాజకీయ విజ్ఞత, పాలనా సామర్థ్యం, ప్రజాదరణకు వారసుడు కాలేకపోయారు. తత్కారణంగానే అకాలీదళ్‌ను సమస్యలు చుట్టుముట్టాయి. ఫలితంగా ఆ పార్టీ పరిస్థితి అంతకంతకూ దిగజారిపోతోంది. అకాలీదళ్ నిర్నిరోధ పతనాన్ని అరికట్టేందుకు ఆ పార్టీ వ్యవహారాలలో ఎవరో ఒకరు జోక్యం చేసుకోవల్సి ఉన్నది.

నిజమే, పార్టీ శ్రేయోభిలాషులు జోక్యం చేసుకోవాలి. అయితే అకాలీదళ్‌ను చక్కదిద్దగల పెద్దరికం ఉన్నది ఎవరు? ఏ పెద్ద మనిషి ప్రమేయంతో సమస్యలు తీరిపోతాయి? ఇవి ఆలోచించాల్సిన విషయాలు. అకాలీదళ్ వ్యవహారాలలో అఖల్ తఖ్త్ జోక్యం చేసుకుని మధ్యవర్తిత్వం నెరపడం సముచితమేనా? అంతకంటే ముఖ్యంగా అఖల్ తఖ్త్ సర్వోన్నత ఆదేశాలకు అకాలీదళ్ లోబడడం సరైన విషయమేనా? ఎందుకంటే ఇది ఒక పార్టీ లేదా ఒక మత సమూహం అంతర్గత వ్యవహారం కాదు; అలాగే ఒక పార్టీ, కొంతమంది మతనాయకుల మధ్య వ్యవహారం అంతకంటే కాదు.



> సిక్కు మత సంస్కరణ ఉద్యమంలో మూలాలు ఉన్న ఒక పంథిక్ సంస్థగా అకాలీదళ్ ఆవిర్భవించింది. ఖలిస్తానీ ఉగ్రవాదం సమసిపోయిన తరువాత అకాలీదళ్ రాజనీతిజ్ఞతలో ఒక పెద్ద మార్పు సంభవించింది. ఒక 'పంథిక్' పార్టీ నుంచి ఒక పంజాబీ పార్టీగా, ఒక మత సంబంధ–ప్రాంతీయ పార్టీ నుంచి స్వచ్ఛమైన ఒక ప్రాంతీయ పార్టీగా పరివర్తన చెందింది. అయితే, అకాలీదళ్ సిక్కు మతస్థుల పార్టీ అని, సిక్కు మత వ్యవస్థకు అది జవాబుదారీగా ఉంటుందనే విషయాన్ని ఇటీవలి పరిణామాలు స్పష్టం చేశాయి.

ప్రప్రథమంగా ప్రస్తావించాల్సిన అంశం: శిరోమణి అకాలీదళ్ ఒక ప్రాంతీయ పార్టీ స్థాయి నుంచి ఒక మత సమూహం పార్టీగా తిరోగమించింది. సిక్కు మత సంస్కరణ ఉద్యమంలో మూలాలు ఉన్న ఒక పంథిక్ సంస్థగా శిరోమణి అకాలీదళ్ ఆవిర్భవించింది. అయితే పంజాబ్‌లో ఖలిస్తానీ ఉగ్రవాదం సమసిపోయిన తరువాత విజయవంతంగా అధికారానికి తిరిగివచ్చిన అకాలీదళ్ రాజనీతిజ్ఞతలో ఒక పెద్ద మార్పు సంభవించింది. 1996లో ఆ పార్టీ మోగా సమావేశంలో ఒ'పంథిక్' పార్టీ నుంచి ఒక పంజాబీ పార్టీగా, ఒక మత సంబంధ–ప్రాంతీయ పార్టీ నుంచి స్వచ్ఛమైన ఒక ప్రాంతీయ పార్టీగా పరివర్తన చెందింది. సిక్కుల ప్రయోజనాలకే ప్రధానంగా ప్రాతినిధ్యం వహిస్తున్న అకాలీదళ్ అనేక సంవత్సరాలుగా ఎంతో మంది హిందువులను పార్టీ సభ్యులుగా చేర్చుకుని పలువురికి నాయకత్వ స్థానాలను కూడా కల్పించింది. అయితే ఇటీవలి పరిణామాలు అకాలీదళ్ ఒక పంథిక్ పార్టీ అని, పంజాబ్‌లో అధిక సంఖ్యాకులు అయిన సిక్కు మతస్థుల పార్టీ అని, సిక్కు మత వ్యవస్థకు అది జవాబుదారీగా ఉంటుందనే విషయాన్ని స్పష్టం చేశాయి. ఈ మార్పును మనం అంగీకరిస్తే, సువిశాల భారతదేశాన్ని అధిక సంఖ్యాకులు అయిన హిందూ మతస్థుల ఆకాంక్షలు, అభిమతాలకు అనుగుణంగా పాలించేందుకు ఆరాటపడుతున్న శక్తులను ఎలా ఆక్షేపించగలం?

రెండో అంశం రాజ్యాంగబద్ధమైన ఔచిత్యం. రాజ్యాంగబద్ధంగా నమోదై, గుర్తింపు పొందిన రాజకీయ పక్షం శిరోమణి అకాలీదళ్. రాజ్యాంగం ప్రవచించిన లౌకికవాదానికి నిబద్ధమై ఉండేందుకు వాగ్దానం చేసిన రాజకీయ పార్టీ ఒక మత అత్యున్నత అధికార పీఠం ఆదేశాలను ఎలా ఔదలదాలుస్తుంది? అకాలీదళ్ పార్టీ సంవిధానంలో పార్టీ అంతర్గత వివాదాల పరిష్కారంలో అఖల్ తఖ్త్‌ను మధ్యవర్తిగా నిర్ణయించుకోవాలనే నిబంధన ఏమీ లేదు. పార్టీ వెలుపలి నుంచి సైద్ధాంతిక మార్గదర్శకత్వం, సలహాను తీసుకునే స్వేచ్ఛ ఇప్పుడు ఏ రాజకీయపక్షానికి అయినా ఉన్నది. ఒక పార్టీ నాయకత్వం మామూలుగా మత నాయకుల నుంచి సలహాలు తీసుకోవచ్చు. నిజానికి ఇప్పుడు కుల లేదా మతపరమైన సంస్థలతో సంబంధాలు ఉండి వాటి మార్గదర్శకత్వాన్ని తీసుకుంటున్న పార్టీలు ఉన్నాయి. అయితే మనం ఇప్పుడు అకాలీదళ్ విషయమై ప్రజల సమక్షంలో విచారణ నిర్వహించి, అనివార్యంగా నిబద్ధమవ్వాల్సిన తీర్పును వెలువరించడం గురించి మాట్లాడుకుంటున్నాం. రాజ్యాంగ బద్ధమైన అధికార పదవులకు పోటీపడే రాజకీయపక్షం ఒక మత సంస్థ విచారణకు అంగీకరించడం ఎలా సబబు? అఖల్ తఖ్త్ బహిరంగ విచారణ సమంజసమే అయితే భారతీయ జనతాపార్టీ వ్యవహారాలను, ఆ పార్టీ ప్రభుత్వాలను నిర్వహించడంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పాత్రను ఎలా ప్రశ్నించగలం?


■ యోగేంద్ర యాదవ్

ఇక చివరి అంశం రాజకీయ వ్యవహారాలలో అఖల్ తఖ్త్ జోక్యం చేసుకోవడంలో ఔచిత్యం ఉన్నదా? అఖల్ తఖ్త్ ఒక మత వర్గం ఆధ్యాత్మిక సంస్థ మాత్రమే కాదు, చట్టాలు, రాజ్యం నుంచి స్వతంత్రంగా వ్యవహరించి అనుయాయులపై నైతిక అధికారాన్ని నెరపే సంస్థ. అఖల్ తఖ్త్ జతేదార్‌లను నియమించేది, తొలగించేది శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ (ఎస్‌జీపీసీ) దేశీయ చట్టం ద్వారా నెలకొల్పబడిన సంస్థ ఇది. ఎస్‌జీపీసీ గానీ, అది నియమించినవారు గానీ రాజకీయాలలో జోక్యం చేసుకునేందుకు ఆ సంస్థకు సిక్కు గురుద్వారాల చట్టం–1925 ఎలాంటి అధికారాలనివ్వ లేదు. మత సంబంధిత వ్యవహారాలలో మార్గదర్శకత్వం ఇవ్వడానికి మాత్రమే అఖల్ తఖ్త్ ఉన్నది. ఏవైనా సామాజిక వివాదాలలో, వివాదపడిన పక్షాలు రెండూ అంగీకరించిన పక్షంలో మధ్యవర్తిత్వం చేసి న్యాయం నిర్ణయించే అధికారం మాత్రమే ఎస్‌జీపీసీకి ఉన్నది. మతస్థులను మతం నుంచి వెలివేసేందుకు ఎస్‌జీపీసీకి గల అధికారాలపై కూడా అనేక సందేహాలు ఉన్నాయి.

ప్రస్తుత వివాదం గుణాత్మకంగా భిన్నమైనది. అన్ని అంగీకారయోగ్యమైన పరిధులను అది అతిక్రమించింది. సుఖ్‌బీర్ బాదల్‌పై బహిరంగ విచారణ ఒక రాజకీయ వ్యవహారం అఖల్ తఖ్త్ ఆయనకు సంధించిన అనేక ప్రశ్నలలో ఒక్కటి మాత్రమే మతపరమైన విషయానికి సంబంధించినది: అది 'బి–అదాబి' (సిక్కు మత పవిత్ర గ్రంథమైన గురు గ్రంథ సాహిబ్‌ను అపవిత్రీకరణ వ్యవహారంపై ఆయన అసమర్థంగా వ్యవహరించారన్న ఆక్షేపణ అది). మిగతావన్నీ ప్రభుత్వంలోను, అకాలీదళ్ నాయకుడుగాను ఆయన నిర్వర్తించిన పాత్రకు సంబంధించినవి. అవి కూడా 'పంథ్'ను ప్రభావితం చేసే అంశాలే కావడం గమనార్హం. సరే, అకాలీ నేతలకు వీటిపై ఎటువంటి అభ్యంతరాలు లేవు అటువంటి జోక్యాన్ని వారు కోరారు. అయితే పూర్తిగా మత సంస్థ అయిన అఖల్ తఖ్త్ ఒక రాజకీయ పార్టీని పునర్ వ్యవస్థీకరించే అధికారాలను ఎలా సంతరించుకున్నదనేదే అసలు ప్రశ్న. ఇది ఆమోదయోగ్యమైతే బీజేపీకి ఓటు వేయమని తన అనుయాయులను డేరా సచా సౌదా బాబా గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ ఆదేశించడంలో తప్పు ఏముంది?

అంతకంటే ఆక్షేపణీయమైనది ఈ వ్యవహారంలో చోటు చేసుకున్నది. అకాలీదళ్ పునర్ వ్యవస్థీకరణకు ఆదేశించడం ద్వారా అఖల్ తఖ్త్ ఒక రాజకీయ సంస్థ స్థాయికి పరిమితమైపోలేదా? ఇప్పుడు ప్రతి రాజకీయ సంస్థ మాదిరిగానే అఖల్ తఖ్త్ కూడా ప్రజల నిశిత పరిశీలన, నిందాత్మక ప్రచారాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది. మరి ఈ పరిస్థితిలో సిక్కు సమాజంలో మత, రాజకీయ అధికారాల మధ్య విభజన లేదన్న వాదనను అఖల్ తఖ్త్ చేస్తుందా? సిక్కుల విషయంలో అది సమంజసమే అయితే, పౌర సమాజ వ్యవహారాలలో ప్రభావశీల జోక్యం చేసుకుంటున్న బాబాలు, యోగులు, స్వాములను సమర్థించేందుకు బీజేపీ సైతం అదే వాదనను ఉపయోగించుకోదూ?

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

నిజం నిగ్గుతేల్చటంలోనూ నీతి పాటించాల్సిందే!

సోలార్ పవర్ ప్లాంట్ ప్రాజెక్టు విషయంలో గౌతమ్ అదాని అవినీతికి పాల్పడ్డారంటూ అమెరికా నుంచి వెలువడ్డ ఆరోపణలు దేశాన్ని కుదిపేశాయి. వ్యాపారవేత్తగా ప్రపంచ ప్రసిద్ధి గాంచిన గౌతమ్ అదాని మీదా, అతని అనుయాయుల మీదా అమెరికాలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ చేపట్టిన అవినీతి ఆరోపణల దర్యాప్తు నేపథ్యంలో మన దేశంలోని సంస్థలు కూడా దర్యాప్తు చేపట్టాల్సిన అగత్యం ఏర్పడింది.

తమిళనాడు, ఒరిస్సా, జమ్మూకశ్మీర్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలే కాకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అదానీ గ్రీన్ – అజూర్ పవర్ గ్లోబల్ లిమిటెడ్ సంస్థలతో సోలార్ ఎనర్జీ విషయంలో సరఫరా ఒప్పందాలు చేసుకున్నాయని చెబుతున్నారు. అవినీతి ఆరోపణలు అమెరికాలోని హిండెన్‌బర్గ్ రిసెర్చి బయటపెట్టటంతో అదానీ సంస్థతో పాటు, భారతదేశ ప్రభుత్వం, కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ఇరుకున పడ్డాయి. ఈ విషయమై చర్చలూ వదంతులూ తారాస్థాయికి చేరుకున్నాయి. కానీ పరిష్కార మార్గాలను మాత్రం రాజకీయ నాయకులూ, ప్రభుత్వాలూ బయటపెట్టడం లేదు.

ప్రజల వద్ద నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన డబ్బును ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నాయా లేదా అన్నది ప్రజలకు ముఖ్యం. ప్రజల అవసరాల నిమిత్తం సోలార్ ఎనర్జీ కొనుగోలు చేసిన విధానంలో అవినీతి చొరబడిందన్న అంశం మరో దేశం దర్యాప్తులో బయటపడినప్పుడు ప్రజలకు తాము ఎన్నుకొన్న ప్రభుత్వాల మీద నమ్మకం పోతుంది. ఇలా ఎన్ని రకాలుగా వారి సొమ్ము వారికి కాకుండా పోతున్నదో అన్న భయంతో కూడిన అనుమానాలు పెరుగుతాయి. పార్లమెంట్ సమావేశాలు ఈ సమస్యకు పరిష్కారం చూపించాల్సింది పోయి, సమస్యలో ఒక భాగంగా మారిపోవటం దురదృష్టకరం. నిజానికి అధికారపక్షం చొరవ చూపి ఇంతటి సంచలనాత్మక విషయానికి సంబంధించిన నిజానిజాలను సభల్లో బయటపెట్టాల్సిన అవసరం ఉంది. ప్రతిపక్షాలు కూడా ఈ సమస్యకు ఒక పరిష్కార దిశగా చర్చలు కొనసాగించటానికి బదులు అధికార పక్షాన్ని ఇరుకునపెట్టాలని ప్రయత్నించటమూ దురదృష్టకరమే. సానుకూల ధోరణిలో అవగాహనతో కూడిన సంయమన దృక్పథంతో ఇరు పక్షాలూ వ్యవహరించినప్పుడే రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య మనుగడ సాధ్యపడుతుంది. ఏకపక్ష ధోరణిలో ఎవరు వ్యవహరించినా అంతిమంగా నష్టపోయేది రాజకీయ నాయకులూ, వ్యాపార సంస్థలూ కాదు – ప్రజలు!



> అదానీ వివాదాన్ని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించక తప్పదు. గౌతమ్ అదాని కేంద్రంలోని ప్రముఖులకు ఇష్టుడు అన్న అపవాదును తొలగించుకోక తప్పదు. రాష్ట్రాల ఒప్పందాలతో మాకు సంబంధం లేదు అన్నట్లు తప్పించుకొనే ధోరణి ఎంతమాత్రం సమంజసం కాదు. వారి ఏలుబడిలో ఉన్న రెండు మూడు రాష్ట్రాలు కూడా ఈ ఆరోపణలను ఎదుర్కొంటున్నాయి.

కొన్ని సంవత్సరాల క్రిందట రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మన దేశానికి చెందిన ఒక జర్నలిస్ట్ విదేశంలో సేకరించిన సమాచారం వల్ల బయటపడిన బోఫోర్స్ ఉదంతం దేశాన్ని కుదిపేసింది. ఆనాటి ప్రధానమంత్రి అవినీతికి పాల్పడ్డాడన్న ఆరోపణ సంచలనం కలిగించింది. ఇప్పటి అవినీతి సొమ్ముతో పోల్చుకుంటే అప్పటి సొమ్ము పరిగణనలోకి తీసుకోవాల్సినంత పెద్దదేమీ కాదు. కానీ ప్రజల డబ్బు ప్రజల డబ్బే, అవినీతి అవినీతే! జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఆనాటి ప్రభుత్వం ఒప్పుకోక తప్పలేదు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి అలాంటి ప్రక్రియ పార్లమెంటుకు అందుబాటులో ఉన్నప్పుడు మీనమేషాలు లెక్కపెట్టాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వానికి ఉండకూడదు. పార్లమెంటు సమావేశాలు ముగిసేలోపు ఈ విషయంలో స్పష్టత రావాల్సిన అవసరం ఉంది. ప్రజలకు అడిగే హక్కు కూడా ఉంది. ప్రభుత్వానికి జవాబివ్వాల్సిన బాధ్యత ఉంది. ప్రజాస్వామ్యాన్ని నియంతృత్వ మార్గంలోకి నెట్టేయకూడదు!

మార్కెట్ షేర్ల ధరలను మానిప్యులేట్ చేయటంతో పాటు, జరిగిన ఒప్పందాలను, ఫండ్స్‌ను లాభసాటిగా వ్యాపారంలో తిప్పిన తీరును అదాని సంస్థ బయటపెట్టటానికి ఇబ్బంది పడటంతో ఈ వ్యవహారం ఇంత జటిలంగా మారింది. నిఘా సంస్థలు కానీ ప్రభుత్వాలకు సంబంధించిన రెగ్యులేటరీ సంస్థలు కానీ చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరును ప్రభుత్వాలు పట్టించుకోకపోవటంతో ఇప్పుడు మీడియాతో పాటు ప్రతిపక్షాలు ప్రభుత్వం మీద – అదానీ సంస్థ మీద విమర్శ బాణాలు ఎక్కుపెట్టాయి. ఎక్కుపెట్టిన బాణం ఎవరికి తగులుతుందో అన్నది కాదు సమస్య, తప్పుచేసిన వారికి శిక్ష పడాల్నా లేదా అన్నదే సమస్య. నష్టపోతున్న ప్రజాధనాన్ని ప్రభుత్వాలు రాబట్టుకోలేవా అన్న ప్రశ్నకు జవాబు కోసమే ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించక తప్పదు. గౌతమ్ అదాని కేంద్రంలోని ప్రముఖులకు ఇష్టుడు అన్న అపవాదును తొలగించుకోక తప్పదు. రాష్ట్రాల ఒప్పందాలతో మాకు సంబంధం లేదు అన్నట్లు తప్పించుకొనే ధోరణి ఎంత మాత్రం సమంజసం కాదు. వారి ఏలుబడిలో ఉన్న రెండు మూడు రాష్ట్రాలు కూడా ఈ ఆరోపణలను ఎదుర్కొంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకూ ఇప్పటి కూటమి ప్రభుత్వం ఈ ఆరోపణల వెనక నిజాలను తమ సంస్థల ద్వారా దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని చెబుతున్నది. ఒప్పందాల పత్రాలూ – నిర్ణయాలూ – ఫైళ్లతో పాటు అప్పటి అధికార వర్గంపై దృష్టి పెడితే నిజాలు ఇట్టే తెలుస్తాయి. ఒప్పందం రద్దు వల్ల నష్టపరిహారంగా మరింత సొమ్ము ఇవ్వాల్సి వస్తుందన్న వాదన సమంజసం కాదు. మొత్తం పెట్టుబడులూ ఒప్పందాలూ అవినీతిమయం అన్న ఆరోపణల నేపథ్యంలో న్యాయస్థానంలో నిజాలు నిరూపణ అయితే నేరస్థులతో ఆ అవినీతి సొమ్మును కక్కించవచ్చు. ప్రజలకు నష్టం కలగొచ్చు అన్న సాకుతో నైతిక ధర్మానికి తిలోదకాలు ఇవ్వటానికి ప్రయత్నిస్తే కూటమి ప్రభుత్వం కూడా విమర్శలకు గురికావలసి వస్తుంది. రాజకీయాలు అవసరమే కానీ నైతికతను పణంగా పెట్టి రాజకీయం చేయటాన్ని ప్రజాస్వామ్యం హర్షించదు.

● రావులపాటి సీతారాంరావు

అడ్వకేట్ల గౌరవం కాపాడాలి!

2019–20లలో సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ సర్టిఫికెట్లు ఐదు సంవత్సరాల కాలపరిమితికి జారీ చేశారు. అవి తయారు చేసి ఇచ్చేసరికి 2022 వచ్చేసింది. 2020, 2021లలో కరోనా వల్ల కోర్టులు జరగలేదు. అయినా 2025 జనవరి 1కి సర్టిఫికెట్ల కాల వ్యవధి ముగిసినందున మరల ఐదేళ్లకి రెన్యువల్, కొత్తగా ఐదు సంవత్సరాల ప్రాక్టీస్ ముగిసినవారు వెరిఫికేషన్ చేయించుకోవాలని బార్ కౌన్సిల్ సర్క్యులర్ ఇచ్చింది. దాని ప్రకారం డిసెంబర్ 21లోగా సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ అప్లికేషన్లు పంపించుకోవాలి.

2019–2020లలో సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ అప్లికేషన్లు పెట్టమని అన్నప్పుడు, డిగ్రీ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయాలని, ఫేక్ సర్టిఫికెట్లు ఉన్నవారిని తొలగించాలన్నది ఉద్దేశ్యమని చెప్పారు. కొన్ని ఫేక్ సర్టిఫికెట్లు కనుగొన్నట్లు ప్రకటించారు. అయితే సకాలంలో అప్లికేషను పెట్టుకోలేనివారు, కొన్ని కారణాల వల్ల డిగ్రీ సర్టిఫికెట్లు దగ్గర లేనివారు సర్టిఫికెట్లు పొందలేకపోయారు. వారిలో చాలా మంది సక్రమంగా బిఎల్/ఎల్ఎల్‌బి చదివి డిగ్రీ పొంది, బార్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారున్నారు. వీరంతా గౌరవప్రదంగా అడ్వకేట్ అనే స్టేటస్ ఉంచుకోవాలి అనుకున్నవారే. అలాగే కొంతమంది ఆడవాళ్ళు కుటుంబ బాధ్యతల వలన ఏక్టివ్ ప్రాక్టీస్ చేయలేకపోయినా, తమ అడ్వకేట్ హోదా ఉంచుకుని, తెలిసిన వారికి సలహాలు ఇస్తూ గౌరవం పొందుతున్నారు... ఇలాంటి వారు సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ పొందలేకపోయారు.



ఇప్పుడు మళ్లీ సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ రెన్యువల్ అప్లికేషన్లు పెట్టమని ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం అడ్వకేట్ ప్రాక్టీస్ చేస్తున్నట్లుగా చూపించడానికి 5 వకాల్తాలు, 5 మెమో ఆఫ్ అప్పియరెన్స్‌లు, డ్రాఫ్టింగ్ డీడ్స్‌కు సంబంధించిన ఆధారాలు పెట్టాలి. లేదా కోర్టు వెబ్‌సైట్ లేదా కాజు లిస్టులో న్యాయవాది పేరు ఉంటే వాటిని, లేదా తీర్పు/ఆర్డరు కాపీలలో న్యాయవాది పేరు ఉంటే వాటిని జతపరచాలి. ఈ ఆధారాలు జత చేయకపోతే బార్ కౌన్సిల్ లిస్టు నుంచి సదరు అడ్వకేట్ పేరును తొలగిస్తారు. వారు ప్రాక్టీస్ చేయడానికి, ఓటింగులో పాల్గొనడానికి అర్హత కోల్పోతారు. ఈ నిబంధనలు అడ్వకేట్లకు సమస్యగా మారుతున్నాయి. బార్ కౌన్సిల్ ఎన్నికలలో ప్రాక్టీస్ చేస్తున్న వారినే ఓటర్లుగా నమోదు చెయ్యాలని, బార్ కౌన్సిల్ సభ్యులుగా ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్లకే అవకాశం కల్పించాలి అనుకోవడం కొంత సబబే. కానీ ఎన్నికలకు, బార్ కౌన్సిల్‌లో అడ్వకేట్ ఎన్‌రోల్‌మెంట్‌కు ముడిపెట్టడం సరైనది కాదు.

అడ్వకేట్ చట్టం, బార్ కౌన్సిల్ రూల్స్ ప్రకారం న్యాయ డిగ్రీ పొంది, బార్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారందరూ అడ్వకేట్లుగా ప్రాక్టీస్ చేయడానికి అర్హులు. కానీ ఈ నిబంధనల వల్ల కొందరు అడ్వకేట్లకు సమస్య వస్తోంది. కొంతమంది అడ్వకేట్లు ఛాంబర్ ప్రాక్టీస్ చేస్తూ ఉంటారు. వారి సలహాలు, డ్రాఫ్టింగ్ కక్షిదారులకు, సహ న్యాయవాదులకు ఎంతో ఉపయోగకరం. వారు రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేయకపోయినా అడ్వకేటుగా గౌరవం పొందుతుంటారు. మరికొంత మంది అడ్వకేట్లు తమ సీనియర్ల దగ్గర పని చేస్తూ ఉంటారు. సాధారణంగా సీనియరు మాత్రమే కోర్టులో వకాల్తా వేస్తారు. జూనియర్ అడ్వకేట్ వకాల్తానామాపై సీనియర్‌తో పాటు సంతకం చెయ్యకపోయినా, సీనియర్ తరపున కేసు విచారణ చేసే విధానం అమలులో ఉంది. కొన్ని కారణాల వల్ల జూనియర్ అడ్వకేట్లతో వకాల్తా సంతకం చేయించరు.

కోర్టుల్లో వకాల్తా వేసి కేసులు వాదించడమే కాదు, తాము న్యాయ డిగ్రీ పొందిన జ్ఞానంతో నలుగురికి అవసరమైన న్యాయ సలహాలు ఇవ్వడం కూడా అడ్వకేట్లకు గౌరవం. అందుకు అడ్వకేట్‌గా రిజిస్ట్రేషన్, గుర్తింపు ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పుడు ఈ సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ నిబంధనల వల్ల వారందరూ అడ్వకేట్ గుర్తింపునకు దూరమవుతున్నారు.

డాక్టర్లు, ఇంజనీర్లు, ఆడిటర్లు... తమ అసోసియేషన్లలో సభ్యులకు ఇటువంటి నిబంధనలు పెట్టలేదు. డాక్టర్లు వైద్యం చేయకపోయినా, ఇంజనీర్లు ఏ ప్రాజెక్టులలో పనిచేయకపోయినా, ఆడిటర్లు ఆడిట్లు చేయకపోయినా, వారందరినీ అసోసియేషన్లలో సభ్యులుగా ఉండనిస్తున్నారు. అటువంటప్పుడు అడ్వకేట్లకే ఈ ప్రాక్టీస్ నిబంధనలు ఎందుకు రూపొందించారో తెలియదు. ఇది ఎవరి ఆలోచన అయినా ఆమోదయోగ్యంగా లేదు.

అడ్వకేట్లు, వారి సంఘాలు, బార్ అసోసియేషన్లు దీని గురించి సరైన ఆలోచన చేయాలి. బార్ కౌన్సిల్ ఎన్నికలలో ఓటర్లుగా పాల్గొనడానికి వేరే పద్ధతులలో ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టవచ్చు. అంతేకానీ బార్ కౌన్సిల్ ఎన్నికల ఓటర్ల జాబితాకు, బార్ కౌన్సిల్‌లో అడ్వకేట్‌గా రిజిస్ట్రేషన్‌కు ముడి పెట్టడం సరికాదు. అడ్వకేట్ అనేది ఒక గౌరవం. ప్రాక్టీస్ చేసినా, చేయకపోయినా, అడ్వకేట్‌గా ఎన్‌రోల్‌మెంట్ కావడం న్యాయ డిగ్రీ పొందిన వారి హక్కు, గౌరవం. ఆ గౌరవాన్ని కాపాడండి.

– పి.పి. శాస్త్రి, అడ్వకేట్, ఏలూరు

పాఠ్యాంశంగా మళ్లీ అమరావతి

మన దేశ రాజధాని ఢిల్లీ మహానగర చరిత్ర, అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌ల చరిత్రలను పాఠ్యగ్రంథాల ద్వారా నేటి తరానికి తెలియజేస్తున్నారు. అలాగే ఇతర రాష్ట్రాల రాజధానుల చరిత్రలకు ఏ మాత్రం తీసిపోని ఘనమైన చరిత్ర అమరావతిది. తెలుగు రాజులైన శాతవాహనుల రాజధాని ధాన్యకటకం. శాతవాహనులు రాజధానిని ఎంతగానో అభివృద్ధి చేశారు. దీనినే ధరణికోట అని పిలిచేవారు. కాలక్రమంలో అమరావతిగా స్థిరపడింది. శ్రీకృష్ణదేవరాయలు తమ విజయయాత్రలోను, క్రీ.పూ.5వ శతాబ్దిలో గౌతమబుద్ధుడు ఈ ప్రదేశాన్ని సందర్శించారు.

అల్లంత దూరాన మబ్బుల్ని తాకుతున్న గాలిగోపురం. ఆ వెనుక సూర్యకిరణాల పలకరింపునకు మెరుస్తున్న బంగారుపూత అమరేశ్వరాలయం శిఖరం. ఎత్తయిన ఆ శిఖరానికి చుట్టూతా ఎన్నో ఆలయాలు. ఎన్నెన్నో శిఖరాలు. తూర్పున వైకుంఠపురం కొండ, దక్షిణాన పాడుబడ్డ బౌద్ధస్థూపాలు, పడమట శాతవాహనుల రాజధాని ధాన్యకటకం, ఉత్తరాన ఆ స్థూపాల్ని, ఆ ఊరిని వడ్డాణంలా చుట్టి గలగల పారుతున్న కృష్ణానది. అద్దది అమరావతి.

2014లో ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం రాజధానిగా అమరావతిని ఎంపికచేసి, ఎంతో అద్వితీయమైన చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక చరిత్రను నేటి తరానికి తెలియజేయాలనే సత్సంకల్పంతో పదవ తరగతి తెలుగు వాచకంలో 'అమరావతి' శీర్షికతో పాఠాన్ని ఎంపికజేసి బోధింపజేశారు. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యల్లో భాగంగా రాజధాని అమరావతితో ఆడుకుంది. దీంతో పాటు పదవ తరగతి పాఠ్యాంశంగా ఉన్న అమరావతిని కూడా తొలగించింది.

ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కొలువు దీరింది. అవిభాజ్య రాష్ట్రంలో హైదరాబాద్‌ను ప్రపంచ శ్రేణి మహానగరంగా తీర్చిదిద్దిన విశేష అనుభవమున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమరావతి అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రులు గర్వపడే విధంగా 'అమరావతి' పాఠ్యాంశాన్ని తిరిగి ప్రవేశపెట్టాలి.

– అంగలకుదురు వీరాస్వామి

ఆ నలుగురైనా మిగులుతారా!?

జగన్మోహన్‌రెడ్డి జమానాలో జరిగిన వ్యవహారాలు ఒక్కొక్కటీ బయటపడుతుంటే దిగ్భ్రాంతి కలుగుతోంది. ఎన్నికల్లో జగన్ అలవిగాని హామీలు ఇచ్చి, వాటిని నెరవేర్చడానికి ఎక్కడెక్కడి నిధులూ మళ్లించి, అభివృద్ధిని గాలికి వదిలేశారనే ఇంతదాకా చాలా మంది నమ్ముతూ వచ్చారు. అయితే ఐదేళ్లూ జరిగింది నిధుల మళ్లింపు కాదు, నిధుల దోపిడీ అని తాజా పరిణామాలు వెల్లడిస్తున్నాయి.

ఎన్నికల్లో గెలవడం కోసం ఖజానా శక్తికి మించి, ప్రజల వాస్తవ అవసరాలకు మించి వాగ్దానాలు ఇచ్చేయడం రాజకీయాల్లో దశాబ్దాల కిందటే మొదలైంది. ఈ విషయంలో ప్రాంతీయ పార్టీలతో జాతీయ పార్టీలు కూడా పోటీపడుతున్నాయి. అలివిగాని హామీలు ఇచ్చినవారు, గెలిచాక వాటి అమలుకు తంటాలు పడుతుంటారు. ప్రభుత్వ పాలనకు ఇవి కొరకరాని కొయ్యలుగా మారిన వైనాన్ని జగన్ పాలనలో స్పష్టంగా చూశాం. నిజానికి వీటి ముసుగులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వనరుల దోపిడీ విపరీతంగా జరిగింది. సన్నబియ్యం ఇస్తామని ఎన్నికలకు ముందు చెప్పి, ముతకబియ్యమే ఇచ్చినా జనం ఆగ్రహించలేదు కానీ, ఆ ముతకబియ్యాన్ని కూడా పాలిష్ చేసి విదేశాలకు ఎగుమతి చేసేసిన తీరు చూసి మాత్రం ముక్కున వేలేసుకుంటున్నారు.



జగన్‌కి అత్యంత సన్నిహితుడి సారథ్యంలోనే కాకినాడ పోర్టు నుంచి ఈ తంతు జరిగిందని వెల్లడి కావడంతో రాష్ట్రం పరువు బంగాళాఖాతంలో కలిసిపోయింది. పోర్టులను లాగేసుకోవడం, తన వాళ్లకు అప్పగించేయడం, అడ్డంగా కరెంటు కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడం, బలవంతపు భూ ఆక్రమణలు, రాజధాని పేరుతో విశాఖలో సాగించిన దందాలు, మద్యం మోసం, ఇసుక మాఫియా.. ఇవన్నీ చూస్తుంటే– ఇట్లా కూడా పాలన చేయవచ్చా అనే ఆశ్చర్యం కలుగుతుంది. అబద్ధాన్ని దబాయించి నిజమని చెప్పే తీరు చూస్తుంటే, రాష్ట్ర భవిష్యత్తు పట్ల భయమేస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఏదో అద్భుతం జరుగుతుందనే ఆశతోనే అన్ని సామాజిక వర్గాలూ కలిసి 2019లో జగన్మోహన్‌రెడ్డిని గెలిపించాయి. ఆయన మాత్రం ఒక్కటే సామాజికవర్గాన్ని నెత్తిన పెట్టుకున్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లూ అదే సామాజికవర్గానికి చెందిన నలుగురి మీదే నమ్మకం పెట్టుకున్నారు. రాష్ట్రం నాలుగు దిక్కులా ఆ నలుగురికీ పగ్గాలిచ్చి దోపిడీకి ద్వారాలు తెరిచేశారు. విశాఖ కేంద్రంగా ఒకరూ, గోదావరి జిల్లాల మీదకు ఒకరూ, దక్షిణాంధ్రలో ఒకరూ, రాయలసీమలో మరొకరూ దోపిడీ ప్రతినిధులుగా వ్యవహరించారు. వారి అధికార దర్పానికీ, నోటికీ, చర్యలకూ అడ్డూ అదుపూ లేకుండాపోయింది. విచిత్రం ఏమిటంటే.. జగన్ ఇచ్చిన అపరిమిత అధికార పగ్గాలతో ఎడాపెడా చెలరేగిపోయిన ఈ నలుగురూ– రాష్ట్రంలో పాత కుంభకోణాల పుట్ట పగులుతూ ఉన్న ఈ సమయంలో మొహం చాటేస్తున్నారు. మీడియా ముందుకు కూడా పెద్దగా రావడం లేదు. పార్టీకీ, జగన్‌కీ రక్షా కవచంగా నిలబడడం లేదు. 'కాటికి పోయేప్పుడైనా నలుగురు ఉండాలి' అని తెలుగునాట ఒక సామెత ఉంది. కనీసం నలుగురినైనా నమ్మకంగా నిలుపుకోవాలని దాని ఉద్దేశ్యం. పాపం.. జగన్ పాపాల భారాన్ని మోయడానికి ఆ నలుగురూ కూడా మిగిలేట్టుగా కనిపించడం లేదు.

భారతదేశపు రాజకీయాల్లోనే జగన్ మాట, ప్రవర్తన, వ్యవహారశైలి, పాలన.. సామాజిక, రాజకీయ, మనస్తత్వ శాస్త్రాల్లో ఒక కేస్ స్టడీ అవుతుంది. తొలినాళ్లలో తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జపం చేసిన ఆయన, ఆ తర్వాత దానిని వదిలేశారు. తండ్రికి నమ్మకస్తులైన నేతలు ఎవరినీ జగన్ చేరదీయలేదు. అవసర కాలంలో అమ్మనీ, చెల్లినీ రాజకీయ పావులుగా ఉపయోగించుకుని, అవసరం తీరాక దూరం పెట్టేశారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను తొలుత 'అన్నా' అని సంబోధించి, ఆ తర్వాత వారితో జగన్ వ్యవహరించిన తీరు అందరూ గమనించారు. వైసీపీ అంటే జగన్ మాత్రమే అన్నట్టుగా అధికారంలో ఉన్నపుడు ప్రవర్తించిన ఆయన తీరు, ఇప్పుడూ మారలేదు. అభివృద్ధిని అటకెక్కించి రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన ఇటువంటి నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలనే పాఠాన్ని రాష్ట్ర ప్రజలు నేర్చుకున్నారు.

కేవలం కొల్లగొట్టుకోవడం అనే ఒకే ఒక్క కార్యాచరణతో ఐదేళ్లూ జగన్ పాలన సాగింది. ఇక జగన్‌ను తిట్టుకుంటూ కాలం గడపలేం. ధ్వంసమైన వ్యవస్థలకు మళ్లీ భరోసా ఇచ్చి నిలబెట్టాలి. విభజనతో బలహీనపడిన ఒక చిన్న రాష్ట్రం, తిరిగి కోలుకోవడానికి కావలసింది ఆర్థిక శక్తి. సహజ వనరులను సక్రమంగా వినియోగంలోకి తెచ్చుకుని, పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిచ్చి సంపద సృష్టి జరగాలి. ఈ సవాలు సులువైనదేమీ కాదు. అయినా కూటమి పాలనలో రాష్ట్ర ప్రజల్లో ఒక ఆశ, నమ్మకం కలుగుతున్నాయి. చంద్రబాబు విజన్, కార్యదక్షత, అనుభవం, కసితో కూడుకున్న పట్టుదల.. ఇందుకు కారణం. కూటమి నాయకుల సమష్టి కృషి వల్ల మాత్రమే రాష్ట్రం నిలదొక్కుకుని నెగ్గుకు రాగలదు. జాతీయ రాజకీయాల్లో సంఖ్యాపరంగా శాసించే స్థానంలో ఉన్నా, రాష్ట్ర అభివృద్ధికి కావలసిన వనరులు సాధించుకోవడం మీదే చంద్రబాబు దృష్టి పెట్టారని అర్థమవుతోంది. సంయమనంతో, లౌక్యంతో చంద్రబాబు సాధించగలరు. కనీసం ప్రతిపక్ష నేతగా అయినా జగన్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. తాను సీఎంగా ఉంటే ఇంతకన్నా మెరుగ్గా ఏమి చేయగలనో ప్రజలకు వివరించి, వారి మనసులు జగన్ గెలుచుకోవాలి గానీ, చంద్రబాబు పాలనలో ప్రతిదీ తప్పేనంటూ తన సొంత మీడియాలో అచ్చేసి వదలడమే పనిగా పెట్టుకుంటే జనం మొదట నవ్వుకుంటారు. ఆ తర్వాత చిరాకుపడతారు. చివరికి ఆయన మాటల్నీ, ఆయననూ కూడా మరిచిపోతారు.

■ ఓ.వి. రమణ
టీటీడీ మాజీ పాలకమండలి సభ్యుడు, తెలుగుదేశం నాయకుడు





వారధి మధ్యలో పోలీస్ అవుట్‌పోస్ట్


వారధి వద్ద బ్యూటిఫికేషన్ ఐలాండ్ కుదింపు పనులు

ట్రాఫిక్‌కు చెక్

నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు కీలక మార్పులు

సీపీ ప్రత్యక్ష పరిశీలన అనంతరం నిర్ణయాలు

నగరంలో ట్రాఫిక్ కష్టాలు తొలగించడానికి పోలీసులు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు నగరం మొత్తం పర్యటించి వివిధ కూడళ్లలో చేయాల్సిన మార్పులను ట్రాఫిక్ అధికారులకు వివరించారు. ముఖ్యంగా బెంజిసర్కిల్ నుంచి వారధి వరకు ఉన్న మార్గంలో మార్పులకు శ్రీకారం చుట్టారు. - (ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఇక వారధి మొత్తం విజయవాడ పరిధిలోకే..

నేతాజీ బ్రిడ్జి వద్ద నుంచి మొదలయ్యే కనకదుర్గ వారధి గుంటూరు జిల్లాలో తాడేపల్లి వరకు ఉంటుంది. ఇప్పటి వరకు ఈ వారధి కొంతభాగం విజయవాడ ట్రాఫిక్ పోలీసుల పరిధిలోనూ, మరికొంతభాగం తాడేపల్లి పోలీసుల పరిధిలోనూ ఉండేది. వారధి రెండు వంతెనలపై ట్రాఫిక్ ఆగిపోయినప్పుడు ఆ ప్రభావం మొత్తం విజయవాడపై పడుతోంది. విజయవాడ-గుంటూరు-విజయవాడ మార్గంలో ప్రమాదం జరిగినా, వాహనాలు బ్రేక్‌డౌన్ అయినా ఆ ప్రభావం బెంజిసర్కిల్ వరకు ఉంటోంది. ఎలాచూసినా నష్టం విజయవాడకే ఉండటంతో మొత్తం వారధిని తమ పరిధిలోకి తీసుకోవాలని పోలీసు కమిషనర్ భావించారు. తాడేపల్లి వరకు ఉన్న వారధి రెండు వంతెనలను విజయవాడ ట్రాఫిక్ పోలీసులు తమ పరిధిలోకి తీసుకున్నారు. వారధికి మధ్యలో కానిస్టేబుల్ ఉండటం కోసం, అవసరమైన పరికరాలను భద్రపరుచుకోవడం కోసం మినీ ట్రాఫిక్ బూత్‌ను ఏర్పాటు చేశారు. వాహనాలు బ్రేక్‌డౌన్ అయినప్పుడు వాటిని లాగడానికి అవసరమైన ఐరన్ రోప్ వంటివి ఇక్కడ ఉంచుతారు. నిత్యం ట్రాఫిక్ పర్యవేక్షణకు ఒక కానిస్టేబుల్‌ను నియమిస్తారు.

వారధి వద్ద ఐలాండ్ కుదింపు

వీఎంసీ బ్యూటిఫికేషన్‌లో భాగంగా వారధి వద్ద భారీ ఐలాండ్ నిర్మించింది. దీనిమధ్యలో బౌద్ధచక్రాన్ని నిర్మించింది. దీనికి చుట్టుపక్కల గ్రీనరీతో పాటు వాటర్ ఫౌంటేన్ నిర్మిస్తోంది. దీని ప్రవేశ ద్వారాన్ని జాతీయ రహదారిపైకి నిర్మించారు. విజయవాడ-గుంటూరు, విజయవాడ-ఏలూరు మార్గంలో ఇది కీలకమైన సర్కిల్. పీఎన్‌బీఎస్ నుంచి గుంటూరు, తెనాలి వెళ్లే బస్సులు ఈ సర్కిల్ నుంచి మలుపు తిరిగి వారధిపైకి వెళ్తాయి. విశాఖపట్నం, కాకినాడ, అమలాపురం, రాజమండ్రి, ఏలూరువైపు నుంచి వచ్చే బస్సులు వారధి కింద నుంచి సర్కిల్‌కు రెండోవైపు పీఎన్‌బీఎస్‌కు వెళ్తాయి. ఇక్కడున్న ట్రాఫిక్ బూత్ వద్ద పీఎన్‌బీఎస్‌కు వెళ్లే మార్గంలో, ఏలూరు వైపు వెళ్లే మార్గంలో ఐలాండ్ ఐరన్ ఫెన్సింగ్ రహదారులపైకి రావడంతో ఇరుగ్గా మారింది. దీంతో ఇక్కడ వాహనాలు నిలిచిపోతున్నాయి.

మిగతా 6లో..

బియ్యాన్ని బొక్కేసి..



అధికారంలో ఉన్న ఐదేళ్లూ అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారు. పదవులను అడ్డం పెట్టుకుని చేసిన దోపిడీ సరిపోక చివరికి పేదల బియ్యాన్ని బొక్కేశారు. ఈ వ్యవహారంలో మాజీమంత్రి, వైసీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు పేర్ని నాని అడ్డంగా బుక్కైపోయారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నేరం నాది కాదు.. వేబ్రిడ్జిదే అంటూ బుకాయిస్తున్నారు.

బుకాయింపులా

పీడీఎస్ బియ్యం దోపిడీలో దొరికిపోయిన పేర్ని నాని



- మార్చి, ఏప్రిల్‌లోనే 187 టన్నుల బియ్యం మాయం
- గుట్టుగా ఉంచిన పౌరసరఫరాల శాఖ అధికారులు
- వైసీపీ హయాంలో ఇష్టానుసారంగా బియ్యం తరలింపు
- కూటమి ప్రభుత్వ రాకతో బయటపడిన నిజాలు
- ముందస్తు సమాచారంతో పేర్ని నాని లేఖ డ్రామా

పేర్ని జయసుధపై కేసు నమోదు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్ సమీపంలో ఉన్న పొట్లపాలెం గ్రామంలో వైసీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి పేర్ని నానికి సుమారు 2 ఎకరాల్లో గోదాములు ఉన్నాయి. 2020లో ఆయన సతీమణి జయసుధ పేరుతో ఇక్కడ గోదాములను నిర్మించి పౌరసరఫరాల శాఖకు అద్దెకిచ్చారు. పౌరసరఫరాల శాఖ వీటిని బఫర్ గోదాములుగా వినియోగిస్తోంది. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు.. అంటే మార్చి, ఏప్రిల్‌లో 187 టన్నుల పీడీఎస్ బియ్యం ఇక్కడి నుంచి మాయమైంది. ప్రతినెలా నిర్వహించే తనిఖీల్లో ఈ విషయాన్ని గుర్తించినా అప్పట్లో అధికారులు గుట్టుగా ఉంచారు. తాజాగా గుట్టురట్టు కావడంతో పేర్ని జయసుధపై పోలీసులు కేసు నమోదు చేశారు. బందరు తాలుకా పీఎస్‌లో బీఎన్ఎస్ 316(3), 316(5), 61(2) రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

బయటపడిందిలా..

పేర్ని నాని నిర్మించిన గోదాములు పౌరసరఫరాల శాఖ ప్రమాణాల మేరకు లేవు. గోదాముల చుట్టూ లారీలు తిరిగేందుకు రోడ్డును నిర్మించాల్సి ఉంటుంది. బియ్యం పాడవ్వకుండా, గోదాముల్లోకి తేమ చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇవేమీ లేకుండానే గోదాములు నిర్మించేయడం, వాటిని పౌరసరఫరాల శాఖకు అద్దెకు ఇచ్చేయడం జరిగిపోయింది. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండటంతో పేర్ని నాని మాటకు తిరుగు లేకుండాపోయింది. ఎన్నికల అనంతరం పేర్ని నాని గోదాములపై స్థానిక టీడీపీ నాయకులు పౌరసరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. నిర్దేశిత ప్రమాణాల మేరకు లేకున్నా వాటిని ఎలా నిర్వహిస్తున్నారంటూ ప్రశ్నించారు. దీనిపై స్పందించిన పౌరసరఫరాల శాఖ అధికారులు గోదాములను పరిశీలించి, నిర్దేశిత ప్రమాణాల మేరకు లేవని, వెంటనే ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారు. గోదాములను నవంబరు నెలాఖరులో ఖాళీచేసే సమయంలో రికార్డుల ప్రకారం బియ్యం లేకపోవడంతో విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. నవంబరు 28, 29 తేదీల్లో గోదాములను తనిఖీ చేసిన అధికారులు 187 టన్నుల బియ్యం తగ్గినట్టు గుర్తించారు.

తనిఖీల విషయం తెలిసే..

పీడీఎస్ బియ్యం తగ్గిన విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడానికి ముందే పేర్ని నానికి చేరిపోయింది. బయట కొనుగోలు చేసిన బియ్యాన్ని గోదాములకు చేర్చి గుట్టుచప్పుడు కాకుండా బయటపడటానికి తగిన సమయం లేకపోవడం.. అంత భారీస్థాయిలో బియ్యాన్ని అప్పటికప్పుడు సమకూర్చడం కష్టమని తెలిపోవడంతో పేర్ని నాని లేఖ డ్రామాకు తెరలేపారు. 'గోదాముల్లో బియ్యం తగ్గిన విషయం మా దృష్టికి వచ్చింది. వేబ్రిడ్జిలో లోపం కారణంగా బియ్యం తగ్గి ఉండొచ్చు. తగ్గిన బియ్యానికి ఎంత మొత్తం విలువ

మిగతా 6లో..

నెంబర్ వన్ కావాలి

జీవీఏలో ఎన్టీఆర్‌కు 2, కృష్ణాకు 3 స్థానాలు

కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు


సదస్సులో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాష్ట్ర ప్రభుత్వాదానికి స్థూల విలువ జోడింపు (జీవీఏ), గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రోడక్ట్ (జీడీడీపీ)లో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలు 2, 3 స్థానాలు సాధించాయని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అమరావతి సచివాలయంలో బుధవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు మాట్లాడారు. ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ రంగంలో రాష్ట్రంలో 23వ స్థానంలో ఉన్నప్పటికీ, పారిశ్రామిక, సేవారంగాల్లో సాధించిన వృద్ధితో రెండో స్థానంలో నిలవడాన్ని ప్రశంసించారు. పారిశ్రామికంగా ఉన్న అవకాశాలను వినియోగించుకోవటం ద్వారా రూ.14,228 కోట్ల జీవీఏతో ఐదో స్థానం సాధించటాన్ని ప్రస్తావించారు. సేవల రంగంలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. సేవారంగాన్ని మరింత బలోపేతం చేసుకోవటం ద్వారా ఎక్కువ జీవీఏను సాధించవచ్చని చంద్రబాబు సూచించారు. జీవీఏను ఒక్కశాతం పెంచగలిగితే రూ.10,500 కోట్ల ఆదాయాన్ని సాధించవచ్చన్నారు. విశాఖ, ఎన్టీఆర్ జిల్లాల కంటే కృష్ణాజిల్లా వ్యవసాయంలో రూ.32,372 కోట్లతో రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచిందని చంద్రబాబు అభినందించారు.

వాట్సాప్ గవర్నెన్స్ దుర్భేధ్యమైన సైబర్ సెక్యూరిటీ కల్పించాలి : కలెక్టర్ లక్ష్మీశ

రాష్ట్ర ప్రభుత్వ వాట్సాప్ గవర్నెన్స్‌కు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు కలెక్టర్ లక్ష్మీశ పలు సూచనలు చేశారు. వాట్సాప్ గవర్నెన్స్‌ను దుర్భేధ్యమైన సైబర్ సెక్యూరిటీ కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరాన్ని సూచించారు. సైబర్ మోసాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ లక్ష్మీశా సూచనలను చంద్రబాబు స్వాగతించారు.

మూడు ఇసుక రీచ్‌లకు

టెండర్లు ఖరారు

జిల్లాలో ఇసుక తవ్వకాలకు మరో మూడు రీచ్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలంలోని కాసరబాద్, రుక్కనూరు, కాసరబాద్ - రుక్కనూరు రీచ్‌లకు సంబంధించిన కాంట్రాక్ట్ సంస్థలను కలెక్టర్ సమక్షంలో రెండు రోజుల కిందట లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఈ మూడు రీచ్‌ల్లో ఎక్స్‌కవేటర్ల ద్వారా తవ్వి లారీల్లో లోడింగ్ చేయనున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): జిల్లాలో మొత్తం 15 ఇసుక రీచ్‌లు ఉన్నాయి. వాటిలో 12 రీచ్‌ల్లో ఇసుకను కార్మికుల ద్వారా తవ్వించి వాహనాల్లో లోడింగ్ చేయిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ నడుస్తోంది. తాజాగా మూడు రీచ్‌ల్లో ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు చేసేందుకు టెండర్లను ఆహ్వానించారు. మొత్తం 25 మంది ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. క్యూబిక్ మీటరు తవ్వకానికి రూ.35 తక్కువ కాకుండా టెండర్‌ను కోట్ చేయాలని భూగర్భ గనుల శాఖ షరతు విధించింది. ఇంతకుముందు కార్మికులతో తవ్వకాలు జరిపేందుకు రీచ్‌లకు నిర్వహించిన టెండర్లలో చాలా తక్కువకు కోట్ చేశారు. దీనిపై అనేక అనుమానాలు వచ్చాయి. దీంతో రూ.35 షరతును విధించారు. చందర్లపాడు మండలంలోని కాసరబాద్ రీచ్‌లకు రూ.3.44 లక్షలు, రుక్కనూరు రీచ్‌కు రూ.1.96 లక్షలు, కాసరబాద్ - రుక్కనూరు రీచ్‌కు రూ.3.60 లక్షలుగా ధర నిర్ణయించారు. వాటిలో కాసరబాద్ రీచ్‌ను మధుకాన్ కంపెనీ దక్కించుకుంది. రుక్కనూరు రీచ్‌ను వర్ధన్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ, కాసరబాద్ - రుక్కనూరు రీచ్‌ను ఎస్వీడీ ఇన్‌ఫ్రా కంపెనీలు దక్కించుకున్నాయి. ఈ మూడు రీచ్‌ల్లో ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు చేయడానికి జాతీయ గ్రీన్ ట్రిబ్యూనల్ కొద్దిరోజుల క్రితమే అనుమతులు ఇచ్చింది. టెండర్ల ప్రక్రియ పూర్తవ్వడంతో కాలుష్య నియంత్రణ మండలి అనుమతుల కోసం భూగర్భ గనుల శాఖ అధికారులు ఆ శాఖకు లేఖ రాశారు. కాలుష్య నియంత్రణ

మిగతా 6లో..

అంతా మా ఇష్టం

ఇష్టారాజ్యంగా ఎన్‌హెచ్ రీజనల్ ఆఫీసు అధికారుల తీరు

పశ్చిమ బైపాస్ రోడ్డు వెంబడి విద్యుత్ టవర్ల మార్పులో తిర'కాసులు'

- 7-10 మీటర్లలోపు టవర్ల మార్పునకు 105 మీటర్ల వరకు ప్రతిపాదన
- మూతపడిన ల్యాంకో పవర్ ప్రాజెక్టు పేరుతో పనులు
- రూ.32.58 కోట్ల పనుల వెనుక కమీషన్ల వ్యవహారం
- రూ.300 కోట్ల రైతుల ఆస్తులకు నష్టం కలిగే అవకాశం

మైండ్‌గేమ్ మనీ గేమ్ 2

అడిగేవారెవరూ లేకపోతే అంతా వారిష్టమే అన్నట్టుంది ఎన్‌హెచ్ రీజనల్ కార్యాలయ ఉన్నతాధికారుల తీరు. విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు వెంబడి 7 నుంచి 10 మీటర్ల దూరంలో విద్యుత్ టవర్ల మార్పునకు అవకాశమున్నా.. కావాలనే 105 మీటర్ల దూరానికి ప్రతిపాదన పెట్టడం వెనుక అనేక అనుమానాలు కలుగుతున్నాయి. పైగా మూతపడిన ల్యాంకో సంస్థకు ఈ పనులు అప్పగించడం వెనుక ఎవరికి ప్రయోజనం ఉంది? ఎంత చేతులు మారిందన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు వెంబడి జక్కంపూడిలోని భూముల్లో హైటెన్షన్ ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పునకు సంబంధించి మరో విషయం వెలుగులోకి వచ్చింది. ల్యాంకో 400 కేవీ విద్యుత్ ట్రాన్స్‌మీటర్ల టవర్ల మార్పునకు నిర్దేశించిన అర్ధ చంద్రాకారపు అలైన్‌మెంట్‌ను బైపాస్ రోడ్డుకు 105 మీటర్ల దూరంలో నిర్మించేలా ప్రతిపాదించారు. ఇదే బైపాస్ వెంబడి ట్రాన్స్‌కోకు చెందిన రెండు హైటెన్షన్ ట్రాన్స్‌మీటర్ టవర్ల లైన్ల కేవలం 7, 10 మీటర్ల దూరంలోనే మార్చారు. ఈ పనులను కూడా వెస్ట్ బైపాస్ రోడ్డు కాంట్రాక్టు సంస్థే చేపట్టింది. అసలు వినియోగంలో లేని, మూతపడిన ల్యాంకో ట్రాన్స్‌మిషన్ పవర్ లైన్స్‌కు 105 మీటర్ల దూరం ఎందుకు నిర్దేశించారు? ఏ ఉద్దేశంతో నిర్దేశించారు? ఎవరి ప్రయోజనాల కోసం నిర్దేశించారు? వంటి విషయాలు వివాదాస్పదంగా మారాయి.

టవర్ల మార్పిడిలో మతలబు

ల్యాంకో హైటెన్షన్ ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడికి సంబంధించిన అలైన్‌మెంట్ విషయంలో సాంకేతిక అంశాలు కీలకంగా మారాయి. కడపలో ఎన్‌హెచ్-40 విస్తరణలో భాగంగా అక్కడి ట్రాన్స్‌కోకు చెందిన 765 కేవీ లైన్స్ ట్రాన్స్‌మీటర్ టవర్లను మార్చేందుకు రోడ్డు వెంబడి నిర్దేశించిన దూరం 10-12 మీటర్లే. ల్యాంకో 400 కేవీ కంటే కూడా ట్రాన్స్‌కో 765 కేవీ లైన్స్ అత్యంత శక్తివంతమైనది. ప్రమాదకరమైనది కూడా. అయినప్పటికీ భవిష్యత్తు విస్తరణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 7 నుంచి 10 మీటర్ల దూరం వరకు అనుమతించినపుడు.. వెస్ట్ బైపాస్‌కు 105 మీటర్ల దూరం ఎందుకున్నది మిస్టరీగా ఉంది. దీనివల్ల రైతులు, ప్లాట్ల యజమానులు ఎక్కువగా నష్టపోతున్నారు. రూ.300 కోట్ల విలువ చేసే రైతుల భూములు నాశనమవుతున్నాయి. పోనీ రైతుల అంగీకారం తీసుకుని అలైన్‌మెంట్‌ను నిర్దేశించారా అంటే అదీ లేదు. ఇంత ఖర్చు లేకుండా కేవలం రూ.5 కోట్లలోపే 4 టవర్లను మార్చగలిగితే సమస్య పరిష్కారమవుతుందని, దీనికోసం పరిహారానికి పట్టుబట్టకుండా మా భూములు త్యాగం చేస్తామని రైతులు ప్రతిపాదించినా వినలేదు? ఎన్‌హెచ్ రీజనల్ ఆఫీసు ఉన్నతాధికారులు.. కాంట్రాక్టు సంస్థపై ప్రేమతో కావాలనే ఇలా చేశారని అర్థమవుతోంది. అవసరం లేకపోయినా.. రూ.32.58 కోట్ల పనిచేయించే ఉద్దేశం వెనుక కమీషన్ల వ్యవహారం ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు రైతులు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

మిగతా 6లో..

భవానీ దీక్షల విరమణకు

పటిష్ఠ ఏర్పాట్లు

దుర్గగుడి ఈవో రామారావు

6లో



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఈవో రామారావు

భవానీ దీక్షల విరమణకు విస్తృత ఏర్పాట్లు

» దుర్గగుడి ఈవో రామారావు

వన్‌టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కలశజ్యోతి ఉత్సవాలు, భవానీదీక్షల విరమణలకు ఇంద్రకీలాద్రిపై విస్తృత ఏర్పాట్లు చేపట్టనున్నట్టు ఈవో కేఎస్ రామారావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఈవో అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. భవానీదీక్షల సందర్భంగా 14న కలశజ్యోతి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని, ఆరోజు సాయంత్రం 6 గంటల నుంచి గాంధీనగరంలోని శివరామకృష్ణ క్షేత్రం నుంచి ఉత్సవం బయలుదేరుతుందని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఈవో సూచించారు. రథం అలంకరణ, విద్యుత్ దీపాలు, సౌండ్ సిస్టమ్, తదితరాలను సిద్ధం చేయాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఊరేగింపు సాగాలన్నారు. టాయిలెట్లు, శానిటేషన్ అంశాలలో లోపాలు లేకుండా చూసుకోవాలని, సీసీ కెమెరాలను వినియోగించుకునేందుకు వాటి పనితీరును పరిశీలించాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు ఆయన సూచనలు చేశారు.

● 21 నుంచి దీక్షల విరమణ

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈనెల 21 నుంచి 25 వరకు జరగనున్న భవానీ దీక్షల విరమణలకు పటిష్ట ఏర్పాట్లు చేయియాలని ఈవో రామారావు చెప్పారు. గతంలో కంటే మెరుగైన సౌకర్యాల కల్పన కోసం కృషి చేయాలన్నారు. క్యూలు, షెడ్లు, విద్యుత్, మైక్ ప్రసారం, ఇరుముడి పాయింట్ల వద్ద స్టాండ్లు, ఇరుముడి పాయింట్ల నిర్వహణ, కొబ్బరికాయలు సమర్పించే ప్రదేశం, హోమగుండాల నిర్వహణలో తగు జాగ్రత్తలు తీసుకుని ఏర్పాట్లు చేయాలన్నారు.

● భవానీ భక్తులకు ఉచిత దర్శనం

భవానీ దీక్షల విరమణల దీక్షలకు వచ్చే భక్తులందరికీ అమ్మవారి దర్శనం ఉచితంగానే లభిస్తుందని, అంతరాలయ దర్శన టిక్కెట్లను రద్దు చేస్తున్నామని, ఆర్జిత సేవలను కూడా నిలుపుదల చేస్తున్నామని ఈవో తెలిపారు. 21వ తేదీ ఉదయం 6.30 గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభమవుతుందని, ఆ తరువాత మిగిలిన రోజుల్లో వేకువజామున 3 నుంచి రాత్రి 11 గంటల వరకు నిరంతరాయంగా అమ్మవారి దర్శనం లభిస్తుందన్నారు. సమీక్షా సమావేశంలో డిప్యూటీ ఈవో రత్నరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కె.వి.ఎస్.కోటేశ్వరరావు, టి.వైకుంతరావు, వైదిక కమిటీ సభ్యులు, ఏఈవోలు, పర్యవేక్షకులు, డీఈఈలు, ఇంజనీరింగ్ సిబ్బంది, ఐటీ, సెక్యూరిటీ, శానిటేషన్, తదితర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మవారికి కానుకగా బంగారు నత్తును డిప్యూటీ ఈవోకు అందజేస్తున్న వేలూరి అమోఘ్, కుటుంబసభ్యులు

కనకదుర్గమ్మకు కానుకగా బంగారు నత్తు

వన్‌టౌన్ : విజయనగరం జిల్లా, చీపురుపల్లికి చెందిన వేలూరి అమోఘ్, కుటుంబసభ్యులతో కలిసి బుధవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి అలంకరణ నిమిత్తం 10.5 గ్రాముల బంగారు నత్తు (ముక్కుపుడక)ను కానుకగా డిప్యూటీ ఈవో రత్నరాజుకు అందజేశారు. అలాగే అన్నవితరణ నిమిత్తం రూ. లక్ష చెక్కు అందజేశారు. కృష్ణలంకకు చెందిన ఉమ్మడిశెట్టి లక్ష్మీవైష్ణవి, కుటుంబసభ్యులతో కలిసి దుర్గమ్మను దర్శించుని అన్నవితరణ నిమిత్తం రూ. లక్ష చెక్కును అందజేశారు.



కృష్ణాతరంగ్‌లో కళాశాల విద్యార్థులు

హృద్యంగా.. కృష్ణాతరంగ్

వన్‌టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కేబీఎన్ కళాశాలలో కృష్ణాయూనివర్సిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న కృష్ణా తరంగ్ కార్యక్రమాలు బుధవారం రెండో రోజుకు చేరాయి. విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొంటూ హుషారును ప్రదర్శిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 27 కళాశాలలకు చెందిన 580 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభా పాటవాలను చాటుకున్నారు. బుధవారం పాటలు, ముగ్గులు, చర్చ, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. కాగా, గురువారంతో కార్యక్రమాలు ముగియనున్నాయి. విజేతలకు బహుమతులు అందజేస్తామని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ జి.కృష్ణవేణి తెలిపారు.

రాజధాని రైతులకు 'ఈ-లాటరీ' నేడు

వన్‌టౌన్ : రాజధాని అమరావతి రైతులకు ప్రత్యామ్నాయంగా అప్పగించే ప్లాట్లకు ఈనెల 12న గురువారం 'ఈ-లాటరీ' నిర్వహిస్తున్నట్టు ఏపీ సీఆర్డీఏ కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని ప్రధాన కార్యాలయంలో 'ఈ-లాటరీ' జరుగుతుందని తెలిపారు. అమరావతి ప్రాంతంలోని 14 గ్రామాల రైతులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ప్లాట్లను కేటాయించనున్నట్టు తెలిపారు. నవులూరు 1, 2 కురగల్లు 1, 2 నిడమర్రు 1, 1 రాయపూడి 1, 2 లింగాయపాలెం, మల్కాపురం, నెక్కల్లు, శాఖమూరు, తుళ్లూరు 1, 2 వెలగపూడి, మందడం 1, 2 అనంతవరం, ఐనవోలు తదితర గ్రామాల్లో సంబంధిత రైతులు హాజరుకావాలని సూచించారు.

తలశిల కేసు వివరాలు ఇవ్వండి

» పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గొల్లపూడికి చెందిన టీడీపీ నేత కారంపూడి రవీంద్ర ఆత్మహత్య వ్యవహారంలో కంచికచర్ల పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం వేసిన పిటిషన్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు కేసుకు సంబంధించి పూర్తి వివరాలు తమ ముందు ఉంచాలని పోలీసులను ఆదేశించింది. విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత పిటిషనర్ తరపు న్యాయవాది సాయి శరణ్ స్పందిస్తూ వ్యాజ్యాన్ని అత్యవసరంగా విచారణ చేపట్టాలని అభ్యర్థించగా.. న్యాయమూర్తి నిరాకరించారు. గొల్లపూడికి చెందిన టీడీపీ నేత కారంపూడి రవీంద్ర గత నెల 17న ఆత్మహత్య చేసుకున్నారు. రవీంద్ర ఆత్మహత్యకు తలశిల రఘురాం, మరికొందరు కారణమని పేర్కొంటూ మృతుడి సోదరుడు రాధాకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కంచికచర్ల పోలీసులు నవంబరు 18న కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ16గా ఉన్న తలశిల రఘురాం ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు.

అగ్రీక్లీనిక్‌పై ఉచిత శిక్షణ

గన్నవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మండలం సూరంపల్లి ఎలీప్ ఇండస్ట్రీయల్‌లో నిరుద్యోగ యువతకు వ్యవసాయ, వ్యాపార రంగాల్లో 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఏసీఏబీసీ ట్రైనింగ్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ శోభారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ వ్యవసాయ విస్తరణ కేంద్రం సంస్థ సహకారంతో ఎలీప్, సీఈడీ ఆధ్వర్యంలో అగ్రి క్లీనిక్ స్థాపించేందుకు శిక్షణను ఇస్తున్నట్టు తెలిపారు. అగ్రికల్చర్, హార్టీకల్చర్, సెరికల్చర్, పశువైద్య విజ్ఞానం, చేపల పెంపకం, బయోటెక్నాలజీ, అగ్రి ఇంజనీరింగ్, ఫారెస్ట్రీ, ఫుడ్ అండ్ న్యూట్రీషన్, బీజడ్సీ, హోమ్ సైన్స్, ఎన్విరాన్‌మెంట్ సైన్స్‌పై పోస్ట్ గ్రాడ్యుయేషన్, గ్రాడ్యుయేషన్, డిప్లొమో చదివిన పట్టభద్రులు మాత్రమే అర్హులన్నారు. వ్యవసాయ అనుబంధ వ్యాపార ఉత్పత్తులు, అవగాహన, నిర్వహణ, బ్యాంకింగ్ రంగం ద్వారా లభించే రుణ సదుపాయాలు, డిటేయిల్ ప్రాజెక్టు రిపోర్టు, మార్కెటింగ్ టెక్నిక్యూస్ వంటి అంశాలపై 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, భోజన వసతి కల్పిస్తామని శోభారాణి తెలిపారు. శిక్షణ పూర్తయిన తరువాత ధృవీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. శిక్షణకు ఈ నెల 23 నుంచి దరఖాస్తులు తీసుకోనున్నట్టు చెప్పారు. ఇతర వివరాలకు 94412-66769 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వామ్మో వంతెన..!



ఎన్టీఆర్ జిల్లాలో బుడమేరు సృష్టించిన బీభత్సం నుంచి నగరం పూర్తిగా కోలుకున్నా కొన్నిచోట్ల వరద తాలూకు ఆనవాళ్లు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయానికి వెళ్లే దారిలోని వంతెన బుడమేరు వరద తాకిడికి దెబ్బతింది. అయితే అప్పటి నుంచి వంతెన మరమ్మతులకు నోచుకోలేదు. నిత్యం రద్దీగా ఉండే వంతెనపై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, స్థానిక ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– పెనుగంచిప్రోలు

విజయవాడ కోర్టుకు తెలంగాణ నేత 'నాగం'

» ఓబులాపురం పరిశీలనపై కేసు విచారణకు హాజరు

విజయవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో ఓబులాపురం గనుల్లో అక్రమ మైనింగ్ పరిశీలనకు వెళ్లిన వారిపై నమోదైన కేసుకు సంబంధించి విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణకు మాజీ మంత్రి, తెలంగాణ నేత నాగం జనార్దన్‌రెడ్డి బుధవారం హాజరయ్యారు. ఆయనతో పాటు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్ప తదితరులు హాజరయ్యారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అనంతపురం జిల్లాలోని డి.హీరేహాళ్ మండలంలోని ఓబులాపురం ఐరన్ ఓర్ గనుల అంశం అప్పట్లో అసెంబ్లీ సమావేశాలను ఒక కుదుపు కుదిపేసింది. ఆ గనులను పరిశీలించడానికి అప్పటి టీడీపీ నేతలు వెళ్లినపుడు మొత్తం 18 మందిపై కేసు నమోదు చేశారు. ఇప్పుడు ఆ కేసు విచారణకు రాగా నిందితుల తరపున న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. తదుపరి విచారణను న్యాయాధికారి ఈనెల 24కు వాయిదా వేశారు.



ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన నాగం జనార్దన్‌రెడ్డి, దేవినేని ఉమా, చినరాజప్ప

పాత మిత్రులను కలిపిన కోర్టు

ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీలో ఉన్న బలమైన నేతల్లో నాగం జనార్దన్‌రెడ్డి ఒకరు. రాష్ట్ర విభజన తర్వాత ఆయన టీడీపీ నుంచి వెళ్లిపోయాక ఏపీ నేతలతో కూడా దూరం పెరిగింది. ఈ కేసు విచారణ సందర్భంగా నాగంను కోర్టులో దేవినేని ఉమా, అచ్చెన్నాయుడు, చినరాజప్ప కలిశారు. చాన్నాళ్ల తర్వాత కలవడంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఓబులాపురం వెళ్లినప్పుడు జరిగిన విషయాలను చర్చించుకున్నారు.



నిందితుడి వివరాలు ప్రకటిస్తున్న పోలీసులు

దొంగ దొరికాడు

» వ్యసనాలకు బానిసై చోరీలు

» వలపన్ని పట్టుకున్న పోలీసులు

వన్‌టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టపగలే కారు అద్దాలు పగలగొట్టి నగదు బ్యాగ్ చోరీ చేసిన నిందితుడిని పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు క్రైం డీసీపీ కె.తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావు పర్యవేక్షణలో క్రైం ఏసీపీ వెంకటేశ్వర్లు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రామ్‌కుమార్ తదితరులు గాలించి బ్యాగ్‌ను దొంగిలించిన గుంటూరు జిల్లా చేబ్రోలుకు చెందిన మూల్పూరి ఫణీంద్రరెడ్డి అలియాస్ ఫణి (36)ని బుధవారం అరెస్టు చేశారు. ఫణీంద్ర రెడ్డి క్యాటరింగ్ పనిచేస్తూ జల్సాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో దొంగతనాలకు అలవాటుపడ్డాడు. గతనెల 6న రథం సెంటర్ సమీపంలో పార్కింగ్ చేసిన కారు అద్దాలు పగలకొట్టి అందులోని బ్యాగ్‌ను చోరీ చేశాడు. గుడివాడకు చెందిన భక్తుడు అమ్మవారి దర్శనం నిమిత్తం కొండపైకి వెళ్లేందుకు రథం సెంటర్‌లో కారును పార్కింగ్ చేసి దుర్గమ్మవారి దర్శనానికి వెళ్లాడు. తిరిగి వచ్చి కారు అద్దాలు పగిలి ఉన్నట్టు గమనించి, కారులో ఉన్న బ్యాగ్ చోరీకి గురైనట్టు గుర్తించాడు. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వన్‌టౌన్ తారాపేట స్టేషన్ సమీపంలో అనుమానంగా తిరుగుతున్న ఫణీంద్ర రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. సులభంగా డబ్బు సంపాదించాలని దొంగతనాలకు అలవాటు పడినట్టు ఫణీంద్ర విచారణలో తెలిపాడు. కారులో బ్యాగ్ గమనించి దొంగతనం చేశానని, పక్కనే ఉన్న మరో కారు అద్దాలు పగలకొట్టి లోపల ఉన్న రెండు సెల్ ఫోన్లను దొంగిలించినట్టు తెలిపాడు. అతడి నుంచి రూ. 2లక్షల విలువైన 8 గ్రాముల బ్రాస్‌లెట్‌ను, రెండు సెల్‌ఫోన్‌లు, నికాన్ కెమెరాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ట్రాఫిక్‌కు చెక్

(5వ పేజీ తరువాయి)

ఇక్కడ రహదారిని విస్తరించాలంటే ఐలాండ్ ఫెన్సింగ్‌ను ఇంకా లోపలకు కుదించాలని నిర్ణయించారు. ఈ పనులను వీఎంసీతో పూర్తి చేయించారు. దీంతో ఇక్కడ రహదారి కాస్త విశాలంగా మారింది.

స్క్యూబ్రిడ్జి వద్ద కటింగ్

స్క్యూబ్రిడ్జి.. ఈ కూడలి చిన్నదే అయినా ట్రాఫిక్ ఆగితే మాత్రం సమస్య తీవ్రంగా ఉంటుంది. అవనిగడ్డకు రాకపోకలు సాగించే బస్సులు ఈ కూడలిలోనే జాతీయ రహదారిపైకి వస్తాయి. ఇక్కడి నుంచే రామలింగేశ్వరనగర్, యనమలకుదురువైపు వెళ్లే వాహనాలు బస్సులు కరకట్ట మీదకు వెళ్తాయి. రామలింగేశ్వరనగర్ కరకట్ట మీదకు వెళ్లడానికి స్క్యూబ్రిడ్జి జంక్షన్ ఒకటోది. దీనికి ముందు దూరదర్శన్ సిబ్బంది క్వార్టర్స్ దగ్గర ఉన్న జంక్షన్ రెండోది. జాతీయ రహదారి పైనుంచి కరకట్ట మీదకు వాహనాలు వెళ్లేటప్పుడు బెంజిసర్కిల్ నుంచి వారధి వైపు వెళ్లే వాహనాలను నిలుపుదల చేయాల్సి వస్తోంది. దీనివల్ల ట్రాఫిక్ బెంజిసర్కిల్ మొదటి ఫ్లైఓవర్ అండర్‌పాస్ వరకు ఆగిపోతోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు కార్లు, లారీల మధ్య ఉన్న ఖాళీల నుంచి తప్పించుకుని నెమ్మదిగా స్క్యూబ్రిడ్జి ఫుట్‌పాత్ పై నుంచి వెళ్తున్నారు. దీంతో పాదచారులు నడిచే ప్రదేశం లేక ఇబ్బంది పడుతున్నారు. బెంజిసర్కిల్ నుంచి రామలింగేశ్వరనగర్ వైపు వెళ్లే వాహనదారులు స్క్యూబ్రిడ్జి కూడలి నుంచి మలుపు తీసుకోవాల్సి ఉంటుంది. ట్రాఫిక్ ఆపినప్పుడు వారధి వైపు వెళ్లే వాహనాలతో పాటు కరకట్టపైకి వెళ్లాల్సిన వాహనాలు ఆగిపోతున్నాయి. కరకట్ట మీదకు వెళ్లే ద్విచక్ర వాహనాలు సులువుగా వెళ్లడానికి వీలుగా ఇక్కడ ఉన్న ఫుట్‌పాత్‌కు కటింగ్ ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. స్క్యూబ్రిడ్జి ప్రారంభం నుంచి ముందున్న ట్రాఫిక్ బూత్ వరకు ఫుట్‌పాత్ ఉంది. బ్రిడ్జిని ఆనుకుని ఉన్న వంగవీటి మోహనరంగా పార్కు ముందు ఖాళీ ప్రదేశం ఉంది. ఈ ప్రాంతంలో ద్విచక్ర వాహనాలు వెళ్లిపోవడానికి వీలుగా ఫుట్‌పాత్‌ను కట్ చేయించాలని నిర్ణయించారు. దీనివల్ల కరకట్టపైకి వెళ్లే ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నుంచి విముక్తి కలుగుతుంది.

బుకాయింపులా..

(5వ పేజీ తరువాయి)

అయితే ఆ మొత్తాన్ని చెల్లిస్తాను' అని కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మకు పేర్ని నాని తన సతీమణి ద్వారా లేఖ రాయించారు. ఉన్నతాధికారులు తనిఖీలకు వచ్చేందుకు సరిగ్గా ఒకరోజు ముందు ఆయన ఈ లేఖ రాయడం గమనార్హం. పౌరసరఫరాల శాఖలో కొందరు అధికారులే పేర్ని నానీకి ముందుగా సమాచారం చేరవేశారన్న ఆరోపణలు ఉన్నాయి. వేబ్రిడ్జిలో లోపాలు ఉంటే రికార్డుల్లోనూ, క్షేత్రస్థాయిలోనూ ఒకేలా నమోదు కావాలి. అలాకాకుండా రికార్డుల్లో ఓ రకంగా, క్షేత్రస్థాయిలో మరో రకంగా ఎందుకు ఉంటుందని, తప్పును కప్పిపుచ్చుకునేందుకే పేర్ని నాని బుకాయిస్తున్నారని స్పష్టమవుతోంది.

రేషన్ మాఫియాలో భాగమేనా..?

పేదలకు దక్కాల్సిన పీడీఎస్ బియ్యాన్ని పక్కదారి పట్టించిన ఉదంతంలో బియ్యం ఎక్కడికి చేరిందన్న దానిపై అధికారులు దృష్టి సారించాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు. పేర్ని నాని సైతం రేషన్ మాఫియాతో చేతులు కలిపి పేదల బియ్యాన్ని తన గోదాముల నుంచి నేరుగా కాకినాడ పోర్టుకు తరలించేవారని వారు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో బియ్యం పక్కదారి పట్టిన విషయం వెలుగు చూసిందని, వైసీపీ హయాంలోనూ వందల టన్నుల బియ్యం ఈ గోదాము నుంచి నేరుగా కాకినాడ పోర్టుకు తరలిపోయాయని వారు ఆరోపిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

టెండర్లు ఖరారు

(5వ పేజీ తరువాయి)

మండలి అనుమతి ఇచ్చిన తర్వాత తవ్వకాలు నిర్వహించనున్నారు.

ప్రస్తుతం 11 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ

జిల్లాలో మొన్నటి వరకు ఉన్న ఇసుక కొరత సమస్య కొద్దినెలల క్రితం నుంచి నెమ్మదిగా తగ్గుతూ వస్తోంది. జిల్లాలో ఉన్న స్టాక్ యార్డుల్లో ప్రస్తుతం 11 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉంది. తాజాగా టెండర్లు ఖరారు చేసిన మూడు రీచ్‌ల నుంచి 7.44 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి వస్తుందని భూగర్భ గనుల శాఖ అధికారులు అంచనా వేశారు. భూగర్భ గనుల శాఖ, జలవనరుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు జగ్గయ్యపేట నుంచి కృష్ణానదిలో సర్వే చేశారు. చందర్లపాడు మండలంలో ఉన్న కాసరబాద్, కాసరబాద్ 4, రుక్కునూరు 5 ప్రాంతాల్లో 7.6 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక లభ్యత ఉన్నట్టు అంచనా వేశారు.

అంతా మా ఇష్టం

(5వ పేజీ తరువాయి)

మూతపడిన ల్యాంకోతో పనులా..?

ల్యాంకో పవర్ ప్రాజెక్టు 2022లో మూతపడింది. అంతకుముందు ఆ సంస్థ తరఫున ఆపరేషన్స్ విభాగం వైస్ ప్రెసిడెంట్ ఎస్.సుందరరామ్మూర్తి నేషనల్ హైవేస్‌కు లేఖ రాశారు. దీనిప్రకారం ప్రతిపాదిత విజయవాడ బైపాస్ రోడ్డు పనుల దృష్ట్యా ల్యాంకో హైటెన్షన్ ట్రాన్స్‌మిషన్ టవర్లను మార్చటానికి రూ.32.58 కోట్లు అంచనా అవుతుందని, సూపర్ వైజేషన్ చార్జీల కింద ఎన్‌హెచ్‌కు రూ.44.58 లక్షలు చెల్లిస్తామని చెప్పింది. ఈ లేఖ ఇచ్చిన కొద్దికాలానికే ల్యాంకో మూతపడింది. ల్యాంకో పవర్ ప్లాంట్‌లో మొత్తం మూడు యూనిట్లు ఉన్నాయి. ఈ మూడు యూనిట్లకు సంబంధించిన యంత్రాలను ఆ సంస్థ అమ్మకానికి పెట్టింది. రెండు యూనిట్లను మలేషియాకు చెందిన సంస్థ కొనుగోలు చేసి తీసుకెళ్లింది. మరో యూనిట్‌ను రాధా టీఎంటీ సంస్థ కొనింది. ఈ సంస్థ యంత్రాలను ఇంకా తీసుకెళ్లలేదు. మూతపడిన పవర్ ప్లాంట్‌కు సంబంధించి కొత్తగా విద్యుత్ లైన్ల అలైన్‌మెంట్‌ను మార్చాల్సిన అవసరం ఏమొచ్చిందన్న దానిపై ఎన్‌హెచ్ ఆర్వో ఆఫీసు అధికారులే స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

ల్యాంకో పవర్ ప్రాజెక్టు మూతపడిన దశలో.. ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడికి సంబంధించి యాజమాన్యం కానీ, మెషినరీని కొనుగోలు చేసిన సంస్థలు కానీ బాధ్యత తీసుకోలేదు. అలాంటప్పుడు ప్రస్తుతం ఏ ప్రాతిపదికన పనులు చేయిస్తారన్నది ప్రశ్నగా మారింది. టవర్ల మార్పిడి ఖర్చు ఎవరు భరిస్తారో కూడా తేలాలి. ల్యాంకో మూతపడింది కాబట్టి.. ఆ భారాన్ని ఎన్‌హెచ్ తనపై వేసుకుంటుందా..? ల్యాంకో మూతపడిన విషయాన్ని ఢిల్లీ అధికారులకు తెలియకుండా దాచారా? అన్న సందేహాలూ ఉన్నాయి.

ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించండి

» శాసన మండలిని గౌరవ సభగా మార్చుదాం

» కూటమి సమావేశంలో నెట్టెం, అశోక్‌బాబు, రామకృష్ణలు

జగ్గయ్యపేట : పెద్దలు, గౌరవనీయులు ఉండాల్సిన శాసనమండలిని వైసీపీ ప్రభుత్వం నేరచరితులతో నింపి స్ఫూర్తి, హుందాతనాన్ని కాలరాసిందని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణలు ధ్వజమెత్తారు. శాసనసభ తరహాలో శాసనమండలి ప్రక్షాళన జరగాలని, కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సభలో వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన ఆర్నెల్లలో సూపర్ సిక్స్ పథకాల్లో మూడింటిని అమలు చేస్తు, మరో మూడింటిని వచ్చే మూడు నెలల్లో అమలుచేయబోతుందని చెప్పారు. నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు శ్రీరాం చినబాబు, ఎన్నికల పరిశీలకుడు చిట్టిబాబు, చైర్మన్ రాఘవేంద్ర, జిల్లా తెలుగురైతు కార్యదర్శి గడ్డం హుస్సేన్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నెట్టెం రఘురాం, చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి, ఎమ్మెల్సీ అశోక్

షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణకు

ఏకసభ్య కమిషన్

కృష్ణలంక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించేందుకు ఏకసభ్య కమిషన్ నియమించినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ సభ్యులుగా విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాను ప్రభుత్వం నియమించింది. సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును అనుసరించి ఈ కమిషన్‌ను రాజీవ్ రంజన్ మిశ్రా అధ్వర్యంలో నియమించడం జరిగిందని తెలిపారు. ఏకసభ్య కమిషన్ రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాలకు సంబంధించి ప్రభుత్వానికి నివేదికను సమర్పించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

కమిటీ పరిశీలించే అంశాలు ఇవే :

1. విద్యాసంస్థల్లో షెడ్యూల్డ్ కులాల ఉపవర్గాల ప్రాతినిధ్యం పరిశీలించుట
2. షెడ్యూల్డ్ కులాలలోని ఉపవర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా వున్న లోటుపాట్లను పరిశీలన చేస్తుంది.

కమిషన్‌కు నివేదించే వ్యక్తులు లేదా సంస్థలు తమ మెమొరాండం, వినతి పత్రాలను, పై రెండు అంశాలకు సంబంధించిన వాస్తవాలను తగు ధృవీకరణ పత్రాలతో సమర్పించాల్సి ఉంది. ఏకసభ్య కమిషన్ చిరునామా.. డైరక్టర్, ట్రైబల్ వెల్ఫేర్, మొదటి అంతస్తు, కోనేరు లక్ష్మయ్య స్ట్రీట్, మొగల్రాజపురం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010.

ఆర్ఎస్ఎస్ చీఫ్‌కు గన్నవరంలో ఘనస్వాగతం

గన్నవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో బుధవారం సాయంత్రం 5.30 గంటలకు భగవత్ ఇక్కడకు విచ్చేశారు. విమానాశ్రయంలో పలువురు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన విజయవాడ వెళ్లారు. మోహన్ భగవత్ రాక సందర్భంగా ఎయిర్‌పోర్టులో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యాలు!

అసాంఘిక శక్తులకు ఆవాసాలుగా..

» టిడ్కో గృహాల కోసం లబ్ధిదారుల ఎదురుచూపు

(ఆంధ్రజ్యోతి, తిరువూరు) సుదీర్ఘకాలంగా సొంత గూటికోసం ఎదురుచూస్తున్న టిడ్కో లబ్ధిదారులు తమ గోడును అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ శివారు పిటి.కొత్తూరులో 2017లో టీడీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో అట్టహాసంగా టిడ్కో ఇళ్ల నిర్మాణం చెపట్టింది. గృహాల కేటాయింపునకు లబ్ధిదారుల్ని ఎంపిక చేశారు. మొత్తం 1536 టిడ్కో గృహాలకు సంబంధించి 240 డబుల్‌బెడ్‌రూమ్ లబ్ధిదారుల నుంచి రూ లక్ష చొప్పున, 144 సింగిల్‌బెడ్‌రూమ్ లబ్ధిదారుల నుంచి రూ.50 వేల చొప్పున, 1152 సింగిల్‌బెడ్‌రూమ్‌ల లబ్ధిదారుల నుంచి రూ.500ల వంతున డిపాజిట్ చేయించుకున్నారు. తొలి రెండు విభాగాల్లోని లబ్ధిదారులు, డిపాజిట్ సొమ్ము వాయిదా పద్ధతిలో చెల్లించుకునే వెసులుబాటు కల్పించారు.. ఏపీ టిడ్కో సంస్థ ఇళ్ల నిర్మాణాలు 80 శాతం పైగా పూర్తిచేసింది. తదుపరి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, టిడ్కో పథకాన్ని ఆటకెక్కించారనే విమర్శలు వెల్లువెత్తాయి. అసంపూర్తిగా ఉన్న ఇళ్లు అసాంఘిక శక్తులకు నిలయాలుగా మారాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సొంతింటి కల నెరవెరుతుందనే ఆశ టిడ్కో లబ్ధిదారుల్లో వ్యక్తమవుతోంది. సంబంధిత అధికారులు టిడ్కో గృహాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తిస్థాయి పనులు

– జి.లోవరాజు, మున్సిపల్ కమిషనర్

టిడ్కో గృహాల నిర్మాణం దాదాపు 80 శాతం పూర్తయింది. గృహాలకు సంబందించి పూర్తిస్థాయిలో నిర్మాణం, మౌలిక వసతుల కల్పన పూర్తి చేయాల్సి ఉంది. ఇళ్లు పూర్తి అయిన వెంటనే తదుపరి చర్యలు చెపడతాం.



పిటి కొత్తూరులో పిచ్చి చెట్ల మధ్య టిడ్కో గృహాలు

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	96,104, 115
చికెన్ విత్ స్కిన్	184
చికెన్ స్కిన్‌లెస్	194

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 630

18న మారిస్ స్టెల్లాలో హార్టీ ఎక్స్‌పో

పటమట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18,19 తేదీల్లో మారిస్ స్టెల్లా కళాశాలలో హార్టీ ఎక్స్‌పోను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జసింతా క్వాడ్రెస్ తెలిపారు. అగ్రికల్చర్ డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ వి లక్ష్మణస్వామి, అధ్యాపక బృందంతో కలిసి ప్రిన్సిపాల్ జసింతా క్వాడ్రస్ హార్టీఎక్స్‌పో-2024 బ్రోచర్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ ఎక్స్‌పోలో ఉలవపాడు రైతు స్ఫూర్తి రైతు సంఘం అధ్యక్షుడు వై బాలచంద్రచే మామిడి పంటపై అవగాహన సదస్సు, పండ్ల, పూల, నర్సరీల ప్రదర్శనలతో పాటు వివిధ ధాన్యాలతో, పండ్లు, కూరగాయలతో తయారు చేసిన ఆహార పదార్థాల ప్రదర్శన, అమ్మకం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ర్యాంప్ నిర్మాణం లేక పాట్లు

శ్రీరామ్‌నగర్ రోడ్డులోకి వెళ్లేందుకు మార్గం లేక వాహనదారుల అవస్థలు

లబ్బీపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒక రోడ్డు నిర్మాణం మరో రోడ్డు ప్రయాణానికి ఆటంకంగా మారడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. శ్రీరామ్‌నగర్ రోడ్డులోకి వెళ్లేందుకు సరైన మార్గం లేక స్థానికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. బెంజిసర్కిల్ నుంచి అమరావతి గ్రాండ్ వరకు ఐదు నెలల క్రితం సర్వీస్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. అదే విధంగా సైడ్ కాలవలు నిర్మాణం చేశారు. ఈ సందర్భంలో జ్యోతి కన్వెన్షన్ వెనుక రోడ్డు, అమరావతి గ్రాండ్ హోటల్ నుంచి శ్రీరామ్‌నగర్ రోడ్డులోకి వెళ్లేందుకు సరైన మార్గం లేక స్థానికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఫీడర్ రోడ్డు నుంచి ఈ రోడ్డులోకి వెళ్లేందుకు రోడ్డు ఎత్తుగా ఉండడంతో వాహనదారులు అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఇక్కడ ర్యాంపు నిర్మాణం చేపట్టకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు ఎందుకు నిర్మాణం చేపట్టడం లేదో అర్థం కావడం లేదని వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ర్యాంపు నిర్మాణం చేపట్టని రోడ్డు

చాలా రోజుల నుంచి ఇబ్బంది పడుతున్నాం



రోడ్డు నిర్మాణం చేసి చాలా రోజులైంది. అయితే రెండు రోడ్లని కలుపుతూ ర్యాంపు నిర్మాణం చేయకపోవడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ర్యాంప్ నిర్మించాలి.
- వెంకటరెడ్డి, స్థానికుడు

పరిశీలించి నిర్మాణం చేస్తాం

ర్యాంప్ నిర్మాణం గురించి తమ దృష్టికి రాలేదు. వెంటనే ఆ ప్రాంతాన్ని పరిశీలించి తమ పరిధిలో అయితే వెంటనే నిర్మాణం చేస్తాం. స్థానికుల ఇబ్బందులు తొలగిస్తాం.
కిరణ్ (కాంట్రాక్టు కంపెనీ సీనియర్ మేనేజర్)

వక్ఫ్ బోర్డు భూములపై సీబీఐ విచారణ జరపాలి

● నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జలీల్

ధర్నాచౌక్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు భూములపై సీబీఐతో విచారణ చేసి అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వక్ఫ్ బోర్డు ఎన్నికలు నిర్వహించాలన్నారు.

ఎన్నికలు నిర్వహించకుండా వక్ఫ్ బోర్డు రాష్ట్ర అధ్యక్షుడిని ప్రకటించడం సరైంది కాదన్నారు. ముస్లింలకు సీఎం చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాకీర్ హుస్సేన్, సయ్యద్ సైదా, గుర్రం రామారావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ

పెళ్లి ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు అందించిన గద్దె క్రాంతి

కృష్ణలంక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సభ్యత్వం వున్న ప్రతి కార్యకర్తకు అండగా టీడీపీ వుంటుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కుమారుడు గద్దె క్రాంతికుమార్ తెలిపారు. బుధవారం కృష్ణలంక 22వ డివిజన్‌లోని సతీష్‌కుమార్ రోడ్డులో గద్దె క్రాంతి కుమార్ పర్యటించి అక్కడి వారితో మాట్లాడారు. స్థానికంగా వున్న సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకొన్నారు. స్థానికంగా పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేసి మృతి చెందిన టీడీపీ కార్యకర్త సింహాద్రి రాజు ఇంటికి వెళ్లి ఆయన కుమార్తె గాయత్రి వివాహ ఖర్చుల నిమిత్తం రూ.15 వేలను గద్దె క్రాంతికుమార్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలు వుండటం టీడీపీ అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పలిశెట్టి అన్నారావు, రవి, టెంటు రాజేష్, సంతోష్, వెంకట్రావ్, జనసేన డివిజన్ అధ్యక్షుడు తోట శ్రీను పాల్గొన్నారు.



పెళ్లి ఖర్చుల నిమిత్తం యువతికి నగదును అందిస్తున్న గద్దె క్రాంతికుమార్

కృత్రిమ మేధస్సుతోనే భవిష్యత్‌లో ఉద్యోగావకాశాలు

మొగల్రాజపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య సంబంధిత రంగాల్లో కృత్రిమ మేధస్సు ప్రముఖ పాత్ర పోషించబోతోందని అమెరికాకు చెందిన బయో ఫార్మాస్యూటికల్ కంపెనీ వ్యవస్థాపకుడు బొబ్బా వెంకటాద్రి చెప్పారు. మొగల్రాజపురం కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో బుధవారం ఆరోగ్య సంబంధ రంగంలో కృత్రిమ మేధస్సుతో వస్తున్న కీలక మార్పులపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు కృత్రిమ మేధస్సు గురించి తెలుసుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఆయన చెప్పారు. ప్రిన్సిపాల్ ఎ.సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ (లయోలా ఇంపెక్స్) సీఈవో, డాక్టర్ కృష్ణంరాజు, సైంటిస్ట్, విద్యార్థులు పాల్గొన్నారు.

నడిచేదెట్లా..?



- ప్రభుత్వాసుపత్రి, ఆంధ్రజ్యోతి

రెండో డివిజన్ బెత్లహేమ్‌నగర్ చిన్న చర్చి వెనుక భాగంలో ఉండే మెట్ల మార్గం అధ్వానంగా ఉంది. పలు చోట్ల మెట్లు విరిగి నడిచే వీలు లేకుండా ఉంది. గత కొన్నేళ్లుగా ప్రజలు ఈ మెట్లపై నడవలేక అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడు లేడని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కె. మురళీ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పాలకులు, అధికారులు మెట్ల మార్గాన్ని సరి చేయించాలని స్థానికుల కోరుతున్నారు.

27 దళిత సంక్షేమ పథకాలను అమలు చేయాలి

● మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

ధర్నాచౌక్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన దళితులకు సంబంధించిన సుమారు 27 సంక్షేమ పథకాలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం దాసరి భవన్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మత ఉద్రిక్తలను రెచ్చగొడుతూ సనాతనధర్మం అంటూ ఉపన్యాసాలు ఇస్తూ ఓట్ల రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి దేశ సమగ్రతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా దళిత్ రైట్స్ మూమెంట్ ద్వితీయ మహాసభలు హైదరాబాద్‌లో జరగనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో డీహెచ్‌పీఎస్ బలోపేతానికి తగిన చర్యలు తీసుకోవాలని నాయకత్వానికి సూచించారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు జీవీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే అగ్రశేణి సంస్థగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్



అవార్డు అందుకుంటున్న పరిమి పవన్ చంద్

ప్రసాదంపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషన్ టుడే నిర్వహించిన సర్వేలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు సీబీఎస్ఈలో దేశంలోనే 8వ స్థానం, ఏపీలో 1వ స్థానం, విజయవాడలో 1 ర్యాంక్‌ను సాధించిదని పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్ అన్నారు. బుధవారం బెంగళూరులో డైరెక్టర్ పరిమి చంద్‌కు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనకు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పద్ధతుల్లో విద్యార్థులకు అనుకూలంగా, ఆసక్తి కలిగించే విధంగా విద్యను బోధిస్తూ అనేక రకాల విద్యా సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థుల్లో చైతన్యం కలిగిస్తున్నామన్నారు. భవిష్యత్తుకు వారే కొత్త బాటలు వేసుకునేలా అలాగే ఇతర దేశాల్లో ఉన్న విశ్వవిద్యాలయాల్లో పై చదువులు కొరకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందిస్తూ కృషి చేస్తున్నందుకు ఈ అవార్డును బహుకరించారని వెల్లడించారు. పాఠశాల డైరెక్టర్ కడియాల ప్రవీణ్ కుమార్, అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజు, ప్రిన్సిపాల్ ఎం.ఎస్ భవనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా అవార్డును సాధించినందుకు అభినందనలు తెలియజేశారు.

భగవద్గీత ప్రాముఖ్యతపై సదస్సు

లబ్బీపేట, డిసంబరు 11 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతి సందర్భంగా సిద్ధార్థ మహిళా కళాశాలలో బుధవారం కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో భగవద్గీత ప్రాముఖ్యతపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త విష్ణుభట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భగవద్గీత 18 అధ్యాయాలుండే గ్రంథరాజమని, సర్వ ఉపనిషత్తులసారమని, ప్రతి ఒక్కరూ తప్పకుండా భగవద్గీత అధ్యయనం చేయాలని, ఎన్నో సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపిస్తుందని తెలిపారు. గీతా జయంతి సందర్భంగా విద్యార్థినులకు ఆశీస్సులను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ ఎస్.కల్పన, స్పెషల్ ఆఫీసర్ ఆర్. మాధవి, సరళ, మంజుల పాల్గొన్నారు.



విద్యార్థినికి భగవద్గీతను అందజేస్తున్న విష్ణుభట్ల



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

వీపీ సిద్ధార్థ పబ్లిక్‌స్కూల్‌లో

మొగల్రాజపురం: స్థానిక వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో గీతా జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో చిన్నారులు భగవద్గీతలోని శ్లోకాలను అద్భుతంగా ఆలపించారు. ఇటీవల చిన్మయి మిషన్ నిర్వహించిన భగవద్గీత పఠనం పోటీల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులకు ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రోజ్ మేరీ, హెచ్ఎం సీహెచ్ జయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయాణికులను ఏమార్చి చోరీ

● నలుగురి అరెస్టు
● రూ.1.5 లక్షలు స్వాధీనం

వన్‌టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను ఏమార్చి దొంగతనాలు చేస్తున్న నలుగురిని కృష్ణలంక పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1.5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నంలోని గోపాలపట్నానికి చెందిన బుర్రి సురేష్ అలియాస్ ఒలుసు (47), అరిటాకుల తారకేశ్వరరావు (44), కైలాసపురానికి చెందిన తంబాల శ్రీను (42), కొబ్బరితోటకు చెందిన బుడుమూరి రాజు అలియాస్ ఆకాష్ (35) వీరందరూ పాత స్నేహితులు. పలు దొంగతనాల కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చిన వారు. రద్దీ ప్రదేశాల్లో తిరుగుతూ అమాయక ప్రజలను మభ్యపెట్టి దొంగతనాలు చేస్తుంటారు. దొంగతనాలు చేయటంలో వీరిది విభిన్న శైలి. ఈ నలుగురు రద్దీ ప్రదేశాలను ఎంచుకుని ఎవరి వద్ద డబ్బులు ఎక్కువ ఉన్నాయో అని రెక్కీ చేస్తారు. ముందుగా ఒకడు డబ్బున్న వ్యక్తి దగ్గరకు వెళ్లి జేబులోని నగదును దొంగిలించే సమయంలో మిగతా ముగ్గురు అక్కడ తోపులాట జరుగుతున్నట్లుగా, ఏదో గొడవ జరుగుతున్నట్లుగా క్రియేట్ చేస్తారు. బస్టేషన్లు, మనుషులు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఈ నలుగురు గ్రూపుగా ఏర్పడి దొంగతనాలకు ప్లాన్ చేస్తారు. ముందుగా దొంగతనం చేయాలనుకున్న గుర్తించిన వ్యక్తి దగ్గరకు అడ్డుగా వెళ్లమని చెబుతారు. అలా అడ్డుగా వెళ్లి చాకచక్యంగా అమాయక ప్రజల నుంచి దొంగతనాలు చేస్తుంటారు. ఈనెల 6న చల్లపల్లికి చెందిన వ్యక్తి తన బావమరిదిని ఆసుపత్రికి తీసుకువచ్చి తిరిగి ఇంటికి వెళ్లటానికి ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కు తున్న సమయంలో అతడి జేబులో నుంచి డబ్బులు కాజేసి పరారయ్యారు. తరువాత బాధితుడు కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు విచారణ జరిపిన కృష్ణలంక స్టేషన్ సీఐ ఎస్ఎస్వి నాగరాజు, ఆయన సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. అనుమానితుల కదలికల పై నిఘా పెట్టిన పోలీసులకు ఆ నలుగురు పద్మావతి ఘాట్ దగ్గర అనుమానంగా సంచరిస్తున్న సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. దీంతో వాళ్ల మీద ఉన్న కేసులు వెల్లడయ్యాయి. పోలీసు కమిషనర్ ఎస్వి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు క్రైం డీసీపీ కె.తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావు పర్యవేక్షణలో క్రైం ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ సలాం, స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్వీ నాగరాజులు కేసు దర్యాప్తు చేశారు.



నలుగురు నిందితులతో పోలీసులు



రేషన్‌షాపులకు భారీగా దరఖాస్తులు

● వైసీపీ హయాంలో డ్వాక్రా పేరుతో ఖాళీ షాపుల స్వాధీనం
● టీడీపీ రాగానే నోటిఫికేషన్ విడుదలతో మోక్షం

మొగల్రాజపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీ రేషన్ దుకాణాల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్‌కు భారీ స్పందన వస్తోంది. వైసీపీ అధికారంలోకి రాగానే డీలర్లను తొలగించి వలంటీర్ల ద్వారా డోర్ డెలివరీ అని చెప్పి శ్రీకాకుళంలో మొదలు పెట్టి డీలర్లను భయపెట్టారు. ఏడాది తరువాత ఎండీయూ అనే వ్యవస్థను తెచ్చి డీలర్లు చనిపోయిన చోట, కొన్నిచోట్ల బెదిరించి, మరికొన్ని చోట్ల కేసులు నమోదు చేసి ఆయా షాపులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని డ్వాక్రా సంఘాల ముసుగులో తమ వారికి ఇప్పించుకున్నారు. ఇలా వచ్చిన డీలర్లు, మరోపక్క ఎండీయూలు వినియోగదారుల నుంచి బియ్యం కొని నల్లబజారుకు తరలిస్తున్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆగస్టు 2న రివ్యూ నిర్వహించి లోపాలను గుర్తించారు. రాష్ట వ్యాప్తంగా ఇలాంటి షాపులకు నోటిఫికేషన్ ఇచ్చి డీలర్లను నియమిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడలోని నాలుగు తహసీల్దార్ల పరిధితో పాటు ఇబ్రహీంపట్నం, మైలవరం, నున్న, రామవరప్పాడు, ఎనికేపాడు, ప్రసాదంపాడు, నిడమానూరు వరకు ఉన్న పౌరసరఫరాల కార్యాలయం పరిధిలో ఖాళీ అయిన 52 రేషన్ దుకాణాలకు, పాత షాపుల్లో ఎక్కువ కార్డులున్న దుకాణాల నుంచి విడగొట్టి కొత్తగా సృష్టించిన 59 రేషన్ షాపులకు ఈ నెల 5న నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ దరఖాస్తులు 12వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు తీసుకుంటామని తెలిపారు. 80 మార్కులను రాత పరీక్ష, 20 మార్కులను మౌఖిక పరీక్ష ఉంటుంది. అర్హత సాధించిన వారిలో ఒక్కోషాపునకు ఐదుగురి జాబితా తయారు చేస్తారు. మౌఖిక పరీక్ష ద్వారా ఒకరిని ఎంపిక చేస్తారు. ఇప్పటికే ఒక్కో షాపునకు పది మంది వరకు దరఖాస్తు చేస్తున్నారు.

కోర్టును ఆశ్రయించినా ఆగడం లేదు

జిల్లావ్యాప్తంగా మూడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని డీలర్లలో తమ షాపు నుంచి కార్డులు విడగొట్టి కొత్తగా షాపు ఇస్తున్న చోట నష్టపోతున్న డీలర్లు కొత్త షాపులు పెట్టడం వల్ల వస్తున్న కమీషన్‌లో కోత పడుతుందని, ఖర్చులు తగ్గవని నోటిఫికేషన్, బైఫరికేషన్ ఆపాలని కోర్టును ఆశ్రయించారు. అయినా అధికారులు నోటిఫికేషన్ ఇవ్వడం చర్చనీయాంశమైంది.





జపం..జపం కొంగ జపం

ప్రకృతికి, పక్షులకు విడదీయరాని అనుబంధం. ఎక్కడైతే పచ్చగా ఉంటుందో.. నీరు, ఆహారం సమృద్ధిగా లభిస్తుందో పక్షులు అక్కడికి వచ్చి వాలతాయి. ఇలా పక్షుల సమూహాన్ని చూస్తుంటే చూసే కనులకు కూడా ఎంతో హాయిగా ఉంటుంది. విజయవాడ నగర శివారు కానూరు వద్ద పంటపొలాల్లో కొంగల సమూహం చూపరులకు కనువిందు చేసింది. నీటిలో చేపల కోసం జపం చేస్తున్న కొంగ ప్రతిబింబం కెమెరా కంటికి చిక్కింది.

జర్నలిస్టులపై దాడి సరికాదు

● మోహన్‌బాబును అరెస్ట్ చేయాలంటూ మంత్రి సారథికి వినతి

ఆటోనగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడిని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ సౌత్ ఇండియా తీవ్రంగా ఖండిస్తోందని, జర్నలిస్టుల సమస్యలు పరిష్కారించాలని ఐ అండ్ పీఆర్ మంత్రి కొలుసు పార్థసారథికి ఎడిటర్స్ గిల్డ్ సౌత్ ఇండియా ప్రతినిధుల బృందం వినతి పత్రం బుధవారం అందజేసింది. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యుడు, సినీ నటుడు మోహన్ బాబును వెంటనే అరెస్ట్ చేయాలనీ, గాయపడిన జర్నలిస్టుకి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది. జర్నలిస్టుల భద్రతకు, జర్నలిస్టులపై దాడి చేసిన వారిపై కఠినమైన నాన్ బెయిల్ చట్టం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకురావాలని ఎడిటర్స్ గిల్డ్ ఇండియా ప్రెసిడెంట్ దీక్ష ప్రసాద్ కోరారు. రాజ్యసభ సభ్యుడిగా పని చేసిన వ్యక్తి ప్రజాస్వామ్య విలువలను కాపాడి ఆదర్శంగా నిలవాలి కానీ చట్టాన్ని అతిక్రమించడం దురదృష్టకరమని అన్నారు.



మంత్రి పార్థసారథికి వినతి పత్రం అందజేసిన ఎడిటర్స్ గిల్డ్ ప్రతినిధులు



షోరూంను ప్రారంభిస్తున్న ప్రముఖులు

తాడిగడప పోరంకిలో రామ్‌రాజ్ షోరూం

విజయవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వస్త్ర ప్రపంచంలో ప్రసిద్ధిచెందిన 'రామ్‌రాజ్ కాటన్' షోరూం స్థానిక తాడిగడప పోరంకిలో ఏర్పాటైంది. ఈ షోరూంను బుధవారం ఆంధ్రప్రదేశ్ కమర్షియల్ ట్యాక్సెస్ డిపార్ట్‌మెంట్ చీఫ్ కమిషనర్ ఎ.బాబు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించగా, శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కేఎస్ రామారావు జ్యోతిప్రజ్వలనగావించారు. పారిశ్రామికవేత్త కాటూరి రాము మొదటి కొనుగోలును స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ భారతదేశ అత్యంత ఆకర్షణీయమైన బ్రాండ్ల జాబితాలో రామ్‌రాజ్ స్థానం పొందిందని, ధోతీలు, చొక్కాలు వంటి తెల్లదుస్తుల విక్రయాల్లో తమ సంస్థ దూసుకుపోతోందని వివరించారు. దక్షిణ భారతదేశ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యంగా ప్రారంభమైన తమ సంస్థ అన్ని ముఖ్యమైన కేంద్రాల్లో షోరూంలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ బాబు ఎ

స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణను
విజయవంతం చేయండి

రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ బాబు ఎ

కృష్ణలంక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 13న జరిగే స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారని, అధికారుల బృందాలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ బాబు ఎ సూచించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బస్సుల పార్కింగ్, వీఐపీ వాహనాల పార్కింగ్, సెక్యూరిటీ చెక్‌పోస్టులు, ఎంట్రీ-ఎగ్జిట్ పాయింట్లు తదితరాల వద్ద భద్రత, వీఐపీ, ఎగ్జిబిషన్, బారికేడింగ్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం, ఎల్‌ఈడీ స్క్రీన్ల ఏర్పాటు తదితర వాటిపై సూచనలు చేశారు. అలాగే నిరంతర విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రవాణా, వైద్యశిబిరాలు తదితర ఏర్పాట్లపై చర్చించారు. అన్నదాతలు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, ఎంఎస్ఎంఈల ప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. మైన్స్ అండ్ జియాలజీ కమిషనర్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, అదనపు కార్యదర్శి (ఫైనాన్స్) జె.నివాస్, శాప్ వీసీ అండ్ ఎండీ గిరీశ పీఎస్, జాయింట్ కలెక్టర్ నిధి మీనా, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొన్నారు.

'సీఐ సార్.. నా స్కూటర్ ఇప్పించండి!'

● నెల రోజుల క్రితం ఫిర్యాదు చేసినా స్పందించని పోలీసులు

విజయవాడ లీగల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బంధువైన ఓ మహిళ తన స్కూటర్ తీసుకెళ్లి ఇవ్వట్లేదని పోలీసులకు నెల క్రితం ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోవటం లేదని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేస్తోంది. బాధితురాలి కథనం ప్రకారం పాత పాయకాపురానికి చెందిన ఆర్ కృష్ణవేణి అనే మహిళ పట్టపు ఎన్‌క్లేవ్‌లో పనిచేస్తోంది. భర్త నాగేశ్వరరావుకు పిన్ని వరసయ్యే బుజ్జి అనే మహిళ ఏపీఎస్ రెడ్డి రోడ్‌లో ఉంటోంది. ఆమెకు స్రవంతి అనే ఒక కుమార్తె ఉంది. భర్తతో విబేదాల కారణంగా తల్లి వద్దే ఉంటోంది. బుజ్జికి పక్షవాతం వచ్చిందన్న విషయం తెలుసుకున్న కృష్ణవేణి భర్త నాగేశ్వరరావుతో కలిసి చూసేందుకు బుజ్జి ఇంటికి వచ్చారు. వారు బుజ్జితో మాట్లాడుతుండగా, బుజ్జి కుమార్తె స్రవంతి వచ్చి ఇప్పుడే బయటికి వెళ్లి వస్తాను బైక్ తాళం ఇవ్వమని నాగేశ్వరరావును అడిగింది. సరేనని నాగేశ్వరరావు తాళాలు ఇచ్చారు. ఇక అంతే అప్పటి నుంచి బండి తన వద్దే ఉంచుకుని తనకివ్వాల్సిన బంగారు నగ తనచ్చిన తరువాతే బండి ఇస్తానంటూ మెలిక పెట్టింది. దీంతో భార్యభర్తలిద్దరూ అదేరోజు పాయకాపురం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పోలీసులు ఇదిగో రేపు తెప్పిస్తాం, ఎల్లుండి తెప్పిస్తామంటూ రోజులు గడుపుతున్నారే కానీ బండి మాత్రం తెచ్చివటం లేదని ఆరోపిస్తున్నారు. పైగా కేసు నమోదు చేయకుండా తాత్సారం చేస్తున్నారని వాపోయారు. పోలీసులు తమకు న్యాయం చేయకుంటే కోర్టును ఆశ్రయిస్తామని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నున్న పోలీసు స్టేషన్ సీఐ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఇరువర్గాలు దగ్గర బంధువులేనని, ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీల్లో గొడవలున్నాయని, ఇరువర్గాలను విచారిస్తున్నామని, ద్విచక్రవాహనాన్ని కూడా తీసుకురమ్మని చెప్పామని, విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామని తెలిపారు.

సీవోపీతో న్యాయవాదులకు తంటా..!

● నాన్ ప్రాక్టీసింగ్ అడ్వకేట్లను తప్పించటం సరికాదు ● సీవోపీ రగడపై న్యాయవాదుల భిన్నాభిప్రాయాలు

విజయవాడ లీగల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోర్టులో ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదులకు సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీసింగ్ (సీవోపీ) పెద్ద తంటానే తెచ్చిపెడుతోంది. దాదాపు ఐదేళ్ల క్రితం కోర్టులో ప్రాక్టీసు చేసే న్యాయవాది ప్రతి ఒక్కరూ సీవోపీ కింద ఐదేళ్లకొకసారి ఐదు వకాలత్‌ను బార్ కౌన్సిల్‌కు సమర్పించాలనేది సెంట్రల్ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధన. దేశంలోని అన్ని బార్ కౌన్సిల్స్ అమలులోకి తేవడంతో ఆయా బార్ కౌన్సిళ్ల నుంచి బార్ అసోసియేషన్లకు సర్క్యులర్ విడుదల చేశాయి. నకిలీ న్యాయవాదుల నిరోధానికి తెచ్చిన ఈ నిబంధన జూనియర్ న్యాయవాదులకు శాపంగా పరిణమించింది. ఏడాది పొడవునా సీనియర్ వెనకే ఉంటూ కోర్టుల్లో వారిని రిప్రజెంట్ చేస్తున్న జూనియర్లకు సొంతంగా కోర్టుల్లో వకాలత్ దాఖలు చేసే అవకాశం ఉండదు. వీరంతా సీవోపీ కింద వకాలత్‌లు సంపాదించి బార్ కౌన్సిళ్లకు పంపాలంటే తలప్రాణం తోకకొస్తోంది. నకిలీ న్యాయవాదుల నిరోధానికి, ప్రాక్టీసు లేని న్యాయవాదులకు అడ్డుకట్టవేయడమే సీవోపీ లక్ష్యం. దీనివల్ల ప్రాక్టీసు న్యాయవాదులు మరణిస్తే వారికి బార్ కౌన్సిల్ నుంచి రూ.5 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ కింద ప్రభుత్వం నుంచి మరో రూ.4 లక్షలు మొత్తం రూ.9 లక్షలు వస్తుంది. ప్రాక్టీసు లేని, నకిలీ న్యాయవాదులను తొలగిస్తే మరింత మంది వెల్ఫేర్ ఫండ్ ప్రయోజనాలు పెరిగే అవకాశముందని న్యాయవాదులు చెబుతున్నారు. అయితే 30 నుంచి 60 ఏళ్ల వరకు ప్రాక్టీసు చేసిన సీనియర్లు అనారోగ్యంతో చాంబర్ ప్రాక్టీసుకే పరిమితమవుతూ కోర్టుల్లో వకల్తాలు వేయకుండా జూనియర్లకు సలహాలు, సంప్రదింపుల చేస్తున్నవారు నాన్ ప్రాక్టీసింగ్ న్యాయవాది ఎలా అవుతారని పలువురు సీనియర్లు ప్రశ్నిస్తున్నారు. అలాగే ప్రతిరోజు కోర్టుకొస్తూ తనకంటూ వకల్తానామా తెచ్చుకోలేక సీనియర్లకు సాయంగా ఉంటూ అడ్వకేట్ కమిషనర్‌గా నియామకాలపై ఆధారపడి ప్రాక్టీసు చేస్తున్న జూనియర్లు నాన్ ప్రాక్టీసింగ్ అడ్వకేట్లు అంటే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పెళ్లి, సంసారం, పిల్లల బాధ్యతలతో ఇంటికి పరిమితమై అప్పుడప్పుడు కోర్టుకు వస్తూ భవిష్యత్తులో ప్రాక్టీసు చేయాలనుకొనే ఆశతో ఉన్న మహిళా న్యాయవాదులు నాన్ ప్రాక్టీసింగ్ కిందకే వస్తారంటే ఎలా అని మహిళా న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాన్ ప్రాక్టీసింగ్ చేసే అడ్వకేట్లకు, నకిలీ సర్టిఫికెట్లతో అడ్వకేటు'గా చెలామణి అవుతున్న వారికి తేడా స్పష్టంగా గుర్తించాలని మరికొందరు చెబుతున్నారు. ఇప్పటికైనా సెంట్రల్ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, స్టేట్ బార్ కౌన్సిల్ పునరాలోచించి రెగ్యులర్‌గా కోర్టుకు వచ్చి ప్రాక్టీసు చేసే, వయోభారంతో, కుటుంబ బాధ్యతలతో కోర్టుకు రాలేని అసలైన న్యాయవాదులకు సీవోపీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు.

సీఓపీ రూల్స్‌లో మార్పులు అవసరం

సుంకర రాజేంద్రప్రసాద్, రాష్ట బార్ కౌన్సిల్ మెంబర్



సీవోపీ రూల్స్‌పై బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక తీర్మానం పంపించాం. అదేంటంటే జూనియర్ న్యాయవాదులను, వృత్తిలో 40 ఏళ్లు పైబడిన న్యాయవాదులకు ఈ సూత్రం వర్తించకూడదని, జూనియర్ న్యాయవాదులు తమ ఆఫీసులో పనిచేస్తున్నట్లు సీనియర్ న్యాయవాది సర్టిఫికెట్ ఇస్తే దాన్ని పరిగణించాలని తీర్మానం చేసి ఆలిండియా బార్ కౌన్సిల్‌కు పంపామని సుంకర తెలిపారు. అయితే బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా దీన్ని తిరస్కరించిందన్నారు. కొత్తగా వృత్తిలోకి వచ్చిన వారు, అనారోగ్యంతో వృత్తి నుంచి వైదొలగిన వారికి ఈ సూత్రం అమలు చేయడం న్యాయవాద సంక్షేమ చట్టానికే వ్యతిరేకం.

ప్రతి న్యాయవాదికి సీవోపీ అవసరం

వి.గురునాథం, బార్ మాజీ అధ్యక్షుడు



గతంలో సీవోపీ ప్రస్తావన లేదని, సీవోపీ అవసరం బార్ కౌన్సిల్ ఇండియా ఇటీవల కాలంలో గుర్తించిందని గురునాథం తెలిపారు. కొంతమంది న్యాయవాద విద్యను అభ్యసించకుండానే, అభ్యసించినా ఉత్తీర్ణులు కాకుండా నకిలీ సర్టిఫికెట్లతో న్యాయవాద వృత్తిలోకి రావడంతో అసలైన న్యాయవాదులకు దక్కాల్సిన వెల్ఫేర్ ఫండ్ పక్కదారి పడుతోందన్నారు. దీనివల్ల న్యాయవాదులు కొంత ఇబ్బందికి గురవుతున్నా ప్రతి న్యాయవాది తప్పనిసరిగా సీవోపీ దాఖలు చేయాల్సిందేనన్నారు.

మహిళా న్యాయవాదులకు ఇబ్బందే

పీ ఏడుకొండలు, సీనియర్ న్యాయవాది



30 నుంచి 60ఏళ్ల వరకు ప్రాక్టీసు చేసిన సీనియర్లు అనారోగ్య కారణాలతో చాంబర్ ప్రాక్టీసుకే పరిమితమవుతూ కోర్టుల్లో వకల్తానామాలు వేయకుండా జూనియర్లతో సలహాలు, సంప్రదింపుల చేస్తున్న సీనియర్లు నాన్ ప్రాక్టీసింగ్ న్యాయవాది ఎలా అవుతారని అన్నారు. కుటుంబ బాధ్యతలతో ఇంటికి పరిమితమై అప్పుడప్పుడు కోర్టుకు వస్తూ భవిష్యత్తులో ప్రాక్టీసు చేయాలనుకొనే మహిళా న్యాయవాదులు నాన్ ప్రాక్టీసింగ్ కిందకే వస్తారనడం సరికాదన్నారు.

సీవోపీ ప్రక్రియ పెనుభారం

అరిగెల శివరాంప్రసాద్ (రాజా), బెజవాడ బార్ ప్రధాన కార్యదర్శి,



నిత్యం కోర్టులో బిజీగా కేసులు చేస్తూ తిరిగే న్యాయవాదులను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మీరు న్యాయవాదులుగా గుర్తింపు పొందండని కొత్త ఒరవడికి తెరతీసింది. అందులో భాగంగా 2020 నుంచి 2024 లోపల 5 వకాల్తాలు సబ్‌మిట్ చేయమని అడిగింది. ఇది చాలా దారుణం. అందుకనే న్యాయవాదులంతా ముక్తకంఠంతో ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తూ ఆందోళన బాట పట్టారన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పునరాలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జాతీయ రోలర్ స్కేటింగ్‌లో హృతిక్‌కు కాంస్యం



విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం పొల్లాచీలో జరుగుతున్న 62వ జాతీయ రోలర్ స్కేటింగ్‌లో నగరానికి చెందిన యువకుడు వడ్లాని హృతిక్ కాంస్యంతో సత్తా చాటాడు. సోలో డ్యాన్స్ విభాగంలో ఈ పతకం సాధించాడు. నగరంలోని ఓ అకాడమీలో ఇంటర్ ఫస్టియర్ ఎం పీసీ చదువుతున్న హృతిక్ ఇప్పటికే పలు పతకాలతో తన సత్తాను నిరూపించుకున్నాడని కోచ్ పి సత్యనారాయణ తెలిపారు.

భారీ స్కోర్ల దిశగా విదర్భ, జార్ఖండ్

● విజయ్ మర్చంట్ క్రికెట్‌లో బ్యాటర్స్ సత్తా



సత్తా చాటిన విదర్భ బ్యాటర్ రాందిత్య సింగ్

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 11: బీసీసీఐ దేశవాళీ క్రికెట్ టోర్నీ అయిన విజయ్ మర్చంట్స్ ట్రోఫీ క్రికెట్‌లో విదర్భ, జార్ఖండ్ బ్యాటర్లు సత్తాతో ఆయా టీమ్‌లు ప్రత్యర్థి జట్లపై భారీ స్కోర్ల దిశగా సాగుతున్నాయి. మూలపాడు వేదికగా ఏసీఏ క్రికెట్ స్టేడియం సీపీ గ్రౌండ్స్‌లో జమ్మూకాశ్మీర్-విదర్భ జట్ల మధ్య మ్యాచ్ బుధవారం ప్రారంభమైంది. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 375/5 పరుగులతో నిలిచింది. రాందిత్యసింగ్ 178 బంతుల్లో 18 ఫోర్లు, 8 సిక్సర్లతో 184 పరుగులను చేశాడు. కుష్ శర్మ 72 పరుగులతో రాణించాడు. ఇక్కడే దేవినేని వెంకట రమణ ప్రణీత గ్రౌండ్స్‌లో జార్ఖండ్-కర్ణాటకల మ్యాచ్ ప్రారంభమైంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన జార్ఖండ్ తొలిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 265/5 పరుగులతో నిలిచింది. తాహిద్ 98, తన్మయ్ 60 పరుగులతో రాణించారు. కర్ణాటక బౌలర్ సుకుర్త్‌కు 3 వికెట్లు లభించాయి.



దుర్గగుడి కళావేదికపై నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

వన్‌టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలుకు చెందిన లిటిల్ చాంప్స్ ఎడ్యుకేషన్ సొసైటీ కళానిలయం ఆధ్వర్యంలో బుధవారం దుర్గగుడి కళావేదికపై చక్కని హావ, భావయుతంగా కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. గురువు శ్రీలక్ష్మి ఆధ్వర్యంలోని 17 మంది కళాకారులు నవదుర్గలు, నరసింహస్వామి, దుర్గాభవానీ, బ్రహ్మాంజలి, తదితర పది అంశాలపై నాట్య ప్రదర్శన నిర్వహించారు. అన్యోన్యశ్రీ, పుష్పవతి, దివ్యకార్తీక్, ఈక్షిత, జాహ్నవి, హర్షిణి, హర్షితశ్రీ, వినుష, జ్యోషిత, ప్రేనేక్ష, భవ్యశ్రీ, అశ్విక, మరో జాహ్నవి, దక్షిణి, దుర్గాభవానీ, రేష్మ, దీక్షిత చక్కని కళను మేళవించి రాగం, తానం, పల్లవికి అనుగుణంగా ప్రదర్శన చేసి ఆహూతులను అలరించారు. డిప్యూటీ ఈవో రత్నరాజు బృందాన్ని అభినందించి సర్టిఫికెట్లు, ప్రసాదాలను అందజేశారు.

మంత్రి కొల్లు రవీంద్ర ఇంట విషాదం



మచిలీపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొల్లు రవీంద్ర ఇంట విషాదం చోటుచేసుకుంది. రవీంద్ర సోదరుడు కొల్లు వెంకట రమణ(64)గుండెపోటుతో బుధవారం రాత్రి ఇంటి వద్ద మరణించారు. మచిలీపట్నం భాస్కరపురంలో ఆయన నివాసం ఉంటారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులున్నారు. మృతదేహాన్ని మంత్రి కొల్లురవీంద్ర ఇంటికి తీసుకువచ్చారు. సోదరుడి మరణవార్త తెలుసుకున్న మంత్రి రవీంద్ర హుటాహుటిన విజయవాడ నుంచి మచిలీపట్నం వచ్చారు.

కేరళ ప్రభుత్వం పట్ల
కేంద్రం కక్షపూరిత వైఖరి

● అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్



ప్రసంగిస్తున్న అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్

గవర్నర్‌పేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేరళ పట్ల కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలో ఎన్‌డీయే కూటమి అనుసరిస్తున్న కక్షపూరిత విధానాలను వ్యతిరేకించడంతో పాటు కేరళ వామపక్ష ప్రభుత్వ ప్రత్యామ్నాయ విధానాలను రైతులు, కార్మికులు, ప్రజలు బలపర్చాలని అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్ పిలుపునిచ్చారు. సీఐటీయూ, రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ భవన్‌లో కేరళ సంఘీభావ సభ జరిగింది. సభకు సీటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వి జు కృష్ణన్ మాట్లాడుతూ అక్షరాస్యత, వైద్య సౌకర్యాలు, కనీస వేతనాలు అమలు, భూ పంపిణీ, ప టిష్టమైన పౌర సరఫరాల వ్యవస్థ, రైతులు పం డించే పంటలకు మద్దతు ధరలు, కార్మికులు, వ్య వసాయ కార్మికుల సంక్షేమం అమలు విషయం లో కేరళ ప్రభుత్వం దేశంలోని అన్ని ప్రభుత్వాల కన్నా ముందు వరుసలో ఉందన్నారు. దేశంలోనే ఆదర్శవంతమైన సహకార వ్యవస్థ కేరళలో అమలులో ఉందన్నారు. పేదలందరికీ భూమి చేతికి రావడంతో వ్యవసాయం అభివృద్ధి చెందిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యానికి ప్రకటించిన మద్దతు ధర కంటే అదనంగా ఇస్తున్నదని, క్వింటాలు ధాన్యానికి రూ.2,820 చెల్లించి దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. వయనాడ్‌లో సంభవించిన ప్రకృతి విపత్తు సమయంలో వేలాది మంది చనిపోయి, కోట్లాది రూపాయలు ఆస్తి నష్టం జరిగితే జాతీయ విపత్తు కింద కేంద్రం రూపాయి సాయం అందించలేదని విమర్శించారు. సహకార రంగాన్ని కేంద్రం తన గుప్పిట్లో పెట్టుకునేందుకు నేషనల్ మల్టీస్టేట్ కో-ఆపరేటివ్ విధానాన్ని ముందుకు తీసుకొస్తోందని, దీన్ని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. మంత్రి మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో కార్పొరేట్ అనుకూల విధానాలు అమలు చేస్తోందన్నారు. ఈ సభలో సిటీ రాష్ట్ర నేతలు పి.అజయ్‌కుమార్, సీహెచ్.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నేతలు వి.కృష్ణయ్య, వై.కేశవరావు, మర్రాపు సూర్యనారాయణ, పీవీ ఆంజనేయులు, జొన్న శివశంకరరావు, వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర నేతలు కల్యాణ్, కోటేశ్వరి, కౌలు రైతు సంఘ నేతలు హరిబాబు, వై. రాధాకృష్ణ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో స్టాళ్లకు వెళితే
నిలువుదోపిడీనే

● ఎమ్మార్పీ ధరలకంటే అధికంగా వసూలు చేస్తున్న వ్యాపారులు

ఆంధ్రజ్యోతి-బస్టేషన్: విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో వ్యాపారులు ప్రయాణికులను అడ్డగోలుగా దోచుకుంటున్నారు. వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్‌పై ఎమ్మార్పీ ధరల కంటే రూ.5లు అదనంగా వసూలు చేస్తున్నారు. ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ప్రయాణికులను నిలవునా దోచేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ నిబంధనల ప్రకారం ప్రతి స్టాల్ ముందు ధరల పట్టిక బోర్డును ఏర్పాటు చేయాలి. ఏ వ్యాపారి అయినా ఎమ్మార్పీ కంటే అదనంగా వసూలు చేస్తే ప్రయాణికులు ఫిర్యాదు చేసేందుకు ఆర్టీసీ అధికారుల ఫోన్ నెంబర్లు బోర్డుపై తెలపాలి. ఈ నిబంధనలను ఏ వ్యాపారీ పాటించడు. ఉన్నతాధికారుల తనిఖీల సమయంలోనే స్టాల్స్ ముందు బోర్డులను ఏర్పాటు చేసి, తరువాత తొలగిస్తున్నారు. కొందరు వ్యాపారులు బోర్డులపై ధరలు కనిపించకుండా పేపర్, బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారు. రూ.20కి అమ్మాల్సిన వాటర్ బాటిల్, కూల్‌డ్రింక్ బాటిల్స్‌తో పాటు ఇతర తినుబండారాల ప్యాకెట్లపై అదనంగా రూ.5లు వసూలు చేస్తున్నారు. ప్రయాణికులు ప్రశ్నిస్తే బస్టేషన్‌లో అంతేనంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఎమ్మార్పీ కంటే అదనంగా ధరలు వసూలు చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పోలీసులకు ఉచిత బస్ పాస్‌లివ్వండి

బస్టేషన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీసులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు వీలు కల్పిస్తూ పాస్ జారీ చేయాలని పోలీసు అధికారుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు బుధవారం రవాణ శాఖ మంత్రి రామ్ ప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. పోలీసు స్టేషన్ నుంచి బయటకు వెళ్లే సమయంలో సిబ్బంది అసౌకర్యం ఎదుర్కొంటున్నారన్నారు. ఉచిత బస్‌పాస్‌లు కల్పించాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

వెన్నెల ఏసీ స్లీపర్ బస్సులను ఆదరించండి

వెన్నెల ఏసీ స్లీపర్ బస్సులను ప్రయాణికులు ఆదరించాలని ఆర్టీసీ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో కోరింది. విజయవాడ నుంచి విశాఖపట్నానికి ప్రతిరోజూ వెన్నెల ఏసీ స్లీపర్ బస్సును నడుపుతున్నామని, రాత్రి 11 గంటలకు బయలుదేరి తరువాతి రోజు ఉదయం 6 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుందన్నారు. మళ్లీ విశాఖపట్నంలో రాత్రి 10.45కు బయలుదేరి తరువాతి రోజు ఉదయం 5.30 గంటలకు విజయవాడ చేరుతుందని, ఈ సర్వీసులను ప్రజలు ఆదరించాలని కోరారు.

21న ఏపీసీపీఎస్ఈఏ ఆవిర్భావ సదస్సు

విజయవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ ఉద్యోగుల సంఘం (ఏపీసీపీఎస్ఈఏ) ఏర్పడి 9 ఏళ్లు కాబోతున్న సందర్భంగా ఈ నెల 21న ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు తెలిపారు. సంఘ ఆవిర్భావం తర్వాత సీపీఎస్ సమస్యను మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో చైతన్యం పరిచి ఉద్యమం వైపుగా తీసుకురావటం జరిగిందన్నారు. ధర్నాలు, ర్యాలీలు, దీక్షలతో దేశవ్యాప్తంగా ఈ అంశాన్ని చర్చనీయాంశం చేయటం జరిగిందన్నారు. ఏపీసీపీఎస్ఈఏ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో అక్కడి ఉద్యోగులు పోరాటాలు చేసి పాత పెన్షన్‌ను సాధించుకోవటం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో 9 ఏళ్లు పూర్తి చేసుకోవటం జరిగిందన్నారు. కాబట్టి డిసెంబరు 21న ఏపీసీపీఎస్ఈఏ ఆవిర్భావ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు.

పేర్ని నాని భార్యపై కేసు

- మచిలీపట్నంలోని గిడ్డంగి నుంచి రేషన్ బియ్యం మాయం
- మచిలీపట్నం పోలీసులకు ఫిర్యాదు
- కేసు కట్టేందుకు గుంజాటన... ఎట్టకేలకు జయసుధపై కేసు
- పీడీ యాక్ట్ పెట్టే అవకాశమున్నా నామమాత్రపు సెక్షన్లతో సరి

విజయవాడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని కుటుంబానికి చెందిన గోదాముల నుంచి 187 టన్నుల రేషన్ బియ్యం మాయమైంది. ఈ వ్యవహారానికి సంబంధించి గోదాము యజమానిగా ఉన్న పేర్ని సతీమణి జయసుధపై పౌరసరఫరాల శాఖ అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 187 టన్నుల పీడీఎస్ బియ్యం మాయమవడానికి గోదాము యజమానిగా ఉన్న జయసుధ, మేనేజర్ మానసతేజ కారణమని పేర్కొన్నారు. అయితే, కేసు నమోదు చేసేందుకు పోలీసులు తర్జనభర్జన పడ్డారు. ఎట్టకేలకు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. కానీ.. రేషన్ బియ్యం అక్రమ తరలింపు, మాయంపై పీడీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేయాల్సి ఉండగా.. సాధారణ సెక్షన్ల కింద అత్యంత గోప్యంగా కేసు నమోదు చేశారు. అంతేకాదు.. ఏయే సెక్షన్ల కింద కేసు నమోదు చేశారన్న విషయాన్ని వెల్లడించేందుకు కూడా పోలీసులు విముఖత వ్యక్తం చేశారు.

ముందే తెలుసుకుని..

వాస్తవానికి అధికారులు తనిఖీలకు వెళ్లడానికి ఒక రోజు ముందే పేర్ని జయసుధ తమ గోదాములో బియ్యం తక్కువ ఉన్నట్లు గుర్తించామని, వే బ్రిడ్జి లోపం కారణంగా ఇది జరిగిందని పేర్కొంటూ కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌కు లేఖ రాశారు. తక్కువ ఉన్న మొత్తానికి ధర చెల్లిస్తామని లేఖలో పేర్కొన్నారు. అధికారులు తనిఖీలకు వస్తున్న విషయం పేర్ని నానికి ముందుగానే లీకు అవడంతోనే.. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు లేఖ డ్రామా ఆడారన్నది స్పష్టమవుతోంది. వే బ్రిడ్జిలో లోపం ఉంటే కేజీల్లో తేడా వస్తుంది కానీ టన్నుల్లో తేడా వస్తుందా? అని పౌరసరఫరాల శాఖ అధికారులే అవాక్కవుతున్నారు. పైగా వేబ్రిడ్జిలో తేడా ఉంటే అంతే మొత్తం రికార్డుల్లో నమోదు కావాలి. కానీ, రికార్డుల్లో మాత్రం లెక్కలు సరిగా ఉండగా క్షేత్రస్థాయిలో మాత్రం రేషన్ బియ్యం మాయమయ్యాయి. పౌరసరఫరాల శాఖ ఎండీ మన్‌జీర్ జిలానీ.. మాయమైన బియ్యానికి రెట్టింపు అంటే సుమారు రూ.1.80 కోట్లు జరిమానా విధించాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశించినా క్షేత్రస్థాయిలో మాత్రం అధికారులు ఆ మేరకు స్పందించేందుకు వెనకాడుతుండటం అనుమానాలకు తావిస్తోంది.

'లక్కీ భాస్కర్'లా సంపాదించాలని..

- హాస్టల్ నుంచి నలుగురు విద్యార్థులు జంప్
- ఫీజు డబ్బులతో విశాఖ నుంచి విజయవాడకు
- గుర్తించి వెనక్కు తీసుకొచ్చిన పోలీసులు

విశాఖపట్నం/మహారాణిపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నలుగురు విద్యార్థులు 'లక్కీ భాస్కర్' సినిమా హీరోలా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని హాస్టల్ నుంచి పారిపోయారు. విశాఖలోని మహారాణిపేటలో ఉన్న సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎస్.కిరణ్‌కుమార్, పి.కార్తీక్, బి.చరణ్‌తేజ, జి.రఘు... హాస్టల్‌లో ఉంటున్నారు. ఈ నెల 8వ తేదీన వారు లక్కీ భాస్కర్ సినిమా చూశారు. అప్పటి నుంచి వారికి ఆ హీరోలా డబ్బు సంపాదించి కారు, బంగ్లా కొనాలనే కోరిక పెరిగింది. ఇదే విషయాన్ని హాస్టల్‌లోని మిత్రులకు చెప్పారు. తాము బయటకు వెళ్లిపోతామని, డబ్బు సంపాదించాకే తిరిగి వస్తామన్నారు. సోమవారం తెల్లవారుజామున హాస్టల్ గోడ దూకి బయటకు వచ్చారు. ఫీజు కట్టేందుకు తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బుతో విజయవాడ వెళ్లారు. విద్యార్థులు అదృశ్యమైన సంగతి గుర్తించిన హాస్టల్ యాజమాన్యం మహారాణిపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు పిల్లల ఫొటోలతో సమాచారాన్ని రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు పంపించారు. విజయవాడ చేరిన విద్యార్థులు మొగల్రాజపురం ఏరియాలో బ్యాగులతో తిరుగుతుండగా అక్కడి పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తీసుకువెళ్లారు. మహారాణిపేట పోలీసులు మంగళవారం అక్కడకు వెళ్లి వారిని వెనక్కు తీసుకువచ్చారు.

మోహన్‌బాబు కుటుంబ వివాదం వ్యక్తిగతం

- ఆయన ఇంట్లో గొడవ శాంతిభద్రతల పరిధిలోకి రాదు
- సివిల్ వ్యవహారాల్లో పోలీసుల జోక్యం అనవసరం
- బౌన్సర్లందరినీ పంపిచేయాలి
- పోలీసుల షోకాజ్ నోటీసును కొట్టేయాలన్న మోహన్‌బాబు పిటిషన్‌పై టీహైకోర్టు

హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మోహన్‌బాబు కుటుంబ వివాదం వ్యక్తిగత అంశమని, ఆయన ఇంటి ప్రాంగణంలో జరిగిన ఘటనలతో శాంతిభద్రతలకు సంబంధం లేదని టీహైకోర్టు స్పష్టం చేసింది. కుటుంబ వివాదాలు సివిల్ అంశాలు అయినందున ఇందులో పోలీసుల జోక్యం అనవసరమని జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం తేల్చి చెప్పింది. జల్‌పల్లిలోని నివాసం వద్ద మంగళవారం జరిగిన ఘటనలపై మోహన్ బాబు వ్యక్తిగతంగా పోలీస్ స్టేషన్‌కు హాజరై వివరణ ఇవ్వాలని రాచకొండ కమిషనర్ జారీ చేసిన షోకాజ్ నోటీసును ఈ నెల 24వరకు వాయిదా వేసింది. పోలీసులు ఇచ్చిన షోకాజ్ నోటీసును కొట్టివేయాలని, తనకు రక్షణ కల్పించాలని మోహన్‌బాబు వేసిన పిటిషన్‌పై హైకోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. మోహన్‌బాబు, ఆయన కుమారుడు మనోజ్ బౌన్సర్లను వెంటపెట్టుకోవడం సరికాదని, వారందరినీ అక్కడ నుంచి పంపించివేయాలని హైకోర్టు ఆదేశించింది. అలాగే, జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంటి ఒక కిలో మీటరు పరిధిలోకి సొంత కుటుంబసభ్యులు తప్ప వేరెవరూ వెళ్లరాదని పేర్కొంది. మనోజ్ వెంట కొందరు సంఘవ్యతిరేకులు, సోషల్ మీడియా, మీడియా ప్రతినిధులు వస్తున్నారని, తనకు పోలీసు రక్షణ కల్పించాలని మోహన్‌బాబు పిటిషన్‌లో అభ్యర్థించారు. మంగళవారం జరిగిన తోపులాటలో తనకు గాయాలయ్యాయని, ఆస్పత్రిలో చేరానని తెలిపారు. పోలీసుల షోకాజ్ నోటీసును రద్దు చేయాలన్నారు. అయితే, ఈ నెల 8న తమ మధ్య జరిగిన గొడవ వ్యక్తిగతమని తెలిపారు. కుటుంబ వివాదంలో పోలీసులు జోక్యం చేసుకోకుండా నిరోధించాలని, పోలీసులు మనోజ్‌కు మద్దతిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో.. పోలీసులు మోహన్‌బాబు ఇంటికి ఎప్పటిలాగే రెండు గంటలకొకసారి తనిఖీలకు వెళ్లాలని, ఇంటిపై నిఘా పెట్టాలని హైకోర్టు ఆదేశించింది.

పోలీసులపై ఆరోపణలు సరికాదు

ఈ వ్యవహారంలో రాష్ట్ర హోంశాఖ తరఫు న్యాయవాది.. రాచకొండ కమిషనర్ ఎదుట బుధవారం మనోజ్ హాజరై వివరణ ఇచ్చారని, మోహన్‌బాబుకు జారీ చేసిన షోకాజ్ నోటీసును కొట్టేయాల్సిన అవసరం లేదని వాదించారు. పిటిషనర్ వచ్చి వివరణ ఇస్తే సమస్య ఏంటని, శాంతిభద్రతలను అదుపు చేయడానికి చట్టప్రకారం ఉన్న అధికారంతోనే కమిషనర్ నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల మధ్య వివాదంతో పోలీసుల మీద ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలోనే కేసు నమోదైనట్లు వివరించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. మోహన్‌బాబు అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నందున షోకాజ్ నోటీసును, తదుపరి విచారణను ఈ నెల 24వరకు వాయిదా వేసింది.

మంచు ఫైటింగ్స్‌లో శాంతి ఎపిసోడ్!

మోహన్‌బాబు కుటుంబ సమస్య పరిష్కారానికి సన్నిహితుల ప్రయత్నం!

- సీపీ ఎదుట మనోజ్, విష్ణు హాజరు
- మోహన్‌బాబు మేనేజర్ కిరణ్, విజయ్ అరెస్టు
- మీడియాకు క్షమాపణలు: మనోజ్
- మమ్మల్ని అమితంగా ప్రేమించడమే నాన్న తప్పు: విష్ణు
- మోహన్‌బాబుకు ఇంకా రెండు రోజులు చికిత్స అవసరం: వైద్యులు
- ఇన్‌స్టాలో మంచు లక్ష్మి 'శాంతి' మంత్రం


రాచకొండ కమిషనర్‌ను కలిసిన విష్ణు, మనోజ్

హైదరాబాద్/సిటీ/పహాడీషరీఫ్/రాయదుర్గం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబం.. దాడులు, ఘర్షణల నుంచి కొంత శాంతించింది. ఇంటి రచ్చను సర్దుబాటు చేసుకునే ప్రయత్నాలు మొదలుపెట్టింది. తమ కుటుంబ సన్నిహితులతో మోహన్‌బాబు, ఆయన పెద్ద కుమారుడు విష్ణు మాట్లాడినట్లు, దీంతో వారు సమస్య పరిష్కారానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే మోహన్‌బాబు కుటుంబ సభ్యుల రచ్చను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. బుధవారం ఆయన కుమారులు మనోజ్, విష్ణు ఇద్దరినీ వేర్వేరుగా పిలిచి విచారించారు. మరోవైపు మనోజ్ ఫిర్యాదు ఆధారంగా మోహన్‌బాబు మేనేజర్ వెంకటకిరణ్‌ను అరెస్టు చేశారు. కాగా, అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన మోహన్‌బాబు ఆరోగ్య పరిస్థితి స్థిమితంగా లేదని వైద్యులు తెలిపారు. మరో రెండు రోజులపాటు ఆయన వైద్యుల పర్యవేక్షణలోనే ఉండాలని చెప్పారు. మరోవైపు మోహన్‌బాబు కుమార్తె మంచు లక్ష్మి 'పీస్' అంటూ 'ఎక్స్'లో శాంతి మంత్రాన్ని పఠించగా.. అన్నదమ్ములు విష్ణు, మనోజ్ ఇద్దరూ వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. తన తండ్రి దేవుడని, ఆయన భుజంపై తుపాకీ పెట్టి ఇతరులు ఇవన్నీ చేయిస్తున్నారని మనోజ్ అన్నారు. మీడియా ప్రతినిధులపై దాడికి సంబంధించి తన తండ్రి తరఫున తాను క్షమాపణ చెబుతున్నానన్నారు. కాగా, మీడియాపై దాడి ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదని విష్ణు అన్నారు. తమ కుటుంబ వివాదాన్ని మీడియా ఇంతటితో వదిలేయాలని కోరారు.

గొడవలకు దిగితే చట్టపరమైన చర్యలు..

మంచు మనోజ్ బుధవారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఎదుట విచారణకు హాజరయ్యారు. గత నాలుగు రోజులుగా జరుగుతున్న పరిణామాలను వివరించారు. దీంతో కుటుంబ సమస్యను కుటుంబంలోనే పరిష్కరించుకోవాలని, గొడవలకు దిగితే చట్టపరంగా చర్యలుంటాయని సీపీ స్పష్టం చేశారు. సీపీ ఆదేశంతో.. ఇకపై ఎలాంటి గొడవలకు వెళ్లనంటూ మనోజ్ రూ.లక్ష పూచీకత్తు సమర్పించారు. బయటకు వచ్చిన తర్వాత మనోజ్ మీడియాతో మాట్లాడుతూ.. తనకు నాన్నంటే ప్రాణమని, ఆయన దేవుడి లాంటి వారని అన్నారు. ఇప్పుడు చూస్తున్నది తన తండ్రి వ్యక్తిత్వం కాదని అన్నారు. తన అన్న విష్ణు ప్రోద్బలంతోనే ఇదంతా జరుగుతోందన్నారు. కాగా, పిల్లల్ని అమితంగా ప్రేమించడమే తన తండ్రి చేసిన తప్పు అని మంచు విష్ణు అన్నారు. కాంటినెంటల్ ఆస్పత్రి వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇది తమ కుటుంబవిషయమని, ఈ విషయంలో భాగమైన బయటవాళ్లు వెనక్కి తగ్గాలని హెచ్చరించారు. మధ్యాహ్నం రాచకొండ సీపీ ఎదుట విష్ణు హాజరయ్యారు.

మోహన్‌బాబుపై కేసు..

మంగళవారం రాత్రి మీడియా ప్రతినిధులపై దాడికి పాల్పడిన ఘటనలో మోహన్‌బాబుపై పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆయన ఇంటి వద్ద ఉన్న బౌన్సర్లను బైండోవర్ చేయించారు. ఇదిలా ఉండగా.. మోహన్‌బాబుకు బీపీ ఎక్కువగా ఉందని, మెడ నొప్పి, కాళ్ల నొప్పి తీవ్రంగా ఉన్నాయని కాంటినెంటల్ ఆస్పత్రి బులెటిన్‌లో పేర్కొంది. ఒంటిపై కూడా కొన్ని గాయాలున్నాయని, కంటి కింద వాపు ఉందని తెలిపింది. రెండు రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచుతామంది. మరోవైపు మోహన్‌బాబు కుమార్తె మంచు లక్ష్మి ఇన్‌స్టాగ్రామ్‌లో పీస్ (శాంతి) అంటూ కామెంట్ పెట్టారు. ఈ పోస్టుకు మనోజ్ భార్య మౌనిక లైక్ కొట్టారు.

మోహన్‌బాబుపై కేసు..

మీడియాపై దాడి చేసిన మోహన్‌బాబును మా అసోసియేషన్ నుంచి తొలగించడంతోపాటు హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలని జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం ఫిల్మ్ చాంబర్ వద్ద మీడియా ప్రతినిధులు నిరసన ప్రదర్శన చేపట్టారు. మరోవైపు జర్నలిస్టులు రాచకొండ కమిషనరేటట్ ఎదుట ఆందోళన చేపట్టారు.

నా నిర్లక్ష్యం లేదు



- నేను థియేటర్‌కు వచ్చినంత మాత్రాన రేవతి మృతికి కారణమైనట్లు కాదు
- సినీ నటుడు అల్లు అర్జున్
- తనపై కేసు కొట్టేయాలంటూ టీ హైకోర్టులో అల్లు అర్జున్ పిటిషన్

హైదరాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతిచెందడం దురదృష్టకరం అని.. అయితే ఆ ఘటనతో తనకు ఎలాంటి సంబంధం లేదని సినీనటుడు అల్లు అర్జున్ పేర్కొన్నారు. తాను ప్రీమియర్ షో కోసం థియేటర్‌కు వచ్చినంత మాత్రన రేవతి మృతికి కారణమైనట్లు కాదని చెప్పారు. తన సినిమా విడుదలైన రోజు థియేటర్‌కు హాజరవ్వడం అనేది తాను మొదటి నుంచీ పాటిస్తున్న సంప్రదాయం అని, పైగా పుష్ప-2 ప్రీమియర్ షో కోసం తాను సంధ్య థియేటర్‌కు వస్తున్నట్లు పోలీసులు, థియేటర్ యాజమాన్యానికి రెండు రోజుల ముందే సమాచారం అందించానని, అలాంటప్పుడు తనకు నేరాన్ని ఎలా ఆపాదిస్తారు? అని ప్రశ్నించారు. ఈ మేరకు రేవతి మృతి కేసులో తనను నిందితుడిగా చేరుస్తూ చిక్కడపల్లి పోలీసులు పెట్టిన కేసు కొట్టేయాలని పేర్కొంటూ అల్లు అర్జున్ టీహైకోర్టులో బుధవారం క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. 'పిటిషనర్ (అల్లు అర్జున్)ను నిందితుడిగా చేర్చడానికి కావాల్సిన ఆధారాలు లేవు. అక్రమంగా కేసు పెట్టడం వల్ల క్రిమినల్ ట్రయల్‌ను ఎదుర్కోవాల్సి వస్తే పిటిషనర్‌కు ఉన్న పేరు ప్రతిష్ఠలు దెబ్బతింటాయి. పిటిషనర్‌పై ఎలాంటి ఆరోపణ లేకుండా యాంత్రికంగా కేసు నమోదు చేశారు. ఘటన జరగడానికి ముందే ఏసీపీ, డీసీపీ వంటి సీనియర్ పోలీసు అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సినిమా ప్రదర్శనకు పిటిషనర్ హాజరయ్యారు కాబట్టి క్రిమినల్ ఉద్దేశాలను ఆపాదించి ఎఫ్ఐఆర్ నమోదు చేయడం కరెక్ట్ కాదు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదులో సైతం ఘటనతో పిటిషనర్‌కు సంబంధం ఉన్నట్లు ఎలాంటి ఆరోపణ చేయలేదు' అని అల్లు అర్జున్ తరఫున ఆయన న్యాయవాది పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇది త్వరలో హైకోర్టు సింగిల్ జడ్జి ఎదుట విచారణకు రానుంది.

నవ్య | చిత్రజ్యోతి

విభిన్న వినోదం



ఎప్పటికప్పుడు కొత్త కథలు ఎన్నుకొని, వైవిధ్యమైన పాత్రలను చేస్తూ ప్రేక్షకులను అలరించే కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర చాలా గ్యాప్ తర్వాత మళ్లీ దర్శకత్వం చేపట్టి రూపొందించిన చిత్రం 'యు ఐ ద మూవీ' సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ సినిమాను ఈ నెల 20న గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ తెలుగులో గ్రాండ్‌గా విడుదల చేస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకున్న ఈ చిత్రం విజువల్‌గా, టెక్నికల్‌గా అత్యున్నత స్థాయిలో ఉండబోతోంది. రీష్మా నానయ్య కథానాయికగా నటించిన ఈ చిత్రంలో మురళీ శర్మ, సన్నీ లియోన్, నిధి సుబ్బయ్య, సాధు కోకిల, ఇంద్రజిత్ లంకేశ్ ఇతర ముఖ్య తారాగణం. ఈ చిత్రానికి సహ నిర్మాత: నవీన్ మనోహరన్, నిర్మాతలు: జి.మనోహరన్, కేపీ శ్రీకాంత్.

రెండో పెళ్లికి రెడీనా?



కొత్త ఏడాది తమ జీవితాల్లోకి సంతోషాల కాంతులు మోసుకురావాలని కోరుకోనివారెవరుంటారు!. నటి సమంత కూడా అదే ఆకాంక్షించారు. 2025లో రాశిఫలాల ప్రకారం తన వ్యక్తిగత జీవితం, కెరీర్‌లో కొత్త సంవత్సరం ఎలా ఉండబోతోందో తెలిపే ఒక సందేశాన్ని ఆమె సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. వృత్తి జీవితంలో ఎదుగుదల, ఆర్థిక స్థిరత్వంతో పాటు నూతన సంవత్సరంలో ప్రేమ, విధేయత చూపించే భాగస్వామి లభిస్తారనీ, సంతానం కలుగుతుందని ఆ పోస్ట్‌లో ఉంది. అందులో పేర్కొన్న విధంగా తన జీవితంలో మంచి జరగాలని కోరుకుంటున్నట్లు సమంత తెలిపారు. ఇందులో ఉన్న కొన్ని అంశాలు సమంత జీవితానికి దగ్గరగా ఉండడం, వృషభ, కన్య, మకర మూడు రాశుల ప్రస్తావన తేవడంతో ఆమె తన రెండో పెళ్లి గురించి చెప్పకనే చెప్పారనీ, త్వరలో కొత్త జీవితాన్ని ప్రారంభిస్తారేమోనని నెటిజన్లు విశ్లేషిస్తున్నారు. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో మాతృత్వాన్ని ఆస్వాదించాలని కోరుకుంటున్నట్లు సమంత తెలిపారు. ప్రస్తుతం ఆమె 'రక్త్ బ్రహ్మాండ్' అనే వెబ్ సిరీస్‌లో నటిస్తున్నారు.

తాండవం మొదలైంది



నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'అఖండ 2 తాండవం' రెగ్యులర్ షూటింగ్ బుధవారం మొదలైంది. దర్శకుడు బోయపాటి తనదైన స్టైల్‌లో బ్రెత్ టేకింగ్ ఫైట్ సీక్వెన్స్‌తో షూటింగ్ ప్రారంభించారు. రామోజీ ఫిల్మ్ సిటీలో రామ్, లక్ష్మణ్ మాస్టర్స్ సారథ్యంలో ఈ ఫైట్ చిత్రీకరిస్తున్నారు. సంచలన విజయం సాధించిన 'అఖండ' చిత్రానికి సీక్వెల్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం మరింత యాక్షన్, గ్రిప్పింగ్ డ్రామాను అందిస్తుందని నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట చెబుతున్నారు. భారీ తారాగణంతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విజయదశమి సందర్భంగా సెప్టెంబర్ 25న విడుదలవుతుంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఫొటోగ్రఫీ: సి.రామ్‌ప్రసాద్, ఎడిటింగ్: తమ్మిరాజు.




బాలీవుడ్ సినీ దిగ్గజం రాజ్‌కపూర్ శతజయంతి సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం కపూర్ కుటుంబ సభ్యులు ప్రధాని నరేంద్రమోదీని కలిశారు. ఈ నెల 13 నుంచి 15 వరకూ నిర్వహిస్తున్న రాజ్‌కపూర్ శతజయంతి వేడుకలకు హాజరు కావాలని ప్రధానిని ఆహ్వానించారు. రణ్‌బీర్‌కపూర్, కరీనా కపూర్, సైఫ్ అలీఖాన్, కరిష్మా కపూర్, అలియాభట్, నీతూ కపూర్ తదితరులు ప్రధానిని కలిశారు.

పెళ్లి వేడుకలు ప్రారంభం



కథానాయిక కీర్తిసురేశ్ పెళ్లి వేడుకలు ప్రారంభమయ్యాయి. నేడు ఆమె తన ప్రియుడు ఆంటోని తట్టిల్‌తో ఏడడుగులు వేయనున్నారు. గోవాలోని ప్రముఖ రిసార్ట్ వీరి పెళ్లికి వేదిక కానుంది. బుధవారం ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ ప్రారంభమయ్యాయి. ఈ వేడుకకు సిద్ధమవుతున్న ఫొటోను కీర్తి ఇన్‌స్టా స్టోరీలో షేర్ చేశారు. ఇప్పటికే ఇరువైపులా కుటుంబ సభ్యులు గోవాకు చేరుకున్నారు. హిందూ, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం వీరి వివాహం జరగనుంది. కీర్తి, ఆంటోని పేర్లలోని తొలి అక్షరాలు 'కే ఏ'ను ముద్రించిన హ్యాండ్ బ్యాండ్స్ అతిథులకు అందించేందుకు సిద్ధం చేశారు. అలాగే అతిథుల గదుల్లో తమ పెళ్లికి సంబంధించిన విశేషాలను తెలుపుతూ ముద్రించిన 'వెల్‌కమ్ టూ ద వెడ్డింగ్ మ్యాడ్‌నెస్' అనే మ్యాగజైన్స్‌ను కీర్తి ఉంచారట. కీర్తిసురేశ్ సన్నిహితులైన కొద్దిమంది సినీ ప్రముఖులు మాత్రమే ఈ పెళ్లి వేడుకల్లో పాల్గొంటారని తెలుస్తోంది.

ప్రేమ, వినోదం.. ఫంకీ



విష్వక్‌సేన్ హీరోగా నటించే 'ఫంకీ' చిత్రం షూటింగ్ బుధవారం మొదలైంది. 'జాతిరత్నాలు' చిత్ర దర్శకుడు అనుదీప్ కేవీ రూపొందిస్తున్న ఈ సినిమాను సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. దర్శకుడు నాగ్ అశ్విన్ తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. మరో దర్శకుడు కల్యాణ్ శంకర్ కెమెరా స్విచాన్ చేశారు. ప్రారంభోత్సవం సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్ ఆకట్టుకుంటోంది. ప్రేమ గుర్తులు కలిగిన ఈ పోస్టర్‌లో 'ఫ్యామిలీ ఎంటర్‌టైనర్' అనే పదాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి వచ్చే ఏడాది సంక్రాంతి తర్వాత రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందనీ, అందర్నీ కడుపుబ్బా నవ్వించేలా సినిమా ఉంటుందనీ నిర్మాతలు చెప్పారు.

సుందరవల్లి రాయల్ లుక్



యువ కథానాయకుడు నిఖిల్ పోరాట యోధుడిగా నటిస్తున్న 'స్వయంభూ' చిత్రం శరవేగంతో జరుగుతోంది. హై బడ్జెట్, ఫస్ట్ క్లాస్ టెక్నికల్ స్టాండర్డ్స్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ పీరియాడిక్ వార్ బ్యాక్‌డ్రాప్ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త, నభా నటేశ్ నటిస్తున్నారు. వీరిలో నభా నటేశ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రంలో ఆమె పోషిస్తున్న సుందరవల్లి లుక్‌ని విడుదల చేశారు. రాయల్ ట్రెడిషనల్ లుక్‌లో మరింత అందంగా కనిపించారు. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న 'స్వయంభూ' చిత్రానికి కృష్ణమాచారి దర్శకుడు.

తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో దండోరా



'కలర్ ఫొటో', 'బెదురులంక 2012' చిత్రాలను నిర్మించి అందరి దృష్టి ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని 'దండోరా' పేరుతో కొత్త చిత్ర నిర్మాణానికి బుధవారం శ్రీకారం చుట్టారు. నటుడు శివాజీ, నవదీప్, రాహుల్ రామకృష్ణ తదితరులు ప్రధాన పాత్రలు పోషించే ఈ చిత్రం తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకుంటుంది. పురాతన ఆచారాలు, సంప్రదాయలను ఆవిష్కరిస్తూనే వ్యంగ్యం, హాస్యం, హృదయానికి హత్తుకొనే భావోద్వేగాలతో చిత్రం ఉంటుందని దర్శకుడు మురళీకాంత్ చెప్పారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ఎస్కేఎన్ కెమెరా స్విచాన్ చేయగా, మరో నిర్మాత సాహు గారపాటి క్లాప్ ఇచ్చారు. సూర్యదేవర నాగవంశీ గౌరవ దర్శకత్వం వహించారు.

మూడు రోజుల నష్టాలకు బ్రేక్

ముంబై: స్టాక్ మార్కెట్‌లో మూడు రోజుల వరుస నష్టాలకు బుధవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ 16.09 పాయింట్ల లాభంతో 81,526.14 వద్ద ముగియగా నిఫ్టీ 31.75 పాయింట్ల లాభంతో 24,641.80 వద్ద ముగిసింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ బుధవారం ఒక్క రోజే రూ.91,110.2 కోట్లు పెరిగి రూ.460.46 లక్షల కోట్లకు చేరింది. బుధవారం రాత్రి వెలువడే అమెరికా రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాల కోసం భారత మార్కెట్ ఆసక్తితో ఎదురు చూస్తోందని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ రీసెర్చ్ విభాగం హెడ్ వినోద్ నాయర్ చెప్పారు.

ఐపీఓల సబ్‌స్క్రిప్షన్ అదుర్స్ : బుధవారం ప్రారంభమైన మూడు ఐపీఓలకు మదుపరుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. వన్ మొబిక్విక్ సిస్టమ్స్ ఐపీఓ అయితే ఇష్యూ ప్రారంభమైన తొలి రోజు తొలి గంటలోనే పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయింది. రిటైల్ పోర్షన్ ఏడు రెట్లు, నాన్-ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 1.5 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి.

● విశాల్ మెగా మార్ట్ ఇష్యూ తొలి రోజు ముగిసే సమయానికి 51 శాతం సబ్‌స్క్రిప్షన్ సాధించింది. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగంలో 53 శాతం సబ్‌స్క్రిప్షన్ నమోదయింది.

● సాయి లైఫ్ సైన్సెస్ ఇష్యూ కూడా తొలి రోజు ముగిసే సమయానికి 84 శాతం సబ్‌స్క్రిప్షన్ సాధించింది. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగంలో 18 శాతం సబ్‌స్క్రిప్షన్ వచ్చింది.

హైదరాబాద్ విమానాశ్రయంలో ఏపీఓసీ సెంటర్

దేశంలోనే తొలి ఏఐ ఆధారిత కేంద్రం

ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా పని చేసే ఎయిర్‌పోర్ట్ ప్రెడిక్టివ్ ఆపరేషన్ సెంటర్‌ను (ఏపీఓసీ) కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ కేంద్రం ప్రారంభం భారత విమానయాన చరిత్రలోనే ఒక కొత్త అధ్యాయమని ఆయన అన్నారు. దేశంలో ఏఐ, ప్రిస్క్రిప్టివ్ అనలిటిక్స్, ఐఓటీ ఆధారంగా పని చేసే ఇలాంటి ఒక కేంద్రం ఏర్పాటు కావడం ఇదే ప్రథమం. ఈ సెంటర్ ఎయిర్ సైడ్ (విమానాల రాకపోకలు నిర్వహించే ప్రాంతం), ల్యాండ్‌సైడ్ (వాహనాల రాకపోకలు, పార్కింగ్ వంటివి), టెర్మినల్ (ప్రయాణికులు రాకపోకలు సాగించే ప్రాంతం) నిర్వహణా కార్యకలాపాలన్నింటినీ ఒకే వ్యవస్థ పరిధిలోకి తెస్తుందని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఎస్‌జీకే కిశోర్ చెప్పారు. దీని వల్ల ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణానుభూతి కల్పించే వీలు కలుగుతుందన్నారు. వాస్తవిక డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకుని అంతరాయాలు తగ్గించడంతో పాటు నిరంతరాయంగా కార్యకలాపాలు సాగించేందుకు ఈ కేంద్రం సహాయకారిగా ఉంటుందని చెప్పారు. దశలవారీగా జీఎంఆర్ నిర్వహణలోని విమానాశ్రయాలన్నింటికీ ఈ వ్యవస్థను విస్తరించాలనుకుంటున్నామంటూ ఢిల్లీ విమానాశ్రయంలో ఈ వ్యవస్థ కొద్ది నెలల్లో ఏర్పాటు కానున్నట్టు చెప్పారు. దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఎయిర్‌పోర్ట్ నిర్వహణ వ్యవస్థను ఆధునీకరించవలసి ఉన్నదంటూ ఇతర విమానాశ్రయాల్లో కూడా ఈ తరహా వ్యవస్థ ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తామని కేంద్ర మంత్రి చెప్పారు. హైదరాబాద్ విమానాశ్రయం సాధించిన అద్భుతమైన వృద్ధిని ఆయన కొనియాడారు. 2010 సంవత్సరంలో 65 లక్షల మంది ప్రయాణికులు, 220 రోజువారీ విమాన సర్వీసుల స్థాయి నుంచి నేడు 2.5 కోట్ల మంది ప్రయాణికులు, 550 రోజువారీ విమాన సర్వీసుల స్థాయికి ఎదిగిందని ఆయన పేర్కొన్నారు. దేశీయ విమానయాన రంగంలో కూడా అద్భుతమైన పురోగతి ఏర్పడుతున్నదంటూ నవంబరు 17వ తేదీన ఒక్క రోజులోనే 5 లక్షల మంది వివిధ దేశీయ గమ్యాలకు ప్రయాణించారని, ఇది ఒక కొత్త రికార్డు అని చెప్పారు. ప్రజలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిరంతరాయంగా ప్రయాణించగల వసతులు అందుబాటులో ఉంచాలన్నదే మంత్రిగా తన లక్ష్యమన్నారు.

కొత్త టెర్మినల్, రెండో రన్‌వే

హైదరాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల సంఖ్య ఏడాదికి 4.5 కోట్లు చేరితే రెండో రన్ వే ప్రారంభించడంతో పాటు కొత్త టెర్మినల్ నిర్మించే విషయం పరిశీలిస్తామని కిశోర్ విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం ఏటా 3 కోట్లున్న ప్రయాణికుల సంఖ్య 2030 నాటికి 4.5 కోట్లు చేరుతుందని అంచనాగా చెప్పారు. ముందస్తు అంచనాలు, తమ అనుభవం ఆధారంగా సామర్థ్యాల విస్తరణ ప్రణాళికల రూపకల్పన ఇప్పటికే చేపట్టామని ఆయన చెప్పారు. ఏటా 1.2 కోట్ల ప్రయాణికుల సామర్థ్యంతో 2008 సంవత్సరంలో నిర్మించిన జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఏటా 3.4 కోట్ల మంది ప్రయాణికులను తరలించగల మౌలిక వసతులను దశలవారీగా ఇప్పటికే ఏర్పాటు చేశారు. ప్రస్తుతం విమానాశ్రయంలో ఒక ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ ఉంది.

ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొంటాం

ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా



ముంబై: తన హయాంలోనూ విధానపరమైన ద్రవ్య విషయాల్లో ఎలాంటి మార్పు ఉండదని ఆర్‌బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు, స్పందించేందుకు ఆర్‌బీఐ సిద్ధంగా ఉంటుందన్నారు. 'మనం సుస్థిరమైన ద్రవ్య విధానాలు కొనసాగించాల్సి ఉంది. అలా అని వాటికే అంటుకుపోయి ఉండకూడదు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికపుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండక తప్పదు' అన్నారు. ద్రవ్యోల్బణ నియంత్రణ, కీలక వడ్డీ రేట్ల తగ్గింపుపై మాత్రం మల్హోత్రా నోరు మెదప లేదు.

ప్రజా ప్రయోజనాలే ముఖ్యం

ప్రజా ప్రయోజనాలే ప్రాతిపదికగా ఆర్‌బీఐ నిర్ణయాలు తీసుకుంటుందని మల్హోత్రా స్పష్టం చేశారు. ఆర్థిక సేవలు అందరికీ అందుబాటులోకి తేవడంపై తాను ప్రత్యేకంగా దృష్టి పెట్టబోతున్నట్టు తెలిపారు. ఇందుకోసం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఫైనాన్సియల్ రెగ్యులేటర్లతోనూ సమన్వయపూర్వకంగా పని చేస్తామని చెప్పారు. టెక్నాలజీ సాయంతో బ్యాంకింగ్ సేవలను అందరికీ చేరువ చేసేందుకూ మరిన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జూబిలెంట్ భార్తియా గ్రూప్ చేతికి

కోకా-కోలాలో 40% వాటా

డీల్ విలువ రూ.10,000 కోట్లు!?



న్యూఢిల్లీ: భారత బాట్లింగ్ వ్యాపారం 'హిందుస్థాన్ కోకా-కోలా బెవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో (హెచ్‌సీసీబీఎల్) 40 శాతం వాటాను జూబిలెంట్ భార్తియా గ్రూప్‌నకు విక్రయిస్తున్నట్లు అంతర్జాతీయ శీతల పానీయాల దిగ్గజం కోకా-కోలా బుధవారం ప్రకటించింది. డీల్ విలువను మాత్రం వెల్లడించలేదు. అయితే, ఈ ఒప్పందం విలువ రూ.10,000 కోట్ల స్థాయిలో ఉండవచ్చని మార్కెట్ వర్గాల అంచనా. హెచ్‌సీసీబీఎల్ మాతృ సంస్థ హిందుస్థాన్ కోకా-కోలా బెవరేజెస్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో (హెచ్‌సీసీహెచ్) వ్యూహాత్మక పెట్టుబడి ద్వారా 40 శాతం వాటా కొనుగోలు చేసేందుకు విధిగా కట్టుబడి ఉండే ఒప్పందం కుదుర్చుకున్నట్లు భార్తియా గ్రూప్ తన ప్రకటనలో వెల్లడించింది. ఈ ఏడాది అక్టోబరులో ఏర్పాటు చేసిన జూబిలెంట్ బెవరేజెస్ లిమిటెడ్ సంస్థ ద్వారా ఈ కొనుగోలు జరుపుతున్నట్లు తెలిపింది. భారత మార్కెట్లో హెచ్‌సీసీబీ తన విజయ ప్రస్థానాన్ని కొనసాగించడంతోపాటు తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ఈ పెట్టుబడులు దోహదపడనున్నాయని భార్తియా గ్రూప్ పేర్కొంది. నియంత్రణ మండళ్ల ఆమోదానికి లోబడి ఈ లావాదేవీ పూర్తి కానుంది. పార్లే బిస్లెరీకి చెందిన రమేశ్ చౌహాన్ నుంచి థమ్సప్ సహా పలు బ్రాండ్ల కొనుగోలు ద్వారా కోకా-కోలా కంపెనీ 1993లో భారత మార్కెట్లోకి పునః ప్రవేశించింది.

అంతర్జాతీయంగా కీలకేతర ఆస్తులను తగ్గించుకునే వ్యూహంలో భాగంగా కోకా-కోలా భారత బాట్లింగ్ బిజినెస్‌లోనూ వాటా విక్రయించింది. హెచ్‌సీసీబీఎల్ ఏపీ, తెలంగాణ సహా దేశవ్యాప్తంగా 13 ప్రాంతాల్లో బాట్లింగ్ యూనిట్లను కలిగి ఉంది. కోకో కోలా, స్ప్రైట్, థమ్సప్, లిమ్కా, మాజా, ఫాంటా, మినిట్ మెయిడ్, కిన్లే వాటర్ వంటి ప్రముఖ బ్రాండ్లతో సహా మొత్తం 8 విభాగాల్లో 37 భిన్న ఉత్పత్తులను తయారు చేసి విక్రయిస్తోంది. కోకా-కోలాకు భారత్ ఐదో అతిపెద్ద మార్కెట్. జూబిలెంట్ భార్తియా గ్రూప్‌నకు చెందిన జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ దేశంలోని అతిపెద్ద క్యూఎస్ఆర్ చైన్ ఆపరేటర్లలో ఒకటి. డామినోస్ పిజ్జా, పాప్‌ఐస్, డంకిన్, హాంగ్స్ కిచెన్, కెఫే బ్రాండ్ కాఫీ సైతం ఈ గ్రూప్‌నకు చెందినవే. భారత్‌తోపాటు ఇతర దేశాలకూ వ్యాపారాన్ని విస్తరించింది. ఇండియా, టర్కీ, బంగ్లాదేశ్, శ్రీలంక, అజర్‌బైజాన్, జార్జియా మార్కెట్లలో మొత్తం 3,130 స్టోర్లను నిర్వహిస్తోంది.

బిగ్ సీ 22వ వార్షికోత్సవ ఆఫర్లు

హైదరాబాద్: దక్షిణాదిలో అతిపెద్ద మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్ సీ.. 22వ వార్షికోత్సవ ఆఫర్లను ప్రకటించింది. స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.5,999 విలువైన స్మార్ట్ వాచ్ లేదా రూ.1,799 విలువైన ఇయర్ బర్డ్స్‌ను రూ.22కే అందిస్తున్నట్లు బిగ్ సీ సీఎండీ ఎం బాలు చౌదరి తెలిపారు. అంతేకాదు, 10 శాతం వరకు తక్షణ క్యాష్ బ్యాక్, మొబైల్ కొనుగోలు కోసం జీరో డౌన్‌పేమెంట్, నో కాస్ట్ ఈఎంఐ ఆఫర్లను సైతం అందిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఇవే గాక, ప్రతి మొబైల్ కొనుగోలుపై ఖచ్చితమైన ఒక బహుమతిని కూడా అందిస్తామన్నారు. వివో, ఒప్పో, ఎంఐ, రియల్‌మీ, వన్‌ప్లస్ మొబైల్ కొనుగోలుపై 10 శాతం వరకు తక్షణ క్యాష్ బ్యాక్, సామ్‌సంగ్ మొబైల్ కొనుగోలుపై రూ.20,000 వరకు తక్షణ క్యాష్ బ్యాక్, ఐఫోన్ కొనుగోలుపై రూ.7,000 వరకు తక్షణ డిస్కౌంట్, బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 51 శాతం వరకు డిస్కౌంట్ కూడా కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్, ఎయిర్ కండీషనర్లు కొనుగోలు చేసే సదుపాయాన్నీ కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు.

మళ్లీ రూ.80,000 దాటిన పసిడి

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్ మళ్లీ జోరందుకుంది. పది గ్రాముల మేలిమి (24 కేరట్స్) పసిడి ధర బుధవారం ఢిల్లీలో రూ.620 పెరిగి రూ.80,400 వద్ద ముగిసింది. కిలో వెండి రూ.1,450 లాభంతో రూ.96,300కు చేరింది. గత నెల రోజుల్లో వెండి ధరలో భారీ పెరుగుదల ఇదే. దేశీయ మార్కెట్‌లో రిటైలర్లు, నగల వ్యాపారుల నుంచి డిమాండ్ పెరగడం ఇందుకు ప్రధాన కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అమెరికాలో వడ్డీరేట్లు మరింత తగ్గుతాయనే అంచనాలూ ఇందుకు తోడయ్యాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర 2,700 డాలర్లకు చేరువైంది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ప్రధాన కరెన్సీలతో డాలర్ మారకం రేటు పుంజుకోవడం కూడా ఇందుకు దోహదం చేస్తున్నట్టు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ సంస్థ కమొడిటీస్ రెసెర్చ్ అనలిస్టు మానవ్ మోదీ చెప్పారు.

సిడ్నీలో సైయెంట్ కొత్త కార్యాలయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇంటెలిజెంట్ ఇంజనీరింగ్ సర్వీసుల రంగంలోని సైయెంట్ ఆస్ట్రేలియాలోని సిడ్నీలో నూతన కార్యాలయం ప్రారంభించినట్టు ప్రకటించింది. న్యూ సౌత్ వేల్స్‌లోని పరమటాలో ఈ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఇందులో 100 మందికి పైగా అసోసియేట్లు పని చేయగల వసతి ఉన్నట్టు తెలిపింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,470 ▲	72,850 ▲	1,03,000 ▼
విజయవాడ	80,400 ▲	74,000 ▲	95,000 ▼
విశాఖపట్నం	76,490 ▲	72,850 ▲	1,03,000 ▼
ప్రొద్దుటూరు	79,600 ▲	73,710 ▲	94,500 ▲
ముంబై	77,670 ▲	71,140 ▼	92,700 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

12వ తేదీ

హైదరాబాద్	620	విజయవాడ	630
వరంగల్	622	గోదావరి	630
చిత్తూరు	633	విశాఖపట్నం	620
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	81	విజయవాడ	94
వరంగల్	81	గుంటూరు	94
కరీంనగర్	81	ఒంగోలు	94
మహబూబ్‌నగర్	81	చిత్తూరు	80
కర్నూలు	81	నెల్లూరు	80
విశాఖపట్నం	96	అనంతపురం	80
గోదావరి	94		

స్పోర్ట్స్

అయ్యో.. మళ్లీనా!



లిరెన్‌తో గుకేష్ 13వ గేమ్ డ్రా
నేడే ఆఖరి రౌండ్
గేమ్ గెలిస్తే టైటిల్ సొంతం
డ్రాగా ముగిస్తే టైబ్రేక్‌లో ఫలితం
వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్

సింగపూర్: డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్, యువ గ్రాండ్‌మాస్టర్ గుకేష్ మధ్య ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ పోరు ముగింపు దశకు చేరుకుంటున్నా మళ్లీ అదే ఫలితం.. అత్యంత ఉత్కంఠ రేపిన టోర్నీ చివరిరౌండ్‌నకు ముందు గేమ్‌లోనూ ఎవరినీ వరించని విజయం.. బుధవారం జరిగిన కీలకమైన 13వ గేమ్ కూడా డ్రాగా ముగిసింది. మరో రౌండ్ మాత్రమే మిగిలున్న ఈ టోర్నీలో తాజా ఫలితంతో లిరెన్, గుకేష్ చెరో 6.5 పాయింట్లతో సమంగా నిలిచారు. గురువారం ఆఖరిదైన 14వ రౌండ్ జరగనుంది. ఈ గేమ్‌లో గెలిచిన ఆటగాడు 7.5 పాయింట్లతో చాంపియన్‌గా నిలుస్తాడు. ఒకవేళ ఆఖరి గేమ్ డ్రాగా ముగిస్తే.. టైబ్రేక్ ద్వారా విజేతను నిర్ణయిస్తారు. ఇక, దాదాపు ఐదు గంటలపాటు సాగిన బుధవారం నాటి గేమ్‌లో 18 ఏళ్ల గుకేష్ తెల్లపావులతో ఆడాడు. 40 ఎత్తుల తర్వాత లిరెన్‌పై పైచేయి సాధించే అవకాశం గుకేష్‌కు లభించింది. కానీ, దాన్ని గుకేష్ సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఈ క్రమంలో 32 ఏళ్ల లిరెన్ అత్యంత చాకచక్యంగా పావులు కదుపుతూ గేమ్‌ను ముందుకు తీసుకెళ్లాడు. కొన్ని ఎత్తుల తర్వాత ఇద్దరు ఆటగాళ్లు ఎలాంటి రిస్క్ తీసుకోలేదు. చివరకు 68 ఎత్తుల తర్వాత గేమ్‌ను డ్రాగా ముగించారు.

గాబాలో తస్మాత్ జాగ్రత్త!

ఆసీస్‌కు అదిరే రికార్డులు



ఇవీ రికార్డులు
మొత్తం మ్యాచ్‌లు 66
గెలిచినవి: 42; ఓడినవి: 10
డ్రాలు: 13; టై: 1

బ్రిస్బేన్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో కీలకమైన మూడో టెస్టుకు ప్రఖ్యాత స్టేడియం గాబా సిద్ధమైంది. బౌన్స్‌తో పర్యాటక బ్యాటర్లను బెంబేలెత్తించే ఈ వికెట్.. ఒకరకంగా ఆతిథ్య ఆస్ట్రేలియాకు పెట్టనికోట. ఇక్కడ క్రిస్మస్ ముందు జరిగిన 61 మ్యాచ్‌లో కంగారూలు 7 సార్లు మాత్రమే ఓడారు. కానీ, క్రిస్మస్ తర్వాత ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో మూడు టెస్టుల్లో పరాజయం చవిచూశారు. 1988 నుంచి గాబా స్టేడియంలో ఓటమి ఎరుగని ఆసీస్‌కు 2021లో భారత్ పరాజయాన్ని రుచిచూపింది. ఆ తర్వాత వెస్టిండీస్ జట్టు ఆసీస్‌ను కంగుతినిపించింది. అయితే, ఈ రెండు టెస్టులు జనవరిలో నిర్వహించడం గమనార్హం. బ్రిస్బేన్ వికెట్ పేస్, బౌన్స్‌తో బ్యాటర్లకు సవాల్ విసురుతుంది. క్రిస్మస్‌కు ముందు ఇది మరింత ఎక్కువగా ఉండనుండడంతో ఆసీస్ పేసర్లు చెలరేగే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో శనివారం నుంచి జరిగే టెస్ట్‌కు గాబాను వేదికగా ఎంపిక చేయడం సెంటిమెంటల్‌గా కంగారూలకు కలిసి వచ్చేదే. పైగా వర్షం కురుస్తుండడంతో ఫాస్ట్ బౌలర్లకు మరింతగా సహకారం లభిస్తుందని అంచనా వేస్తున్నారు. 'వివిధ కాలాల్లో గాబా వికెట్ భిన్నంగా ప్రతిస్పందిస్తుంది. సీజన్‌కు ముందు పిచ్ తాజాగా ఉంది. గతంలో తరహాలోనే వికెట్‌ను రూపొందించాం. పేస్, బౌన్స్‌కు గాబా ప్రత్యేకం అన్న విషయం తెలిసిందే'నని క్యూరేటర్ డేవిడ్ శాండుర్‌స్కీ చెప్పాడు.

బ్రిస్బేన్ చేరిన టీమిండియా..

టీమిండియా అడిలైడ్ నుంచి బ్రిస్బేన్‌కు చేరుకొంది. ఎయిర్‌పోర్ట్ నుంచి ఆటగాళ్లు బయటికొస్తున్న వీడియోను బీసీసీఐ నెట్‌లోపోస్టు చేసింది. క్రికెటర్లందరూ ఉల్లాసంగా కనిపించారు.

గాబా కూల్చివేత ప్రణాళిక రద్దు..

2032లో జరిగే విశ్వక్రీడల కోసం గాబా స్టేడియాన్ని కూల్చి నూతనంగా నిర్మించాలన్న ఆలోచనను బ్రిస్బేన్ ఒలింపిక్స్ నిర్వాహకులు తిరస్కరించారు. పార్క్‌లాండ్‌లో కొత్తగా స్టేడియాన్ని నిర్మించాలన్న ఐడియాను కూడా తోసిపుచ్చారు. ఒలింపిక్స్ ఆరంభ, ముగింపు ఉత్సవాలను నిర్వహించేలా అందుబాటులో ఉన్న సన్‌కార్ప్ రగ్బీ స్టేడియాన్ని ఆధునికీకరిస్తారు.

క్రికెట్ పండుగకు సిద్ధం

ఈనెల 14 నుంచి జరిగే టెస్టును పురస్కరించుకొని ఇక్కడి భారతీయులు సన్నాహకాలను ఆరంభించారు. మన సంప్రదాయ వంటకాలతో పాటు జాతీయ జెండాలతో స్టేడియంలో పండుగ వాతావరణం సృష్టించనున్నారు. ఈపాటికే టీమిండియా జెర్సీలకు తోడు రోహిత్, కోహ్లీ ఫొటోలకు మంచి డిమాండ్ నెలకొంది. 'టీమిండియా మూడు నాలుగేళ్లకొకసారి ఇక్కడకు వస్తుంటుంది. అప్పుడే మ్యాచ్ చూడడానికి స్టేడియానికి వెళ్తాం. ఒకరకంగా మాకిది పండుగ' అని ఓ అభిమాని చెప్పాడు. 2021 తరహాలో భారత జట్టు మరోసారి అద్భుతం చేయాలని బలంగా కోరుకొంటున్నట్టు అతను చెప్పాడు.

మంధాన పోరాడినా!




- మూడో వన్డేలోనూ భారత్‌కు ఓటమి
- 3-0తో ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్
- సదర్లాండ్ సెంచరీ ● గార్డ్‌నర్‌కు 5 వికెట్లు

పెర్త్: ఓపెనర్ స్మృతి మంధాన (109 బంతుల్లో 14 ఫోర్లు, సిక్స్‌తో 105) సెంచరీతో పోరాడినా.. మిగతా వారి నుంచి తగిన సహకారం అందకపోవడంతో ఆస్ట్రేలియా చేతిలో భారత్ మహిళల జట్టుకు పరాభవం తప్పలేదు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ 83 పరుగుల తేడాతో ఆసీస్ చేతిలో చిత్తయింది. దీంతో సిరీస్‌ను కంగారూలు 3-0తో నెగ్గారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 298 పరుగుల భారీ స్కోరు చేసింది. పేసర్ అరుంధతి (4/26) దెబ్బకు.. ఓపెనర్లు వోల్ (25), లిచ్‌ఫీల్డ్ (26)తోపాటు పెర్రీ (4), బెత్ మూనీ (10) అవుట్ కావడంతో ఆసీస్ 78/4తో కష్టాల్లో పడింది. ఈ దశలో గార్డ్‌నర్ (50)తో కలసి ఐదో వికెట్‌కు 96 పరుగులు జోడించిన అనబెల్ సదర్లాండ్ (110).. కెప్టెన్ తహిల మెక్‌గ్రాత్ (56)తో కలసి ఏడో వికెట్‌కు 122 పరుగుల భాగస్వామ్యంతో జట్టుకు సవాల్ విసరగలిగే స్కోరును అందించింది. ఛేదనలో భారత్ 45.1 ఓవర్లలో 215 పరుగులకే కుప్పకూలింది. స్పిన్నర్ గార్డ్‌నర్ (5/30) ఐదు వికెట్లతో భారత బ్యాటింగ్ వెన్నువిరిచింది. ఓపెనర్ రిచా (2) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా.. మంధాన, హర్లీన్ డియోల్ (39) రెండో వికెట్‌కు 118 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. అయితే, హర్లీన్‌ను అవుట్ చేసిన కింగ్ జట్టుకు కావాల్సిన బ్రేక్‌ను అందించింది. హర్మన్‌ప్రీత్ (12)ను సదర్లాండ్ బోల్తా కొట్టించగా.. 189 పరుగుల స్కోరు వద్ద శతకం పూర్తి చేసుకొన్న మంధానాను గార్డ్‌నర్ బౌల్డ్ చేయడంతో భారత్ ఒక్కసారిగా ఒత్తిడికి లోనైంది. అదే స్కోరు వద్ద దీప్తి (0), జెమీమా (16) కూడా అవుట్ కావడంతో కోలుకోలేక పోయింది. మిన్నూమణి (8), అరుంధతి (5), సైమా (0)లను గార్డ్‌నర్ అవుట్ చేయగా.. టిటాస్ సాధు (3)ను కింగ్ పెవిలియన్ చేర్చింది.

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా: 50 ఓవర్లలో 298/6 (సదర్లాండ్ 110, తహిల 56; అరుంధతి 4/26); **భారత్:** 45.1 ఓవర్లలో 215 ఆలౌట్ (మంధాన 105, హర్లీన్ 39; గార్డ్‌నర్ 5/30).

దిగజారిన కోహ్లీ, రోహిత్ ర్యాంకులు



దుబాయ్: ఆస్ట్రేలియాతో అడిలైడ్ టెస్ట్‌లో ఘోరంగా విఫలమైన స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల ఐసీసీ ర్యాంకులు దారుణంగా దిగజారాయి. బుధవారం విడుదలైన టెస్ట్ బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో విరాట్ 14వ స్థానం నుంచి 20కి పడిపోయాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ రెండో టెస్ట్ రెండు ఇన్నింగ్స్‌ల్లో విరాట్ వరుసగా 7,11 పరుగులే చేశాడు. ఇక_ఇదే గులాబీ టెస్ట్‌లో ఆరో నెంబర్‌లో బరిలో దిగిన కెప్టెన్ రోహిత్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి తొమ్మిది పరుగులే సాధించాడు. ఫలితంగా ఐదు ర్యాంకులు కోల్పోయిన రోహిత్ 31వ స్థానంలో నిలవడం గమనార్హం. గత ఆరేళ్లలో రోహిత్ 30వ స్థానంకంటే కిందికి పడిపోవడం ఇదే తొలిసారి. యువ ఆటగాడు యశస్వీ జైస్వాల్ తన అత్యుత్తమ ర్యాంకును కొనసాగిస్తూ నాలుగో స్థానంలో నిలిచాడు. బౌలర్ల విభాగంలో బుమ్రా తన టాప్ ర్యాంక్‌ను కొనసాగించాడు.

ట్రిపుల్ జంప్‌లో ప్రణయ్‌కు కాంస్యం



భువనేశ్వర్: జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ కుర్రాడు ప్రణయ్ పతకంతో మెరిశాడు. బుధవారం ఇక్కడ జరిగిన ట్రిపుల్ జంప్ ఈవెంట్‌లో ప్రణయ్ 15.07 మీటర్లు లంఘించి మూడోస్థానంతో కాంస్యం దక్కించుకున్నాడు.

ప్లేఆఫ్స్‌కు హరియాణా

పుణె: ప్రొ.కబడ్డీ తాజా సీజన్‌లో ప్లేఆఫ్స్‌కు చేరిన తొలి జట్టుగా హరియాణా స్టీలర్స్ నిలిచింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో హరియాణా 37-26తో బెంగళూరు బుల్స్‌ను చిత్తు చేసింది. స్టీలర్స్‌లో వినయ్ (9), శివమ్ (8) అదరగొట్టారు. బెంగళూరు జట్టులో జతిన్ (5), నితిన్ (5), ప్రతీక్ (5) మాత్రమే రాణించారు. మరో మ్యాచ్‌లో యు ముంబా 47-31తో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది.

షమి విఫలం..బెంగాల్ పరాజయం

'ముస్తాక్ అలీ' క్వార్టర్స్



బెంగళూరు: సీనియర్ పేసర్ షమి (2/43) స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోవడంతో బరోడాతో జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీ క్వార్టర్‌ఫైనల్లో బెంగాల్ 41 పరుగులతో ఓడింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బరోడా 20 ఓవర్లలో 172/7 స్కోరు చేసింది. రావత్ (40), రాజ్‌పుత్ (37) రాణించారు. ప్రమాణిక్, కనిష్క్ కూడా రెండేసి వికెట్లు పడగొట్టారు. ఛేదనలో బరోడా బౌలర్ల ధాటికి బెంగాల్ 18 ఓవర్లలో 131 పరుగులకు ఆలౌటైంది. షాబాజ్ (55) హాఫ్ సెంచరీతో పోరాడాడు. లుక్‌మన్ (3/17), హార్దిక్ పాండ్యా (3/27), అతిత్ (3/41) తలా మూడేసి వికెట్లు తీశారు. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో మధ్యప్రదేశ్ ఆరు వికెట్లతో సౌరాష్ట్రపై, ముంబై కూడా విదర్భపై ఆరు వికెట్లతో, ఢిల్లీ 19 పరుగులతో యూపీపై గెలుపొందాయి. శుక్రవారం జరిగే సెమీఫైనల్స్‌లో బరోడా-ముంబై, ఢిల్లీ-మధ్యప్రదేశ్ ఢీకొంటాయి.

మూడు ఫార్మాట్లలోనూ 'సెంచరీ'

రికార్డు పుటల్లో అఫ్రీది

డర్బన్: పాకిస్థాన్ స్టార్ పేసర్ షహీన్ షా అఫ్రీది రికార్డు పుటలకెక్కాడు. అంతర్జాతీయ క్రికెట్ మూడు ఫార్మాట్లలో వందేసి వికెట్లు తీసిన తొలి పాక్ బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. సౌతాఫ్రికాతో మంగళవారం రాత్రి జరిగిన టీ20లో అఫ్రీది ఈ ఘనత అందుకున్నాడు. మ్యాచ్‌లో అతడు (3/22) వికెట్లు పడగొట్టాడు. పీటర్‌ను అవుట్ చేయడం ద్వారా పొట్టి క్రికెట్‌లో అఫ్రీది వందో వికెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. 74వ టీ20లో షహీన్ ఈ ఫీట్ సాధించాడు. ఇక వన్డేలలో 112, టెస్ట్‌ల్లో 116 వికెట్లు అతడు పడగొట్టాడు.



గాయత్రి జోడీకి నిరాశ

హంగ్జౌ (చైనా): ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (డబ్ల్యూబీఎఫ్) వరల్డ్ టూర్ ఫైనల్స్ తొలి మ్యాచ్‌లో గాయత్రి /ట్రీసా జాలీ ద్వయం పోరాడి ఓడింది. బుధవారం ప్రారంభమైన ఈ టోర్నీ గ్రూప్ 'ఎ'లో తలపడుతున్న గాయత్రి జోడీ మొదటి మ్యాచ్‌లో ప్రపంచ నెంబర్ వన్ జంట లియు షెంగ్ షు/టాన్ నింగ్‌కు గట్టి పోటీనిచ్చింది. చివరకు 20-22, 22-20, 14-21తో పరాజయం చవిచూసింది. గురువారం జరిగే గ్రూపు రెండో మ్యాచ్‌లో పెర్లీ టాన్/తినా మురళీధరన్ (మలేసియా) జోడీని గాయత్రి/ట్రీసా జంట ఢీకొంటుంది.

జింబాబ్వే ఉత్కంఠ విజయం

హరారే: ఉత్కంఠగా జరిగిన తొలి టీ20లో జింబాబ్వే 4 వికెట్లతో అఫ్ఘానిస్థాన్‌ను ఓడించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్ఘాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 144 పరుగులు సాధించింది. జనత్ (54), నబి (44) రాణించారు. ఛేదనలో జింబాబ్వే 145/6 స్కోరు చేసి గెలిచింది. బ్రియాన్ (49), మేయర్స్ (32) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం 12 డిసెంబరు 2024

కౌన్సెలింగ్

వంధ్యత్వానికి చికిత్సలున్నాయా?

డాక్టర్! మా పెళ్లై ఐదేళ్లు. పిల్లలు పుట్టకపోవడంతో ఇద్దరం పరీక్షలు చేయించుకున్నాం. పరీక్షల్లో మా వారిలో లోపముందని తేలింది. పురుషుల్లో వంధ్యత్వాన్ని చికిత్సతో పూర్తిగా సరిదిద్దే వీలుందా? ఎటువంటి చికిత్సలు ఎవరికి అవసరం?

- ఓ సోదరి, హైదరాబాద్

సమర్థమైన చికిత్సతో 75% మందిలో వంధ్యత్వాన్ని పూర్తిగా నివారించవచ్చు. మిగతా 30% మందిలో జన్యుపరమైన సమస్యలుంటాయి. కాబట్టి వాటిని సరి చేయడం కుదరదు. వీర్యం తయారవుతున్నా బయటకు రావడంలో అవరోధాలున్నప్పుడు, లేదా వీర్యమే తయారవని పరిస్థితి ఉన్నప్పుడు, వీర్య కణాల్లో లోపమున్నప్పుడు.. సమస్యనుబట్టి చికిత్స చేయొచ్చు. జెనైటల్ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్లుంటే వాటిని నోటి మాత్రలతో తగ్గించవచ్చు. వేరికోసిల్, వీర్యనాళంలో సమస్యలతోపాటు స్ఖలన సమస్యలు ఉంటే సర్జరీతో సరిదిద్దవచ్చు. హార్మోన్ల హెచ్చుతగ్గులు, ఇన్‌ఫెక్షన్లను మందులతో నయం చేయవచ్చు. ఓపెన్ సర్జరీ, లాప్రోస్కోపిక్ సర్జరీలకు కాలం చెల్లింది. ఇప్పుడు 'మైక్రో సర్జరీ'తో రోగిని ఒక్క రోజులోనే ఇంటికి పంపించే సౌలభ్యం ఉంది. ఈ సర్జరీ చవకైనది, సురక్షితమైనది, ప్రభావవంతమైనది.

అంతవరకూ ఓపిక పట్టాలి!

ఒక వీర్యకణం తయారీకి 60 నుంచి 70 రోజుల సమయం పడుతుంది. పుట్టి మహిళ శరీరంలోకి స్రవించిన వీర్యకణం దేహంలో 5 రోజులపాటు బ్రతికే ఉంటుంది. కాబట్టి వంధ్యత్వానికి చేసే చికిత్స ఫలించి, గర్భం దాల్చడానికి కనీసం రెండున్నర నెలల నుంచి ఆరు నెలల సమయం పడుతుంది. చికిత్స మొదలు పెట్టేశాం కదా! ఫలితం 10 నుంచి 15 రోజుల్లో వస్తుందని ఊహించుకోవడం కరెక్టు కాదు. కొంతకాలంపాటు మందులు వాడేసి, ఆ మందులు నిష్ప్రయోజనమని నిర్ధారణకు వచ్చి వదిలేయడం కూడా సరి కాదు. చికిత్సతో సమస్య సరిదిద్దినా, వీర్యకణం తయారవడానికి ఎక్కువ కాలం పడుతుంది కాబట్టి గర్భధారణకు అంతకాలం పాటు మందులు వాడుతూ ఓపికగా వేచి ఉండాలి.

- డాక్టర్ రాహుల్ రెడ్డి
ఆండ్రాలజిస్ట్, హైదరాబాద్.



నానబెట్టిన బాదం తింటే?

బాదంపై ఉండే పొట్టులో టానిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది శరీరానికి పోషకాలు అందకుండా చేస్తుంది. అందుకే బాదం పప్పుని రాత్రంతా నీళ్లలో నానబెట్టి ఉదయాన్నే పొట్టు తీసి తినడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఇలా తింటే బాదం త్వరగా జీర్ణమవుతుంది. దీనిలోని పోషకాలను శరీరం సులువుగా గ్రహించగల్గుతుంది. ప్రతిరోజూ ఉదయాన్నే అయిదు నానబెట్టిన బాదం పప్పులను తింటే కలిగే ఇతర ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

జీర్ణక్రియకు : నానబెట్టిన బాదంలో లిపేజ్ అనే ఎంజైమ్ తయారవుతుంది. ఇది జీర్ణాశయంలో ఆహార పదార్థాలు త్వరగా జీర్ణం కావడానికి తోడ్పడుతుంది. అనవసరమైన కొవ్వులను కూడా సులువుగా కరిగిస్తుంది.

మలబద్ధకానికి: నానబెట్టిన బాదం పప్పులో కరగని పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి ప్రేగులలో కదలికలను పెంచుతాయి. దీనితో మలబద్ధకం సమస్య దూరమౌతుంది.

మధుమేహానికి: నానబెట్టిన బాదంలో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. ఆరోగ్యకరమైన కొవ్వులు, పీచుపదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తాయి. దీంతో రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా తటస్థంగా ఉంటుంది.

రోగనిరోధక శక్తికి: రాత్రంతా నానబెట్టిన బాదంలో ప్రీబయాటిక్ సమ్మేళనాలు ఏర్పడతాయి. ఇవి ఆహారనాళంలో మంచి బ్యాక్టీరియా పెరగడానికి దోహదం చేస్తాయి. ప్రతిరోజూ ఉదయాన్నే బాగా నానిన బాదం పప్పు తినడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంటువ్యాధులు దరిచేరవు.

ఎముకలకు: నలభై ఏళ్లు నిండిన మహిళల్లో ఎముకలు బలహీనమవుతూ ఉంటాయి. వీరు నానబెట్టిన బాదం పప్పులను తరచూ తింటూ ఉంటే కాల్షియం, మెగ్నీషియం లాంటి పోషకాలు అంది ఎముకలు గట్టిపడతాయి. బాదంలోని యాంటీ ఆక్సిడెంట్లు, ప్రోటీన్లు కండరాలను ఆరోగ్యంగా ఉంచుతాయి.



చర్మానికి: నానబెట్టిన బాదంలో మాంగనీస్ అధికంగా ఉంటుంది. ఇది చర్మం పొరల్లో కొల్లాజెన్‌ని ఉత్పత్తి చేస్తుంది. నానబెట్టిన బాదం పప్పును తినడం వల్ల చర్మానికి ఇ, సి విటమిన్లు అందుతాయి. దీనివల్ల చర్మం మీద ముడతలు, గీతలు రావు.

గుండెకు: నానబెట్టిన బాదంలో తయారయ్యే మోనోశాచురేటెడ్ సమ్మేళనాలు గుండె లోపలి భాగాల్లో చెడు కొలెస్ట్రాల్ పేరుకోకుండా చేస్తాయి. మంచి కొలెస్ట్రాల్ స్థాయిని పెంచి గుండె జబ్బులు రాకుండా నివారిస్తాయి. క్యాన్సర్, ట్యూమర్ లాంటి సమస్యలను అడ్డుకుంటాయి.

బరువు తగ్గేందుకు: నానబెట్టిన బాదంలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ఫాస్ఫరస్, పొటాషియం, ప్రోటీన్లు, పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. ఉదయాన్నే నాలుగు పప్పులు తిన్నా కూడా కడుపు నిండిన భావన కలుగుతుంది. చాలా సమయం వరకు ఆకలి అనిపించదు. దీనివల్ల తినే ఆహారం నియంత్రణలో ఉండి శరీరం బరువు తగ్గే అవకాశం ఏర్పడుతుంది.

వినూత్నం



ఫాలోవర్ల ఫ్యాషన్ గురు

షాపింగ్ అన్నది ఓపికతో కూడుకున్న వ్యవహారం. అంత తీరికా, ఓపిక లేనివాళ్లకు, వాళ్ల బదులుగా షాపింగ్ చేసిపెట్టడంతో పాటు, స్టైలింగ్ కూడా నేర్పిస్తోంది హైదరాబాద్‌కు చెందిన **స్నేహ పోలప్రగడ**. గత ఎనిమిదేళ్లుగా పర్సనల్ షాపర్‌గా, స్టైలిస్ట్‌గా ఫ్యాషన్ ప్రియుల మన్ననలందుకుంటున్న స్నేహ, 'నవ్య'తో పంచుకున్న విశేషాలు...

"సామాజిక మాధ్యమాల్లో కంటెంట్ క్రియేటర్‌గా నా ప్రస్థానం ఎనిమిదేళ్ల క్రితమే మొదలైంది. అభిరుచిగా మొదలుపెట్టిన ఈ వ్యాపకం కెరీర్‌గా మారుతుందని నేను ఊహించలేదు. చిన్నప్పటి నుంచి ఫ్యాషన్ పరిశ్రమ పట్ల నాకున్న ఆసక్తి, నన్నీ రంగం వైపు నడిపించిందనే చెప్పవచ్చు. ఫ్యాషన్‌తో సంబంధం ఉన్న రంగంలోనే స్థిరపడాలని చిన్నప్పటి నుంచీ కోరుకునేదాన్ని. ఆ ఆసక్తితోనే బిటెక్ పూర్తి చేసి, ఎమ్‌బిఎ చదివేటప్పటి నుంచి ఫ్యాషన్ బ్లాగ్స్ రాయడం మొదలుపెట్టాను. తర్వాత 2017లో, ఇన్‌ఫ్లుయెన్సర్ల మార్కెటింగ్‌కు అంతగా ఆదరణ లేని కాలంలోనే నేను ఇన్‌స్టాగ్రామ్‌లో బ్రాండ్ ప్రమోషన్లు మొదలుపెట్టాను. వేర్వేరు బ్రాండ్స్ సహకారంతో ఫ్యాషన్ దుస్తులు వేసుకుని, ఆ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ, వాటిని ప్రమోట్ చేయడం మొదలుపెట్టాను. అలా గుర్తింపు సాధించిన తర్వాత దేశంలో వేర్వేరు ప్రాంతాల్లోని సూక్ష్మ వ్యాపారులను కలిసి, వీడియోలు చిత్రీకరించి ఇన్‌స్టా పేజీలో ప్రమోట్ చేయడం మొదలుపెట్టాను.

అమ్మ తోడ్పాటుతో...

ఈ కెరీర్‌లో నాకు అమ్మ దన్నుగా నిలిచిందని చెప్పాలి. వార్తాపత్రికలు చదువుతూ, సామాజిక మాధ్యమాల్లో ఉత్తరాది స్టైలిస్టులు, ప్రమోటర్ల ప్రొఫైల్స్ చూపించి, 'నువ్వు కూడా ఇలాగే ఎదగాలి' అంటూ ప్రోత్సహిస్తూ ఉండేది. అయితే ఈ కెరీర్ ప్రారంభంలో ఎలాంటి ఆదాయం ఉండేది కాదు. దానికి తోడు కొవిడ్‌లో నా ఫాలోవర్ల సంఖ్య 15 వేల దగ్గరే ఆగిపోయింది. కొవిడ్ తర్వాత పరిస్థితి మెరుగు పడడంతో రెట్టింపు ఉత్సాహం పుంజుకున్నాను. ప్రమోషన్లకే పరిమితం కాకుండా ఇదే రంగంలో వినూత్నమైన కోణాలను అన్వేషించాను. ఆ క్రమంలో 'ఫ్యాషన్ జిరాఫ్' అనే ఇన్‌ఫ్లుయెన్సర్ల నాయకత్వంలో కొనసాగే ఎగ్జిబిషన్ల కోసం ఒక వేదికను నెలకొల్పాను. అటు ఫ్యాషన్ ప్రియులు, ఇటు వ్యాపారులు ఇద్దరికీ ప్రయోజనకరంగా ఉండేలా, ఈ ఎగ్జిబిషన్లలో నేను పని చేస్తున్న బ్రాండ్లకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయడం మొదలుపెట్టాను. అలాగే వారణాసి, కంచి నుంచి చేనేత కళాకారులను పిలిపించి, వేర్వేరు రాష్ట్రాలకు చెందిన స్థానిక వస్త్రాలకు ఎగ్జిబిషన్‌లో స్థానం కల్పించాను. అలాగే 'మాకరాన్ బై ఎస్3' అనే మార్కెటింగ్ ఏజెన్సీ ద్వారా కొత్తగా వ్యాపారాల్లోకి అడుగు పెట్టిన వారికి సామాజిక మాధ్యమాల్లో తమను తాము ప్రమోట్ చేసుకోగలిగే వ్యూహాలను అందిస్తూ ఉంటాను. అలాగే కొత్తగా నెలకొల్పే దుకాణాలకు మార్కెటింగ్ ఈవెంట్స్ కూడా ప్లాన్ చేస్తూ ఉంటాను.

ఎన్నారైలకు ఇండియా షాపింగ్

ఎన్నారైలు ప్రత్యేకించి షాపింగ్ కోసం ప్రతిసారీ స్వదేశానికి వచ్చి వెళ్లడం సాధ్యపడదు. అలాగని వాళ్లు, దుస్తులను ప్రత్యక్షంగా చూడకుండా ఆన్‌లైన్‌లో కొనుక్కోలేరు. అలాంటి వాళ్ల కోసం 'ఏకిసా బై శాంఢ్స్' ఇన్‌స్టాగ్రామ్ వేదికగా, వాళ్ల బదులుగా నేనే ఓపిగ్గా షాపింగ్ చేసి పెడుతూ ఉంటాను. హైదరాబాద్‌తో పాటు కర్నాటక, తమిళనాడు, వారణాసి, జైపూర్, ఢిల్లీ, కోల్‌కతా... ఇలా వేర్వేరు ప్రదేశాల్లో దొరికే అసలైన ఉత్పత్తులను కస్టమర్లకు వీడియోలో చూపిస్తూ, వాటిని కొనుగోలు చేసి, విదేశాలకు పంపిస్తూ ఉంటాను. ఈ సేవలకు తోడు, స్టిచ్చింగ్, స్టైలింగ్ కన్సల్టేషన్ సేవలను కూడా అదనంగా అందిస్తాం. ఏ దుస్తులను దేనితో మ్యాచ్ చేయాలో, ఏ సందర్భానికి ఎలాంటి దుస్తులు తగినవో సూచనలు కూడా ఇస్తూ ఉంటాను.



నేను హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగాను. నాన్న రామచందర్ పోలప్రగడ, ఎస్ఎల్ డయగ్నొస్టిక్స్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. అమ్మ వాణి గృహిణి. నాతో పాటు చెల్లి స్నిగ్ధ పోలప్రగడ కూడా ఇదే రంగంలో కొనసాగుతోంది. వీడియోల ఎడిటింగ్, పోస్టింగ్ పనులు చెల్లే చూసుకుంటుంది. అలాగే సోషల్ మీడియా వ్యూహాత్మక ప్రణాళికల బాధ్యత కూడా చెల్లిదే! ఏ రోజు, ఏ పోస్ట్ పెడితే నెటిజన్లకు ఎక్కువ చేరువ కాగలుగుతామో, స్నిగ్ధ ఎంతో బాగా అంచనా వేయగలుగుతుంది. స్నేహితురాలు మానస నా వ్యాపార భాగస్వామి.

మనిష్ మల్హోత్రా బ్రాండ్‌కు ప్రచారం

ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్లు అసలైన ఉత్పత్తులను ప్రమోట్ చేయడం ఎంతో కీలకం. రెండు లక్షల మంది ఫాలోవర్లు నన్ను విశ్వసిస్తున్నారు. కాబట్టి నకిలీ ఉత్పత్తులకు ఎట్టి పరిస్థితిల్లోనూ ప్రచారం కల్పించను. ఈ వృత్తిలో భాగంగా దేశమంతా తిరుగుతాను కాబట్టి నకిలీకి ఆస్కారం లేని నాణ్యమైన వస్త్రాలు ఎక్కడ దొరుకుతాయో, ప్రముఖ డిజైనర్లు వాళ్ల ఉత్పత్తుల కోసం ఎక్కడి నుంచి ముడిసరుకునే సమకూర్చుకుంటూ ఉంటారో తెలుసు. కాబట్టి నాణ్యతను కోరుకునే ఫ్యాషన్ ప్రియులు నన్ను, నేను ప్రచారం కల్పించే ఉత్పత్తులను పూర్తిగా విశ్వసిస్తూ ఉంటారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా బ్రాండ్ కూడా నేను ప్రమోట్ చేశాను. టైటన్ వాచ్, లూలూ మాల్‌కు కూడా పని చేశాను. భవిష్యత్తులో దుబాయ్, యుఎస్ఎ, సింగపూర్‌లలో స్థిరపడిన భారతీయులకు ఎగ్జిబిషన్ల ద్వారా మన ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావాలనే ఆలోచన ఉంది. అలాగే వెబ్‌సైట్‌ను నెలకొల్పి దాని ద్వారా ప్రామాణికమైన సమాచారాన్ని అందిస్తూ, ఆన్‌లైన్ కొనుగోళ్లను సులభతరం చేయాలనే ఆలోచన కూడా ఉంది."

• గోగుమళ్ల కవిత

వార్తల్లో వనిత

అమెరికాలో భారత సంతతికి చెందిన సిక్కు మహిళ, **హర్మీత్ కౌర్**కు అరుదైన గౌరవం దక్కింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా, 54 ఏళ్ల హర్మీత్‌ను అమెరికా న్యాయశాఖ పౌరహక్కుల సహాయ అటార్నీ జనరల్‌గా ప్రకటించారు. ఆ భారతీయ అమెరికన్ ఆసక్తికరమైన విశేషాలివి...



భారతీయ అమెరికన్ మహిళకు అపూర్వ గౌరవం

1969లో చండీఘడ్‌లో పుట్టిన హర్మీత్ కౌర్, రెండేళ్ల వయసులోనే తల్లితండ్రులతో కలిసి అమెరికా వలస వెళ్లిపోయింది.

న్యూయార్క్ నగరానికి తరలివెళ్లక ముందు ఆమె, ఉత్తర కారొలినాలో నివసించింది. డార్ట్‌మౌత్ కాలేజీలో క్లాసికల్ స్టడీస్, ఇంగ్లీషులో డిగ్రీ పూర్తి చేసిన హర్మీత్... వర్జీనియా స్కూల్ ఆఫ్ లా నుంచి లా డిగ్రీ అందుకుంది. ఆ తర్వాత యునైటెడ్ స్టేట్స్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్‌కు చెందిన జడ్జి, పాల్ విక్టర్‌కు క్లర్క్‌గా పని చేసింది. ఆ తర్వాత న్యూయార్క్, లండన్, సిలికాన్ వ్యాలీ, శాన్‌ఫ్రాన్సిస్కోలలో పని చేసిన తర్వాత, 2006లో ధిల్లాన్ లా గ్రూప్ ఇంక్‌ను స్థాపించి, ప్రజాహక్కుల కోసం లాభాపేక్ష లేని కేంద్రాన్ని నెలకొల్పింది. తన సొంత లాగ్రూప్ ద్వారా, కొవిడ్ సమయంలో అమెరికా ప్రభుత్వం ప్రజలపై విధించిన నిబంధనలు, ప్రజలను ఇళ్లకే పరిమితం చేసే ఆదేశాలను ధిక్కరిస్తూ, ఎన్నో దావాలు వేసింది. ఫేస్ మాస్కుల అవసరాన్ని విమర్శించడంతో పాటు, బ్రిటిష్ టివి ప్రముఖుడైన పియర్స్ మోర్గాన్ కార్యక్రమంలో పాల్గొని, కొవిడ్-19 పాండమిక్‌తో ట్రంప్ వ్యవహారశైలిని విమర్శించిన వ్యక్తి నోరు మూయించి ప్రధాన వార్తల్లోకి ఎక్కింది. 2020 ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్‌కు న్యాయ సలహాదారుగా కూడా వ్యవహరించింది హర్మీత్.

వ్యాజ్యాలు, విమర్శలు

వాణిజ్య వ్యాజ్యాలు, ఉపాధి చట్టాలు, మొదటి సవరణ హక్కులు, ఎన్నికల చట్టాలు.. ఇలా హర్మీత్ చట్టాలకు సంబంధించిన పలు కీలక అంశాల్లో నైపుణ్యం సాధించింది. ప్రత్యేకించి భద్రతలు, వినోదాలు, ఉపాధి వివక్ష, మానవ హక్కులకు సంబంధించిన వ్యాజ్యాలను చేపడుతూ ఉంటుంది. హర్మీత్ వివాదాలకు కూడా ప్రసిద్ధి చెందింది. గత జులైలో, క్రైస్తవ మత ఛాందసవాదులు, సంప్రదాయవాదులు సమావేశమైన రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్‌లో, సిక్కు ప్రార్థనలోని అర్దాస్‌ను పఠించి, విదేశీ దేవుళ్లను ప్రార్థిస్తోందనే విమర్శలను సైతం ఎదుర్కొంది. అలాగే 2019లో ఓటర్ల రిజిస్ట్రేషన్ సమయంలో ఓటర్ల పౌరసత్వాన్ని ధృవీకరించడంలో వైఫల్యాలను విమర్శిస్తూ, క్యాలిఫోర్నియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ మోటార్ వెహికల్స్‌ను మీద ఆరోపణలు చేసింది.



వ్యక్తిగత జీవితం

హర్మీత్ తండ్రి డాక్టర్ తేజ్‌పాల్ ధిల్లాన్, ఆర్థోపెడిక్ సర్జన్. వృత్తి రీత్యా ఆయన కుటుంబంతో కలిసి ప్రపంచ దేశాలు తిరిగాడు. హర్మీత్ కుటుంబం మొదట ఇంగ్లండ్‌కూ, 1971లో అమెరికాకు వలస వెళ్లింది. హర్మీత్ 12 ఏళ్ల వయసులో అమెరికా పౌరసత్వాన్ని పొందింది. హర్మీత్ తల్లి హర్మీందర్ కౌర్ ధిల్లాన్. ఒకానొక సందర్భంలో ఆమె కూతురు హర్మీత్ గురించి ప్రస్తావిస్తూ, హర్మీత్‌ది ఇతరుల అభిప్రాయాలకు తలొగ్గని స్వభావమనీ, ఎదురు ప్రశ్నించే తత్వమనీ పేర్కొనడం గమనార్హం. హర్మీత్ పెంపకమంతా సిక్కు సంప్రదాయాలు, విలువలతోనే కొనసాగింది. ప్రతి వేసవిలో రెండు నెలల పాటు హర్మీత్ తన తల్లి పర్మీందర్, అన్న మన్‌దీప్‌తో కలిసి భారతదేశానికి వస్తూ ఉండేది. వచ్చిన ప్రతిసారీ తన అమ్మమ్మతాతయ్యల మార్గదర్శకత్వంలో సిక్కు సంస్కృతి గురించి లోతైన పరిజ్ఞానాన్ని ఏర్పరుచుకుంటూ ఉండేది. హర్మీత్ గ్రాడ్యుయేషన్ చదువు పూర్తి చేసిన తర్వాత, సిక్కు వైద్యుడు, కన్వర్జీత్ సింగ్‌ను పెళ్లి చేసుకుంది. కానీ వారి వైవాహిక జీవితం ఎక్కువ కాలం కొనసాగలేదు. 2003లో అతన్నుంచి విడాకులు తీసుకున్న హర్మీత్, ఎనిమిదేళ్ల తర్వాత 2011లో, సర్వజీత్ సింగ్‌ను రెండో పెళ్లి చేసుకుంది. సర్వజీత్, పార్కిన్సన్స్, కేన్సర్ వ్యాధులతో పోరాడుతూ ఈ ఏడాది కన్నుమూశారు.

స్నానంతో అదృష్టం!

స్నానం చేసే నీటిలో కొన్ని మూలికలు, దినుసులు కలిపితే అందం, ఆరోగ్యంతోపాటు అదృష్టం కూడా కలిసి వస్తుందని జ్యోతిషం చెబుతోంది. వాటి గురించి తెలుసుకుందాం.

వేపాకు



వేపాకులో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. అందుకే దీన్ని ఆయుర్వేద మందుల తయారీలో ఉపయోగిస్తుంటారు. ఇందులో యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు కూడా పుష్కలంగా ఉంటాయి. ఒక బకెట్ గోరువెచ్చని నీటిలో గుప్పెడు వేపాకులను వేసి అయిదు నిమిషాల తరవాత స్నానం చేస్తే శరీరంలోని ప్రతికూల శక్తి అంతా బయటికి వెళుతుంది. సానుకూల దృక్పథం పెరుగుతుంది. మంచి ఆలోచనలు వస్తాయి.

గంధం

స్నానం చేసే నీటిలో గంధం చెక్క లేదా పొడి వేసుకుంటే కీర్తిప్రతిష్ఠలు, సంపద పెరుగుతాయనీ, అదృష్టం కలిసి వస్తుందనీ, చేపట్టిన ప్రతిపనిలో విజయం దక్కుతుందనీ జ్యోతిషం చెబుతోంది. అంతేకాదు... శరీరానికి, మెదడుకి చల్లదనాన్ని, విశ్రాంతిని అందిస్తుంది. గంధం సువాసన ఎంతటి ఒత్తిడినైనా తగ్గిస్తుంది. కష్టాలను దాటుకుని ముందుకు సాగే ధైర్యాన్ని ఇస్తుంది.



పసుపు

ఆయుర్వేదం ప్రకారం పసుపు ఆరోగ్య ప్రదాయిని. శుభాలకు సంకేతం. ఇది మంచి యాంటీ బ్యాక్టీరియల్ ఔషధం. ఒక బకెట్ నీటిలో చెంచా పసుపు కలుపుకొని స్నానం చేస్తే శరీరం మీద ఉన్న వ్యాధికారక క్రిములన్నీ నశిస్తాయి. పసుపుకి ఉన్న ప్రత్యేకమైన సువాసన మెదడుని ఉత్తేజితం చేస్తుంది. నూతనోత్సాహాన్ని ఇస్తుంది. చర్మానికి మంచి ఛాయతోపాటు కాంతిని అందిస్తుంది.



గులాబీ రేకులు



గులాబీ రేకులు విజయానికి, దర్పానికి, ప్రేమకు సంకేతాలు. స్నానం చేసే నీటిలో గుప్పెడు గులాబీ రేకులు కలుపుకొంటే ఆందోళన, ఒత్తిడి తగ్గుతాయి. గులాబీ పరిమళం మనసుకు ఆనందాన్ని, విశ్రాంతిని అందిస్తుంది. నిరుత్సాహానికి లోనుకాకుండా కొత్త ఆలోచనలవైపు మనసును మళ్లిస్తుంది.

తులసి

తులసి సౌభాగ్యానికి, విజయానికి సంకేతం. దీనిలో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. బకెట్ నీటిలో కొన్ని తులసీ దళాలు వేసి అయిదు నిమిషాల తరవాత స్నానం చేస్తే మనసులో ఆధ్యాత్మిక భావనలు పెరుగుతాయి. శరీరానికి రోగనిరోధక శక్తి లభిస్తుంది. తులసి ఆకుల పరిమళం మానసిక ఆందోళనను పారద్రోలుతుంది. చర్మం కొత్త కాంతితో మెరిసిపోతుంది. దైవం తోడు ఉన్న భావన మానసిక ధైర్యాన్ని పెంచుతుంది. ముఖం ప్రకాశవంతంగా మారుతుంది.



చలికాలంలో డిజైనర్ బ్లౌజులు

శీతాకాలంలో చలిగాలులు ఎక్కువగా వీస్తుంటాయి. బాగా చలిగా అనిపిస్తుంటుంది. ఇలాంటపుడు స్లీవ్‌లెస్, డీప్ నెక్ బ్లౌజులు వేసుకోలేము. అలాగని స్వెట్టర్స్ వేసుకుంటే ట్రెండీగా కనిపించదు. అందుకే చలికాలంలో వేసుకోదగ్గ స్టయిలిష్, ట్రెండీ బ్లౌజ్ డిజైన్ల వివరాలు మీకోసం.....

ఫుల్ స్లీవ్స్

- ఈ బ్లౌజ్‌ల చేతులు భుజాల నుంచి మణికట్టు వరకు పొడవుగా ఉంటాయి. ఇవి ఎటువంటి శరీరాకృతి ఉన్నవారికైనా చక్కగా అమరుతాయి. వీటికి చక్కని నెక్ డిజైన్ కూడా పెట్టించుకోవచ్చు. జార్జెట్, ఫ్యాన్సీ, కాటన్ చీరల మీద వీటిని ధరిస్తే నిండుగా హుందాగా కనిపిస్తారు.

షార్ట్ స్లీవ్స్

- ఈ బ్లౌజ్‌ల చేతులు మోచేయి కన్నా పైకి ఉంటాయి. పొట్టిగా ఉండే మహిళలకు, కాస్త బొద్దుగా ఉండేవారికి ఈ బ్లౌజ్‌లు బాగా నప్పుతాయి. ఈ బ్లౌజ్ చేతుల మీద అందంగా ఎంబ్రాయిడరీ చేసినవి, మగ్గం వర్క్ చేసినవి... ఇలా ఎన్నో రకాలు లభ్యమవుతున్నాయి. ఎటువంటి చీరలమీదనైనా వీటిని ధరించవచ్చు.

బ్లేజర్ బ్లౌజ్

- ప్రస్తుతం ఈ బ్లేజర్ బ్లౌజ్‌కు ఆదరణ ఎక్కువగా ఉంది. పొట్టి చేతులు, పొడుగు చేతులు, వీ నెక్ రకాలు అందుబాటులో ఉన్నాయి. మెడ ముందు భాగంలో బ్లేజర్‌ను గుర్తుకు తెచ్చేలా ఆకర్షణీయమైన డిజైన్ ఉంటుంది. ఉలెన్ వస్త్రం లేదా మందపాటి వస్త్రంలో వీటిని రూపొందిస్తారు. వివిధ రంగుల్లో ఇవి లభ్యమవుతున్నాయి.

హై నెక్ కాలర్ బ్లౌజ్

- మెడని పట్టి ఉంచే కాలర్‌తో ముందు భాగంలో అందమైన గుండీలతో చాలా ఆకర్షణీయంగా ఉంటుంది ఈ బ్లౌజ్. క్రేప్, జార్జెట్, సిల్క్ లాంటి పలుచని చీరల మీద అందంగా నప్పుతుంది. ఫుల్ స్లీవ్స్, హాఫ్ స్లీవ్స్ రకాలు అందుబాటులో ఉన్నాయి. వీటిని ధరిస్తే అందరిలో ప్రత్యేకంగా కనిపిస్తారు.





బుధవారం కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రులు, సీఎస్, డీజీపీ, కలెక్టర్లు, ఉన్నతాధికారులు

దశ దిశ

జనం మెచ్చేలా!

మనం నచ్చేలా పాలన

- కలెక్టర్ల సమర్థతతోనే ప్రజలకు న్యాయం
- 15శాతం జీఎస్‌డీపీ వృద్ధిరేటే లక్ష్యం
- కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు స్పష్టీకరణ

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): "ప్రజలతో గౌరవంగా ఉండండి. వారు కూడా ప్రభుత్వంలో భాగస్వాములే. ప్రజలకు మన పనులు నచ్చేలా చేయాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్లను ఆదేశించారు. మానవత్వంతో ఆలోచించి పని చేయాలని సూచించారు. కలెక్టర్ల సమర్థత వల్లే ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. "ప్రభుత్వం మంచి పాలసీలు తీసుకొచ్చినా, వాటిని మీరే అమలుచేయాలి. మనమంతా ప్రజలకు సేవకులుగా ఉందాం. పీపుల్ ఫస్ట్ అనేది మన నినాదం కావాలి" అని స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో ప్రారంభమైన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి ప్రారంభోపన్యాసం చేశారు. జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. "రాష్ట్రంలో పరిస్థితి గాడిలో పడుతోంది. ఇప్పుడిప్పుడే చీకట్లు తొలగిపోతున్నాయి. గత ప్రభుత్వంలో ప్రజలు మాట్లాడటానికి భయపడేవారు. ఇప్పుడు స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పే పరిస్థితి వచ్చింది. బయట ప్రజలు నవ్వుతూ ఉన్నారంటే ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడినట్టే! దీనిని కొనసాగించేలా మన పాలన కొనసాగాలి" అని చంద్రబాబు అన్నారు. విధ్వంసం తర్వాత జరిగే పునర్నిర్మాణానికి అందరూ కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వంలో అధికారులకు కూడా ఒకటో తేదీన జీతాలు వచ్చేవి కాదని, ఈ ప్రభుత్వం వచ్చాక జీతాలు, పెన్షన్లు మొదటి తేదీనే ఇస్తున్నామన్నారు. "గత ఐదేళ్లలో ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీశారు. పక్క రాష్ట్రాలకు వెళ్తే ఏపీ గురించి అవహేళన చేసే పరిస్థితికి దిగజార్చారు. ఈ ఆరు నెలల్లో మళ్లీ పెట్టుబడులు వస్తున్నాయి. మళ్లీ రాష్ట్రానికి బ్రాండ్ పెరుగుతోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఇంకా వేగం పెంచాలి. ఇందుకు కలెక్టర్లలో పోటీ వాతావరణం రావాలి. ఇన్నేళ్లలో తొలిసారి ఇబ్బందికర పరిస్థితులు చూస్తున్నాను. రూ.10లక్షల కోట్ల అప్పులు పేరుకుపోయాయి. రూ.లక్ష కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. మరోవైపు ఆదాయం లేదు. అభివృద్ధి జరిగితే సంపద వల్ల ఆదాయం వస్తుంది. పోనీ అప్పులు చేద్దామంటే ఎఫ్ఆర్‌బీఎం అనుమతించలేని దుస్థితి వచ్చింది" అని చంద్రబాబు అన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

"గతంలో నేను ఎప్పుడూ చూడనిది రేషన్ బియ్యం అక్రమ రవాణా. ఈ అక్రమాలను పునాదులతో సహా పెకలించివేయాలి. రెండు నెలల్లో మొత్తం కట్టడి కావాలి. గతంలో పొలం గట్లు కబ్జా మాత్రమే జరిగేది. కానీ వైసీపీ ప్రభుత్వంలో పోర్టులు, సెజ్‌లు కబ్జాకు గురయ్యాయి. అందుకే ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకొచ్చాం. యంత్రాంగంలో ఇంకా పాత వాసనలు పోలేదు. అక్కడక్కడా కొన్ని విషయాల్లో నాకు కూడా తెలియకుండా చేస్తున్నారు. అలాంటి అంశాల్లో కఠినంగా వ్యవహరించాలి. - సీఎం చంద్రబాబు

20 పాలసీలు తెచ్చాం


"ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల్లో 60శాతం భూసంబంధిత అంశాలే ఉంటున్నాయి. మద్యం, ఇసుక మాఫియాలతో దోపిడీ చేశారు. దీన్నంతా సరిదిద్దుతున్నాం. అధికారంలోకి రాగానే 20 పాలసీలు ప్రకటించాం. 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించాం. కొత్త పాలసీల వల్ల రూ.4లక్షల కోట్ల పెట్టుబడులు, 4లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ.15 వేలకోట్లు ఇచ్చింది. ఇతరత్రా రూపాల్లో రూ.11వేల కోట్లు సమీకరించాం. అమరావతికి ప్రారంభ దశలోనే రూ.50వేల కోట్లు అవసరం. 2027నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయడం లక్ష్యం. ప్రతినెలా 64 లక్షల మందికి ఇంటికి వెళ్లి పెన్షన్లు అందజేస్తున్నాం. సామాజిక పెన్షన్ల కోసమే ఏడాదికి రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. దీపం-2 పథకం ద్వారా ఇప్పటికి 40వేల మందికి ఉచిత సిలిండర్లు అందజేశాం. త్వరలో 16347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటిస్తాం. వచ్చే ఏడాది బడులు తెరిచే నాటికి కొత్త టీచర్లు బడుల్లో ఉంటారు"

ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం..

"విజన్ 2047 ప్రారంభిస్తున్నాం. అందులో చాలా లక్ష్యాలు ఉంటాయి. వాటి సాధనకు కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలి. జీఎస్‌డీపీలో 15%వృద్ధి రేటు సాధించాలి. రాబోయే 25ఏళ్లలో అదే కొనసాగాలి. 2014-19మధ్య ఈ వృద్ధి రేటు 13.5 శాతంగా ఉంది. గత ఐదేళ్లలో 10.5శాతానికి పడిపోయింది. దానివల్ల రూ.45వేల నుంచి రూ.50వేల కోట్ల ఆదాయం కోల్పోయాం. ఇప్పుడు మొదటి క్వార్టర్‌లో 9.55%, రెండో క్వార్టర్‌లో 8.75% వచ్చింది. అది 15శాతానికి పెరగాలి. ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం లక్ష్యాలుగా విజన్-2047 ఉంటుంది. జీరో పేదరికం దీని లక్ష్యం. ఉపాధి కల్పన మరో కీలక అంశం. రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గాలి"

పరిష్కారంలో శ్రద్ధ లేదు

"రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయి. వాటిని తూతూమంత్రంగా నిర్వహిస్తే ఉపయోగం ఉండదు. ఫిర్యాదుల పరిష్కారంలో శ్రద్ధ కనిపించట్లేదు. రెవెన్యూ, శాంతిభద్రతలు, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల్లో ఎక్కువ ఫిర్యాదులు అందుతున్నాయి. ఆర్థికేతర ఫిర్యాదులను వెంటనే పరిష్కరించండి. పరిష్కారం కాని ఫిర్యాదులకు రికార్డు ఉండాలి. సంక్రాంతి నాటికి రోడ్లపై గోతుల్లేకుండా చేయాలి."



కలెక్టర్ల సదస్సులో మాట్లాడుకుంటున్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



గూగుల్... గేమ్ చేంజర్

"గూగుల్ సంస్థతో ఒప్పందం చేసుకున్నాం. త్వరలో గూగుల్ విశాఖ వస్తుంది. దానివల్ల విశాఖ ఇంకా అభివృద్ధి చెందుతుంది. ఏజెన్సీలో గంజాయి సాగు ఎక్కువగా ఉంది. గూగుల్ శాటిలైట్ ఫొటోల ద్వారా 4వేల ఎకరాల్లో గంజాయి సాగును గుర్తించారు. డ్రోన్లు వాడి వాటిని ధ్వంసం చేయాలి. భూపరీక్షల్లో కూడా గూగుల్ సహకారం ఉంటుంది"

నిస్సహాయంగా మారొద్దు

ఐఏఎస్, ఐపీఎస్‌లకు పవన్ కల్యాణ్ హితవు

- అక్రమాలను మీరు అడ్డుకుంటే మంత్రులు వెళ్లాల్సిన పనే లేదు
- తనిఖీలూ చేయనక్కర్లేదు
- పాలనలో మన రాష్ట్రం మోడల్ కావాలి
- ఉపముఖ్యమంత్రి పవన్ పిలుపు

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అక్రమాలను అడ్డుకునే క్రమంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నిస్సహాయంగా మారొద్దని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హితవు పలికారు. వారు అడ్డుకుంటే ప్రత్యేకంగా మంత్రులు వెళ్లి తనిఖీలు చేయాల్సిన అవసరం ఉండదన్నారు. బుధవారం కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతూ.. ఇటీవల కాకినాడ ప్రాంతంలో మంత్రి నాదెండ్ల మనోహర్ చేపట్టిన తనిఖీలను ఉటంకిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం.. వ్యవస్థ మూలాలను కదిలించే స్థాయిలో విధ్వంసం చేసిందన్నారు. అందుకే విభేదాలు పక్కనపెట్టి ఎన్నికల్లో కూటమిగా పోటీ చేశామని. ప్రజలు తమ నుంచి చాలా ఆశిస్తున్నారని చెప్పారు. అయితే తాము ఎన్ని చెప్పినా అంతిమంగా క్షేత్ర స్థాయిలో అమలు చేసే బాధ్యత అధికారులదేనన్నారు. 'గత వైసీపీ ప్రభుత్వం అధికారులను కూడా చాలా ఇబ్బంది పెట్టింది. చివరకు వారితో సినిమా టికెట్లు కూడా అమ్మించారు. అయినా ఇంతమంది ఐఏఎస్‌లు, సీనియర్ అధికారులు ఉండి ఒక్కరూ అభ్యంతరం చెప్పలేదు. అరాచకాలను అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. ఇది చూసి మేం ఆశ్చర్యపోయాం. అందుకే అప్పట్లో రోడ్లపైకి రావలసి వచ్చింది' అని తెలిపారు. గత ప్రభుత్వంలో పాలన గుడ్డిగా సాగిందన్నారు. అప్పులు రూ.10 లక్షల కోట్లకు చేరాయని.. ఇప్పటికీ డబ్బుల్లేని పరిస్థితి నెలకొందని చెప్పారు. ఇటీవల శ్రీసత్యసాయి జిల్లాలో కొందరు ఉద్యోగులకు నిధుల లేమితో జీతాలు ఇవ్వలేకపోయామని.. సీఎంతో మాట్లాడి రూ.30 కోట్లు విడుదల చేయించుకున్నామని గుర్తుచేశారు. కాకినాడలో మూడు చెక్‌పోస్టులు పెట్టినా బియ్యం అక్రమ రవాణా జరుగుతోంది. ఇది కలెక్టర్, ఎస్పీల బాధ్యత. స్మగ్లింగ్‌ను వదిలేయకూడదు. మేం డబ్బుల కోసం ఇక్కడికి రాలేదు.. ప్రజల కోసం అధికారంలోకి వచ్చాం. అక్రమాల విషయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవద్దని సీఎం హెచ్చరించారు. పాలనలో ఆంధ్రప్రదేశ్ మోడల్ కావాలి. గత ప్రభుత్వంలో పాలన ఎలా ఉండకూడదో చూశాం. ఇప్పుడు ఎలా ఉండాలో చూపించాలి' అని సూచించారు.

ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంటున్నాయి: సీఎస్

ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల పరిష్కారంలో వేగం లేదని సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు. చాలా ఫిర్యాదులు పెండింగ్‌లోనే ఉంటున్నాయన్నారు. స్వర్ణాంధ్ర-2047లో 10 సూత్రాలు ఉన్నాయని, అమరావతి, పోలవరం అత్యంత కీలక అంశాలని తెలిపారు. జిల్లాల పాలన చాలా ముఖ్యమన్నారు.

శాఖలు బాధ్యతాయుతంగా ఖర్చుచేయాలి: పయ్యావుల

"ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ల శాఖల ద్వారా ఆదాయం సమకూరుతోంది. మిగిలిన శాఖలు పథకాలు, కార్యక్రమాల ద్వారా నిధులు వినియోగిస్తాయి. ఆ ఖర్చుల విషయంలో బాధ్యతాయుతంగా ఉండాలి' అని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. గత ప్రభుత్వం రూ.10లక్షల కోట్లు అప్పులు చేసిందని.. వాటికి వడ్డీలు కట్టడానికి కూడా అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని చెప్పారు. గత ప్రభుత్వంలో వచ్చిన ఆదాయం జీతాలకు కూడా చాల్లేదన్నారు. ఇంకా ఇప్పుడు 1.3 లక్షల కోట్లు చెల్లించాల్సిన బిల్లులున్నాయని తెలిపారు.

7.85 లక్షల ఇళ్ల లబ్ధిదారులు పత్తా లేరు: అనగాని

గత ప్రభుత్వంలో ఇళ్ల పట్టాల పంపిణీలో అక్రమాలు జరిగాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. ఇళ్ల పట్టాల లబ్ధిదారుల్లో 7.85 లక్షల మంది ఆచూకీ లేదన్నారు. అలాగే కొంతమంది ఇళ్ల పట్టాలు అమ్ముకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫ్రీహోల్డ్ పేరుతో 4లక్షల ఎకరాల అసైన్డ్ భూములు లాక్కున్నారని.. రాబందుల్లా భూములు ఆక్రమించుకున్నారని, అందుకే రెవెన్యూ సదస్సుల్లో భూవివాదాలపై 98వేల ఫిర్యాదులు అందాయని తెలిపారు. వీటిని అరికట్టేందుకే ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తెచ్చామన్నారు. కబ్జా చేస్తే 10 నుంచి 15 ఏళ్ల వరకు శిక్ష పడుతుందన్నారు.

అనుసంధానంతో కరువుకు చెక్!

జల సంరక్షణ చర్యలు చేపట్టండి: చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నదుల అనుసంధానం చేపడితే.. ఒక ఏడాది విస్తారంగా వర్షాలు కురిసి.. [...]వు వచ్చినా తట్టుకోవచ్చని సీఎం [...]న్నారు. బుధవారం కలెక్టర్ల సదస్సులో మాట్లాడారు. జల సంరక్షణ చర్యలకు [ప్రా]ధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. [...]పెంపుపై దృష్టి సారించాలన్నారు. 'గడచిన ఐదేళ్లలో డ్యాములు, కాలువల యాజమాన్య నిర్వహణ జరగలేదు. గేట్ల మరమ్మతులు పూర్తిగా వదిలేశారు. ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోతే తిరిగి అమర్చేందుకు కాంట్రాక్టర్లు కూడా ముందుకు రాని పరిస్థితి. ఇప్పుడు మా ప్రభుత్వం సమర్థంగా ప్రాజెక్టుల నిర్వహణ చేపడుతోంది. జలాలు వృథా కాకుండా కాపాడుతున్నాం. రిజర్వాయర్లను నీటితో నింపాం. వచ్చే రెండు సీజన్లలో కనీసం 8మీటర్ల మేర భూగర్భజలాలు ఉండేలా చూసుకోవాలి. నదుల అనుసంధానానికి రూ.లక్ష కోట్లు ఖర్చవుతుంది. కృష్ణా-గోదావరి నదులను అనుసంధానం చేస్తే రాయలసీమ సస్యశ్యామలమవుతుంది' అని సీఎం పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేస్తున్నామని ప్రత్యేక సీఎస్ సాయిప్రసాద్ వెల్లడించారు. 2027 జూలై నాటికి పోలవరం పూర్తవుతుందని.. సాంకేతికపరమైన ఇబ్బందులు ఎదురైతే మరో 3నెలలు పట్టవచ్చని వివరించారు. ఈ సారి వరుణుడు కరుణించడంతో రిజర్వాయర్లు నింపుకోగలిగామన్నారు. ఈసారి వర్షాలు ఎక్కువగానే ఉన్నాయని.. వాటినెలా ఎదుర్కోనాలన్నదానిపై దృష్టి సారించాల్సి ఉందని చెప్పారు.

సర్వీసూ ఓ ప్రొడక్టే!

"నేను 40 ఏళ్లుగా కలెక్టర్ల పనితీరును పరిశీలిస్తున్నాను. వారి వ్యవహార శైలి మారాలి. బ్రిటీష్‌వాళ్లు పోతూపోతూ చాలా నియంత్రణలు పెట్టిపోయారు. వారు రెవెన్యూకు అప్పట్లో అత్యధిక ప్రాధాన్యం కల్పించారు. వారి దృష్టిలో కలెక్టరు.. రెవెన్యూ వసూలుచేసే అధికారి. అయితే, ఈ భావన మారాలి. కలెక్టర్లు అన్నిరకాల బాధ్యతలను పంచుకోవాలి. శిక్షణాకాలంలోనే ఇందుకు బీజం పడాలి" - సీఎం చంద్రబాబు

- సేవారంగానికి విస్తృత ప్రచారం కల్పించండి
- వినూత్నంగా ఆలోచిస్తేనే అభివృద్ధి సాధ్యం
- ఒక్క వ్యవసాయంతోనే ప్రగతిని సాధించలేం
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఉద్బోధ

అమరావతి, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): విభిన్నంగా ఆలోచిస్తూ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా జిల్లాల సమగ్రాభివృద్ధి కోసం కలెక్టర్లు చొరవ చూపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించారు. సేవలరంగం కూడా ఓ ప్రొడక్టేనని (ఉత్పత్తి), దానిని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బుధవారం అమరావతి సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. విజన్ ఆంధ్ర-2047 డాక్యుమెంట్‌లో పొందుపరిచిన జిల్లాల వారీ జీడీపీఎస్‌ల వివరాలను సదస్సులో చంద్రబాబు వెల్లడించారు. పరిశ్రమలతోపాటు సర్వీసు రంగం అభివృద్ధి చెందిన జిల్లాల జీడీపీఎస్ అధికంగా ఉన్నదని వివరించారు. "2022-23లో విశాఖపట్నం జీడీపీఎస్ రూ.1,19,268 కోట్లు. అది 2028-29 నాటికి రూ.2,64,781 కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. పరిశ్రమలు, సర్వీసు రంగాల భాగస్వామ్యం అక్కడి అభివృద్ధిలో అధికంగా ఉండటమే దీనికి కారణం. విశాఖకు గూగుల్ లాంటి కంపెనీలు వస్తే అది ఇంకా పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే...ట్రైసిటీ హబ్‌గా (తిరుపతి, కృష్ణపట్నం, శ్రీసిటీ, నెల్లూరు, చెన్నై) ఉన్న తిరుపతికి రవాణా సహా పలు అవకాశాలు ఉండడం వల్ల ఆ జిల్లా జీడీపీఎస్ రూ.67,487 కోట్లు నుంచి 2028-29 నాటికి 1,69,469 కోట్లకు చేరుకుంటుంది" అని చంద్రబాబు అంచనా వేశారు. నీళ్లు ఉన్న జిల్లాలు వెనక్కి, నీళ్లు లేని జిల్లాలు ముందుకి రావడం చూస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. "వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉద్యానవన పంటలను ప్రోత్సహించడం కారణంగా నీళ్లు లేని అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలు బాగా అభివృద్ధి చెందాయి. అక్కడకు నీళ్లు కూడా తీసుకెళితే ఆ ప్రాంతాలు మరింత బ్రహ్మాండంగా ప్రగతిని అందుకుంటాయి. నీళ్లు సమృద్ధిగా ఉండే ఉమ్మడి పశ్చిమగోదావరి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలు పారిశ్రామిక పురోగతి లేకపోవడంతో వెనుకబడిపోయాయి. పరిశ్రమలు రాకపోవడం, సేవారంగం అభివృద్ధి చెందకపోవడం, సంప్రదాయంగా వస్తున్న వరి, కొబ్బరి పంటలనే ఇప్పటికీ సాగు చేస్తుండటమే దీనికి కారణం. ఈ నేపథ్యంలో జిల్లాల జీడీపీఎస్‌లో అనంతపురం రాష్ట్రంలో 6వ స్థానానికి, కడప 11వ స్థానానికి చేరుకున్నాయి" అని వివరించారు. ఒక్కోసారి ఆర్థికవ్యవస్థలో అవకాశాలు ఒక్కసారిగా పెరుగుతాయనీ, ఆ అవకాశాలను అందిపుచ్చుకోవడం కోసం మన దృష్టికోణాన్ని మార్చుకోవాల్సి వస్తుందని చంద్రబాబు వివరించారు. వ్యవసాయం ఒక్కటే ఏ రాష్ట్రాన్నీ, జిల్లానూ ముందుకు తీసుకెళ్లలేదన్నారు. దీనికి అదనంగా సేవల రంగాన్ని పెంచితే పర్యాటకంలో 20 శాతం వృద్ధి లభిస్తుందని తెలిపారు. "రాష్ట్రంలో అదనంగా 500 హోటల్స్ రావాల్సి ఉంది. పర్యాటక రంగంలో 53 వేల రూములు కట్టాల్సి ఉంది" అన్నారు. అభివృద్ధిని వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు ప్రభావితం చేస్తాయని చెప్పారు. నికర అదనపు విలువ (జీవీఏ) వ్యవసాయంలో 4,27,961 కోట్లు, పరిశ్రమల్లో 3,14,856 కోట్లు, సర్వీసు రంగంలో 4,80,576 కోట్లు(జీవీఏ).. ఇలా మొత్తం 12,23,691 కోట్లు నమోదైందని సీఎం చెప్పారు. విజన్ ఆంధ్ర-2047 డాక్యుమెంట్‌లో 50 శాతం వృద్ధిరేటును లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు తెలిపారు. "ప్రస్తుతం 3000 వేల డాలర్ల లోపే జీడీపీఎస్ ఉంది. 23 సంవత్సరాల కాల వ్యవధిలో 15 రెట్లు అభివృద్ధి, అంటే 42వేల డాలర్లకు తీసుకువెళ్లాలనే లక్ష్యంతో విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాం. కాబట్టి ప్రణాళికలు, కార్యాచరణలో వినూత్నంగా, విభిన్నంగా ఆలోచించాలి. తలసరి ఆదాయం పెరిగితేనే జీవన ప్రమాణాలు పెరుగుతాయి. ఈ దిశగా కలెక్టర్లు కార్యాచరణను సిద్ధం చేసుకోవాలి" అని సీఎం ఆదేశించారు.

ప్రతి సమస్యా పరిష్కరించాల్సిందే!

- లేదంటే ప్రభుత్వంపై నమ్మకం పోతుంది
- కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు వెల్లడి

'ప్రజలు మాకు మ్యాండేట్ ఇచ్చి గెలిపించారు. కాబట్టి ప్రజల నుంచి వస్తున్న ప్రతి సమస్యనూ పరిష్కరించాల్సిందే. పరిష్కరించనివి.. వివరించి చెప్పాలి. ఆ కారణాలను పోర్టల్‌లో నమోదు చేయాలి. దీనిపై ఏవిధంగా చేస్తారో వర్కవుట్ చేయండి" అని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ల సమావేశంలో 'ఫిర్యాదుల పరిష్కారం'పై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేశ్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ..."జూన్ నెల నుంచి నవంబరు వరకు 1.69 లక్షల ఫిర్యాదులు వస్తే.. వాటిలో 30 శాతం పెండింగులో ఉన్నాయి. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలి' అని అన్నారు.



ప్రజెంటేషన్ బాగుంది.. ఔట్‌కమ్ లేదు!

- అధికారుల పనితీరుపై సీఎం అసంతృప్తి
- వ్యవసాయ పాలసీ తీసుకువస్తాం: సీఎం

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతుల ఆదాయం పెరగాలని, ఖర్చులు తగ్గాలని సీఎం చంద్రబాబు చెప్పారు. వ్యవసాయంలో యాంత్రీకరణను అభివృద్ధి చేయాలని చెప్పారు. త్వరలోనే నూతన వ్యవసాయ విధానాన్ని తీసుకువస్తామని చెప్పారు. బుధవారం కలెక్టర్ల సదస్సులో వ్యవసాయ రంగంపై ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సీఎం మాట్లాడుతూ.. 'ఈ ప్రజెంటేషన్‌లో ప్రోగ్రాం ప్రాసెస్ గురించి ఎక్కువ చెప్పారు. ఔట్‌కమ్ మిస్సయ్యారు' అని అసంతృప్తి వ్యక్తం చేశారు. 'వ్యవసాయ రంగంలో ఉత్పత్తి, ఉత్పాదకత, వినియోగదారులకు సరసనమైన ధరలకు అందించడం ముఖ్యం. వాటి గురించి ఒక్కమాట కూడా లేదు. వచ్చే రబీకి ఏం ప్లాన్ చేశారు? ప్రకృతి వ్యవసాయంలో ఇంటిగ్రేషన్ ఎంతవరకు చేశారు?' అని సీఎం ప్రశ్నించారు. టెక్నాలజీ వినియోగంలో వ్యవసాయ శాఖ సామర్థ్యం పెరగాలన్నారు. ఉద్యాన శాఖపై సమీక్ష సందర్భంగా సీఎం మాట్లాడుతూ వ్యవసాయం, ఉద్యాన శాఖ, ఆక్వాకల్చర్‌లో వృద్ధి రేటులో చాలా వ్యత్యాసాలు ఉన్నాయని, ఇది సరికాదన్నారు. హార్టికల్చర్, చేపలు, రొయ్యల సాగు బాగా దెబ్బతిన్నదని, వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పంటల సాగులో తెగుళ్ల నివారణ, జీరోవేస్ట్ లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ దిగుబడులు బాగా తగ్గిపోతున్నాయని, విఫల ప్రయోగాలు చేయొద్దని అధికారులకు సూచించారు. వాణిజ్య పంటల ఉత్పత్తులతో ఎగ్జిబిషన్లు నిర్వహించాలని ఆదేశించారు.

రేషన్ మాఫియాను రూపుమాపాలి

- బియ్యం రీసైక్లింగ్ చేసేందుకు వీల్లేదు
- కలెక్టర్లకు చంద్రబాబు నిర్దేశం

అమరావతి, డిసెంబర్ 11(ఆంధ్రజ్యోతి): రేషన్ మాఫియాను ఈ రోజు నుంచే రూపుమాపాలని, బియ్యం రీసైక్లింగ్ చేసేందుకు వీల్లేదని కలెక్టర్లకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రేషన్ మాఫియాను నిర్మూలించడంలో ఏమైనా సమస్యలున్నాయా? అనిప్రశ్నించారు. రేషన్ షాపుల నుంచి బియ్యాన్ని సగంమంది అవసరం లేదని తీసుకోవడం లేదని, దీనికి సంబంధించి ఏం చేయాలనేది కార్యాచరణను సిద్ధం చేయాల్సి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. పోర్టుకు పోయేలోపు 3 చెక్‌పోస్టులుంటే, వాటన్నింటిని దాటుకుని రేషన్ బియ్యం ఎలా పోర్టులోకి వెళుతోందని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్.. కాకినాడ కలెక్టర్ షన్‌మోహన్‌ను ప్రశ్నించారు. రేషన్ బియ్యంలో ఫైన్ రకం బియ్యం కలిపి ఎగుమతి చేయడం వల్ల దాన్ని కనిపెట్టలేకపోయారని, 86 మిల్లులకు నోటీసులిచ్చామని కలెక్టరు వివరణ ఇచ్చారు. విశాఖపట్నానికి జార్ఖండ్ నుంచి కూడా బియ్యం దిగుమతి అవుతోందని, ఊహించని విధంగా మాఫియా నడుస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రేషన్ బియ్యం ప్రజలు తినకపోవడానికి కారణమేంటని చంద్రబాబు అడగగా... మంత్రి పయ్యావుల కేశవ్ స్పందించారు. "అన్నం ముద్దగా ఉండటంతో తినేందుకు ఆసక్తి చూపడం లేదు. దానివల్ల రేషన్ బియ్యం రీసైక్లింగ్‌కు అవకాశం ఏర్పడుతోంది" అని వివరించారు. బియ్యం స్థానంలో తృణధాన్యాలు ఇవ్వాలని, రైతులకు ఎంఎస్‌పీ రేట్లు పెంచి ఇవ్వడం ద్వారా.. మేలు రకం వరి పండించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. 24 గంటల్లో ధాన్యం రైతులకు చెల్లింపులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇంత టెక్నాలజీ అభివృద్ధి జరిగిన తర్వాత కూడా చెల్లింపులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని ప్రశ్నించారు. దేవదాయ భూముల్లో కూడా మొక్కలు పెంచడం ద్వారా పచ్చదనం పెంచాలని సీఎం అటవీశాఖ అధికారులను ఆదేశించారు.

వారానికి ఒకరోజు..

కలెక్టర్లు వారానికి ఒక రోజు క్షేత్రస్థాయి పర్యటనకు వెళితే వాస్తవాలు తెలుస్తాయని సీఎం చంద్రబాబు అన్నారు. తాము అధికారంలోకి వచ్చి ఇప్పటికి ఆరునెలలు అయిన నేపథ్యంలో తాను క్షేత్రస్థాయి పర్యటనలు చేసి.. పనితీరులో ఉన్న తప్పులను పరిశీలిస్తానని వెల్లడించారు. మీటింగులన్నింటినీ సులభతరం చేశామనీ, గతంలోలా పరదాలు కట్టి, చెట్లు నరకాల్సిన అవసరం లేదన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్ దేశంలోనే తొలిసారి

- ఇది యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలి
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు
- వాట్సాప్ ద్వారా 153 రకాల సేవలు: లోకేశ్

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశంలోనే తొలిసారిగా ఏపీలో వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని, ఇది యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. అమరావతి సచివాలయంలో బుధవారం మొదలైన కలెక్టర్ల సదస్సులో వాట్సాప్ గవర్నెన్స్‌పై సీఎం మాట్లాడారు. కొత్త టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినప్పుడు కొన్ని సమస్యలు తలెత్తుతాయని, వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు సాగాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ దినేశ్‌కుమార్ ప్రజంటేష న్ ఇచ్చారు. స్మార్ట్ గవర్నెన్స్‌లో భాగంగా గత అక్టోబరు 22న 'మెటా'తో ఒప్పందం చేసుకున్నామని, తొలిదశలో 100 నుంచి 150 రకాల సేవలను అందుబాటులోకి తీసుకురానున్నామని వివరించారు. వాట్సప్‌లో పంపిన సమస్యలను వర్చువల్ విధానంలో పరిష్కరించేలా చర్యలు చేపట్టామన్నారు. కులం, ఆదాయం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల జారీ వంటి అనేక రకాల సేవలను వాట్సాప్ ద్వారా అందించవచ్చన్నారు. దీనిపై సీఎం స్పందిస్తూ... వాట్సాప్ ద్వారా ఇచ్చే డాక్యుమెంట్ల కు లీగల్ వ్యాలిడిటీ ఉండాలని, సైబర్ సెక్యూరిటీని కూడా దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అధికారిక వాట్సాప్ నంబరు ద్వారా క్యూఆర్ కోడ్‌తో సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్లు తెలిపారు. కాగా, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను సక్రమంగా ఉపయోగించుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ పనితీరుపై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేశ్ కుమార్ ప్రజంటేషన్ ఇచ్చారు.



బుధవారం రాత్రి ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఇచ్చిన విందులో సీఎం చంద్రబాబు, అధికారులు

సమగ్ర సమాచార వేదికగా ఆర్టీజీఎస్

- పౌర సేవల కోసం సమగ్ర డేటా సేకరణ
- ప్రభుత్వ పథకాలు రియల్ టైమ్‌లో పర్యవేక్షణ
- కలెక్టర్ల సదస్సులో ఆర్టీజీఎస్ సీఈవో దినేశ్ కుమార్

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమగ్ర సమాచార వేదికగా ఆర్టీజీఎస్ పనిచేస్తుందని ఆ విభాగం సీఈవో దినేశ్ కుమార్ అన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. భవిష్యత్ లక్ష్యాలపై కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఒకే రాష్ట్రం.. ఒకే సుపరిపాలన నినాదంతో ప్రభుత్వ శాఖలన్నింటినీ కేంద్రీకృత పర్యవేక్షణతో పౌర సేవలను విస్తరించాలని సూచించారు. ఈ సదస్సులో ఆర్టీజీఎస్, వినతుల పరిష్కారం, వాట్సాప్ గవర్నెన్స్. వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)పై సీఈవో దినేశ్ కుమార్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులందరికీ సంతృప్త స్థాయిలో అందేలా కార్యచరణను అమలు చేస్తున్నామని వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డీప్ టెక్నాలజీ, క్వాంటం కంప్యూటింగ్ వంటి అధునాతన సాంకేతికతో ఆర్టీజీఎస్ పనిచేస్తుందని తెలిపారు. పథకాల అమలులో ఏఐ పరిజ్ఞానాన్ని వినియోగించుకోనున్నామని వెల్లడించారు. పౌరుల డేటా అనుసంధానంతో సరళతర దరఖాస్తు విధానాలను అమలుచేస్తూ భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను సులభంగా పరిష్కరించేలా కార్యచరణను సిద్ధం చేశామని చెప్పారు. ఆర్టీజీఎస్ 4.ఓ కింద సుపరిపాలన అందించేలా చర్యలు చేపడతామన్నారు. ఒక రాష్ట్రం.. ఒక పరిపాలన.. ఒక పౌరుడు.. ఒక డేటా.. విధానంలో రాష్ట్రంలోని పౌరులందరికీ సకాలంలో సేవలందించేలా ప్రభుత్వ శాఖలన్నింటినీ సమన్వయం చేస్తామన్నారు.

శాఖల మధ్య డేటా అనుసంధానం..

త్వరలోనే రాష్ట్రంలోని ప్రతి గ్రామానికీ ఒక ప్రత్యేక ప్రొఫైల్‌ను సిద్ధం చేస్తున్నామని దినేశ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వంలో మొత్తం 40 శాఖల్లో 4,338 డేటా ఫీల్డులు ఉన్నప్పటికీ ఇప్పటివరకు వాటి మధ్య డేటా లింకేజీ ఉండేది కాదన్నారు. దీనికోసం ప్రభుత్వంలోని వివిధ శాఖల డేటాను మొత్తం అనుసంధానించేలా ప్రత్యేక డేటా లేక్‌ను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఒక రాష్ట్ర ప్రభుత్వం ఇలా ప్రత్యేకంగా ఒక డేటా లేక్‌ను ఏర్పాటు చేసుకోవడం దేశంలోనే ఇదే తొలిసారని చెప్పారు. ఆర్టీజీఎస్ ద్వారా ఈ డేటాను నిరంతరం విశ్లేషించి యంత్రాంగానికి పాలన సులభతరమయ్యేలా చేస్తామని చెప్పారు. పాలనలో ఎదురయ్యే వినూత్న సమస్యలకు పరిష్కార మార్గాలను ఈ టెక్నాలజీ ద్వారా విశ్లేషించి రియల్ టైమ్‌లో పరిష్కారాలు సూచించేలా చేస్తామన్నారు. స్మార్ట్ గవర్నెన్స్ అన్నది సీఎం చంద్రబాబు విధానమని, దానికి అనుగుణంగా ఆర్టీజీఎస్ అన్ని శాఖలతో అనుసంధానమై పనిచేస్తుందని చెప్పారు. డేటా లేక్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి ఒక ప్రత్యేక ప్రొఫైల్ తయారు చేస్తామని, అందులో ఆ గ్రామ సమగ్ర స్వరూపం ఉంటుందన్నారు. అక్కడ సమస్యలతో సహా అన్ని వివరాలూ జిల్లా కలెక్టర్లకు, అధికారులకు సులభంగా తెలిసేలా రూపొందిస్తామన్నారు. పౌరుల అర్హత ఆధారంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు దక్కేలా చర్యలు తీసుకుంటామని దినేశ్‌కుమార్ వెల్లడించారు. ఆధార్ నంబరు వచ్చాక జాతీయ స్థాయిలో పౌర సేవలు సులువయ్యాయని ఆయన చెప్పారు. జియో ట్యాగింగ్‌లో భాగంగా రాష్ట్రంలోని ప్రతి ఇంటినీ మ్యాపింగ్ చేస్తామని, ప్రతి ఇంటి సమాచారాన్నీ సేకరిస్తున్నామని తెలిపారు.

వాట్సాప్ ద్వారా ఫిర్యాదులు..

పౌరులు తమ సమస్యలకు సంబంధించి ప్రభుత్వాధికారులకు, ప్రభుత్వానికి వాట్సాప్ ద్వారా ఫిర్యాదులు చేసుకునే సరికొత్త సదుపాయాన్ని త్వరలో తీసుకురానున్నామని దినేశ్ కుమార్ చెప్పారు. వాట్సాప్‌లో ఫిర్యాదును టైపు చేయలేని వారు.. వాయిస్ మెసేజ్ పంపితే దాన్నే ఫిర్యాదుగా స్వీకరించే విధానం అమలు చేయడానికి కృషి చేస్తామన్నారు. త్వరలోనే ఈ సదుపాయాన్ని ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఆర్టీజీఎస్‌తో ఇటీవలే గూగుల్ ఎంవోయూ కుదుర్చుకుందని, ఆ సంస్థ సహకారంతో పాలనలో మరింత సాంకేతిక సౌలభ్యాలు తీసుకొస్తామని చెప్పారు. ఏఐ ద్వారా సర్వైలెన్సు కెమెరాలు ఉపయోగించి ఆస్పత్రుల్లో శానిటేషన్ పనులను పర్యవేక్షిస్తామని చెప్పారు. మార్చి నెలాఖరుకల్లా జిల్లాల్లో ఆర్టీజీఎస్ కేంద్రాలను పూర్తి చేస్తామన్నారు.

దశ దిశ: స్వర్ణాంధ్ర విజన్‌తో 'వృద్ధి'

మందగమనంలో ఉన్న వృద్ధి రేటుకు జవసత్వాలు
ఏటా 15 శాతం పైపైకి
పది కీలక సూత్రాలతో జిల్లా స్థాయిలో కార్యాచరణ
వ్యవసాయ వృద్ధిలో ఏలూరు..
పరిశ్రమలు, సేవల్లో విశాఖ ఫస్ట్

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశవాప్తంగా వృద్ధి రేటు మందగమనంలో ఉందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. దీనికి తగినట్టుగానే రాష్ట్రంలో కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాల్లో వృద్ధి రేటు కొంతమేరకు తగ్గిందని తెలిపింది. అయితే, స్వర్ణాంధ్ర విజన్-2047తో వృద్ధి రేటుకు జవసత్వాలు అందించి పుంజుకునేలా చేయవచ్చని పేర్కొంది. 2047 నాటికి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ నెంబర్1గా నిలిపేందుకు రూపొందించిన 10 సూత్రాలతో ఏటా 15 శాతం వృద్ధి సాధ్యపడుతుందని తెలిపింది. ఈ మేరకు కలెక్టర్ల సదస్సులో వృద్ధిరేటుకు సంబంధించిన పలు అంశాలను వివరించింది.

- 2014-19లో వృద్ధిరేటు 13.5 శాతం నమోదు కాగా, 2019-24లో అది 10.59 శాతానికి క్షీణించింది. 2024-25 మొదటి త్రైమాసికంలో 9.55 శాతం, రెండో త్రైమాసికంలో 8.75 శాతంగా నమోదైంది. ఇది జాతీయసగటు కంటే ఎక్కువ. అయితే, దేశవాప్తంగా వృద్ధిరేటు మందగమనంలో ఉంది.
- 2023-24లో జీఎస్‌డీపీని రూ.14.4 లక్షల కోట్లుగా అంచనా వేశారు. వ్యవసాయ రంగం వాటా 34.14 శాతం, పారిశ్రామిక రంగం వాటా 25.69 శాతం, సేవారంగం వాటా 40.16 శాతంగా ఉన్నాయి.
- ఏటా 15 శాతం కంటే ఎక్కువ వృద్ధిరేటు సాధించే లక్ష్యంగా 10 సూత్రాలతో స్వర్ణాంధ్ర విజన్-2047ను రూపొందించినట్టు ప్రభుత్వం తెలిపింది.
- ప్రతి జిల్లాకు ఐదేళ్ల విజన్ కార్యాచరణ ప్రణాళిక. సమ్మిళిత వృద్ధిని వేగవంతం చేసే ప్రాజెక్టులు.
- విజన్ సూత్రాల అమలు, పర్యవేక్షణకు జిల్లాస్థాయిలో విజన్ మేనేజ్‌మెంట్ యూనిట ఏర్పాటు.
- నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, నీటి సంరక్షణ, వ్యవసాయరంగం బలోపేతం, మెరుగైన రవాణా, చౌకధరలకే ఇంధనం, నాణ్యమైన ఉత్పత్తులు, స్వచ్ఛభారత్, డీప్ టెక్నాలజీ అనే 10 సూత్రాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక.
- 2028-29 నాటికి వ్యవసాయ, అనుబంధ రంగాల వృద్ధిరేటు 11.05 శాతం, పారిశ్రామికరంగం వృద్ధి 16.15 శాతం, సేవారంగం వృద్ధి రేటు 17.95 శాతానికి చేర్చడం ద్వారా మొత్తం రాష్ట్ర వృద్ధిరేటు 15.27 శాతానికి చేరుతుందని అంచనా.
- 2028-29 నాటికి జిల్లాల స్థూల ఉత్పత్తి రూ.29,29,206 కోట్లకు చేరుతుందని అంచనా.

వ్యవసాయంలో ఏలూరు ఫస్ట్

2022-23 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగం వృద్ధిలో ఏలూరు జిల్లా మొదటిస్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యవసాయ రంగ వృద్ధిలో ఈ జిల్లా వాటా 9.87 శాతంగా నమోదుకాగా, స్థూల విలువ(జీవీఏ) రూ.42,249 కోట్లుగా నమోదైంది. ఇక, రూ.32,372 కోట్ల జీవీఏతో 7.56 శాతం వాటాతో కృష్ణా జిల్లా రెండో స్థానంలో నిలిచింది. రూ.3,569 కోట్ల జీవీఏతో 0.83 శాతం వాటాతో విశాఖ చిట్టచివరి స్థానంలో ఉంది. పారిశ్రామిక, సేవా రంగాల్లో మాత్రం విశాఖ జిల్లా తొలిస్థానంలో నిలిచింది. రాష్ట్ర పారిశ్రామిక వృద్ధిరేటులో రూ.59,264 కోట్ల జీవీఏతో, 18.82 శాతం వాటాను విశాఖ అందించింది. పారిశ్రామిక రంగంలో తిరుపతి రెండోస్థానంలో ఉండగా, అల్లూరి సీతారామ రాజు జిల్లా చివరిస్థానంలో ఉంది. సేవారంగ వృద్ధిరేటులో రూ.49,131 కోట్ల జీవీఏతో, 10.22 శాతం వాటాతో విశాఖపట్నం తొలిస్థానంలో ఉంది. సేవారంగంలో ఎన్టీఆర్ జిల్లా రెండోస్థానం సాధించగా, అల్లూరి సీతారామరాజు జిల్లా చివరిస్థానంలో ఉంది.

బీపీఎల్ దిగువన 22 లక్షల మంది

రాష్ట్ర జనాభాలో 4 శాతం మంది అంటే 22 లక్షల మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని రాష్ట్ర ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ వెల్లడించారు. నీతిఆయోగ్ మార్గదర్శకాల ప్రకారం పేదల అభ్యున్నతికి తగు చర్యలు తీసుకునే విధంగా ప్రణాళికలు రూపొందించనున్నట్టు తెలిపారు. కలెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కలెక్టర్ల సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, స్వర్ణాంధ్ర-2047 అంశాలను వివరించారు. జీరో పావర్టీ, పీ-4 మోడల్, డెమోగ్రాఫిక్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై తీసుకున్న నిర్ణయాలను వివరించారు. జీఎస్‌డీపీ 2014-19 మధ్యకాలంలో 13.50శాతం ఉంటే 2019-24 మధ్య 10.59 శాతానికి పడిపోయిందన్నారు. స్వర్ణాంధ్ర-2047 మైలురాయి సాధించడానికి 15 శాతం వార్షికవృద్ధిని సాధించడం తప్పనిసరి అని అన్నారు.

ఆరోగ్య కార్యదర్శుల సంఘానికి కొత్త నాయకత్వం

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖ పరిపాలనా విభాగంలో పదవులను రెవెన్యూ అధికారులకు కాకుండా తమకే ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని ఏపీ ఆరోగ్య కార్యదర్శుల సంఘం (గ్రూప్-1 అధికారులు) నిర్ణయించింది. బుధవారం సంఘం సమావేశాన్ని డీఎంఈ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా వాసుదేవరావు, కె.అప్పారావులను ఎంపిక చేశారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షునిగా బీ.వీ.రావు, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్ రెడ్డిని ఎన్నుకున్నారు. అనంతరం సంఘం సభ్యులు పలు అంశాలపై చర్చించారు. గ్రూప్-1 పరీక్షలో మెరిట్‌లో వచ్చిన తమకు ఏళ్ల తరబడి పదోన్నతులు లేకపోవడంపై ఆవేదన వ్యక్తంచేశారు. ఆరోగ్యశాఖలో కీలకంగా వ్యవహరించే తమను కాదని రెవెన్యూ అధికారులను అడ్మినిస్ట్రేటర్లుగా నియమించడంపై కొంతమంది ప్రశ్నించారు. పదోన్నతులతో సమస్యతో పాటు అడ్మినిస్ట్రేటర్లుగా తమనే నియమించాలన్న దానిపైనా ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు.

నైపుణ్య గణన నోడల్ అధికారులుగా జేసీలు

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభంకానున్న నైపుణ్య గణనకు జిల్లాల్లో జాయింట్ కలెక్టర్లు నోడల్ అధికారులుగా ఉంటారని ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు నైపుణ్యాభివృద్ధి శాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. కలెక్టర్లు మొత్తంగా పర్యవేక్షిస్తారని, నోడల్ అధికారులుగా జేసీలు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేసింది. సంక్షేమ, గ్రామ, వార్డు సచివాలయాలు, పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ, ఐ అండ్ పీఆర్ శాఖల ద్వారా నైపుణ్య గణన నిర్వహించాలని సూచించింది.

మార్చిలో టెన్త్, ఇంటర్ పరీక్షలు

- 1 నుంచి 20 వరకూ ఇంటర్ ఎగ్జామ్స్
- విద్యార్థులకు ఫిబ్రవరిలో ప్రాక్టికల్స్
- 17 నుంచి 31 వరకూ టెన్త్ పరీక్షలు
- షెడ్యూలు విడుదల చేసిన మంత్రి లోకేశ్



అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఈ పరీక్షలు మార్చి నెలలో నిర్వహించనున్నట్లు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. మార్చి 1 నుంచి 20 వరకూ ఇంటర్ పరీక్షలు, మార్చి 17 నుంచి 31 వరకూ పదో తరగత పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఈ పరీక్షల మంత్రి లోకేశ్ షెడ్యూల్‌ను బుధవారం వేర్వేరుగా విడుదల చేశారు. టెన్త్ విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు నిర్వహిస్తారు ఈసారి రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహించే విధంగా షెడ్యూలు రూపొందించారు. విద్యార్థులకు చదువుకునేందుకు సమయం లభించేలా కనీసం ఒకరోజు ఖాళీ వచ్చేలా తేదీలు ఖరారు చేశారు. తెలుగులో పరీక్షలు రాసేందుకు మొత్తం 49వేల మంది విద్యార్థులు మీడియం ఎంపిక చేసుకున్నారు. కాగా, ఇంటర్ విద్యార్థులకు ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష ఫిబ్రవరి 1న, పర్యావరణ విద్య పరీక్ష ఫిబ్రవరి 3 జరుగుతాయి. జనరల్ విద్యార్థులకు ఫిబ్రవరి 10 నుంచి 20 వరకు, ఒకేషనల్ విద్యార్థులకు ఫిబ్రవరి 5 నుంచి 20 వరకు ప్రాక్టికల్స్ ఉంటాయి.

టెన్త్ పరీక్షల టైమ్ టేబుల్

తేదీ	పరీక్ష
మార్చి 17	ఫస్ట్ లాంగ్వేజీ/ ఫస్ట్ లాంగ్వేజీ పేపర్-1 (కాంపోజిట్ కోర్సు)
మార్చి 19	సెకండ్ లాంగ్వేజీ
మార్చి 21	ఇంగ్లీషు
మార్చి 22	ఫస్ట్ లాంగ్వేజీ పేపర్-2 (కాంపోజిట్ కోర్సు) ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజీ పేపర్-1 (సంస్కృతం, అరబిక్, పర్షియన్)
మార్చి 24	లెక్కలు
మార్చి 26	ఫిజికల్ సైన్స్
మార్చి 28	బయలాజికల్ సైన్స్
మార్చి 29	ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజీ పేపర్-2 (సంస్కృతం, అరబిక్, పర్షియన్) ఎస్ఎస్‌సీ ఒకేషనల్ కోర్సు (థియరీ)
మార్చి 31	సోషల్ స్టడీస్

ఇంటర్ పరీక్షల టైమ్ టేబుల్

తేదీ	ఫస్టియర్	తేదీ	సెకండియర్
మార్చి 1	సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1	మార్చి 3	సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2
మార్చి 4	ఇంగ్లిష్ పేపర్-1	మార్చి 5	ఇంగ్లిష్ పేపర్-2
మార్చి 6	గణితం-1ఎ బోటనీ పేపర్-1 సివిక్స్ పేపర్-1	మార్చి 7	గణితం-2ఎ బోటనీ పేపర్-2 సివిక్స్ పేపర్-2
మార్చి 8	గణితం పేపర్-1బి జువాలజీ పేపర్-1 హిస్టరీ పేపర్-1	మార్చి 10	గణితం పేపర్-2బి జువాలజీ పేపర్-2 హిస్టరీ పేపర్-2
మార్చి 11	ఫిజిక్స్ పేపర్-1 ఎకనామిక్స్ పేపర్-1	మార్చి 12	ఫిజిక్స్ పేపర్-2 ఎకనామిక్స్ పేపర్-2
మార్చి 13	కెమిస్ట్రీ పేపర్-1 కామర్స్ పేపర్-1 సోషియాలజీ పేపర్-1	మార్చి 15	కెమిస్ట్రీ పేపర్-2 కామర్స్ పేపర్-2 సోషియాలజీ పేపర్-2
మార్చి 17	ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్-1 పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-1 లాజిక్ పేపర్-1 బ్రిడ్జ్ కోర్సు గణితం పేపర్-1(బైపీసీ)	మార్చి 18	ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్-2 పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-2 లాజిక్ పేపర్-2 బ్రిడ్జ్ కోర్సు గణితం పేపర్-2(బైపీసీ)
మార్చి 19	మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-1 జాగ్రఫీ పేపర్-1	మార్చి 20	మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-2 జాగ్రఫీ పేపర్-2

వైద్యుల బోర్డు నివేదికను మార్చేశారు

» డాక్టర్ ప్రభావతికి ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు: ప్రాసిక్యూషన్స్ జేడీ

» రఘురామ కేసులో రేపు కోర్టు నిర్ణయం

గుంటూరు లీగల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ప్రస్తుత శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఐదో నిందితురాలిగా ఉన్న అప్పటి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి ముందస్తు బెయిల్ పిటిషన్‌లో ఈ నెల 13న కోర్టు నిర్ణయం వెలువడనుంది. ముందస్తు బెయిల్ కోరుతూ ఆమె గుంటూరు జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో రఘురామరాజు ఇంప్లీడ్ పిటిషన్ వేశారు. దీనిపై బుధవారం రెండో అదనపు జిల్లా జడ్జి వై.నాగరాజా విచారణ జరిపారు. ప్రభావతి తరపు న్యాయవాది శేఖర్‌బాబు వాదనలు వినిపిస్తూ ప్రాసిక్యూషన్ చెబుతున్న కస్టోడియల్ టార్చర్ అనే నేరం రఘురామరాజును ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాకముందు జరిగింది కనుక సంబంధిత సెక్షన్లు ఆమెకు వర్తించవని చెప్పారు. ప్రభావతి గైనకాలజిస్ట్ మాత్రమేనని, కోర్టు ఆదేశాలతో ప్రభుత్వాస్పత్రిలో సర్జన్, ఫిజీషియన్లతో కూడిన బోర్డును ఏర్పాటు చేసి వారిచ్చిన నివేదికనే చైర్మన్ హోదాలో కోర్టుకు పంపారన్నారు. ఇందులో ఆమె తప్పేమీ లేదన్నారు. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపిస్తూ ప్రభావతి మిగిలిన నిందితులతో చేతులు కలిపి కోర్టును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని చెప్పారు. ఈ కేసులో ఉద్దేశపూర్వక కుట్ర దాగి ఉందని చెప్పారు. ప్రభావతి కోర్టుకు తప్పుడు నివేదిక అందజేశారని, ఆమె ముందస్తు బెయిల్‌కు అర్హురాలు కాదన్నారు. న్యాయవాది లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. డాక్టర్ల నివేదికను తారుమారు చేసి రఘురామ వంటిపై ఎటువంటి గాయాలూ లేవని నివేదిక ఇవ్వడం క్షమించరాని నేరమని చెప్పారు. వాదనలు ముగియడంతో తీర్పు వెలువరించేందుకు 13కు వాయిదా వేశారు.

సోషల్ మీడియాలో మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

» రాష్ట్ర ప్రభుత్వాలూ యాక్షన్ తీసుకోవచ్చు

» లోక్‌సభలో మంత్రి మురుగన్

న్యూఢిల్లీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో మహిళలను వేధిస్తూ, అప్రతిష్ఠ పాలు చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చని కేంద్రం తెలిపింది. సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ ఇతరులను దూషించటం సహా సైబర్ నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. బుధవారం, లోక్‌సభలో ఎంపీ బైరెడ్డి శబరి అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 'భారతీయ న్యాయ సంహిత 2023 చట్టం సెక్షన్ 78 ప్రకారం మహిళలను వేధించే వారిపై చర్యలు తీసుకోవచ్చు. సామాజిక మాధ్యమాల్లో మహిళలను వేధించే, సైబర్ నేరాలకు పాల్పడేవారిపై రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవచ్చు. సైబర్ దాడులను అరికట్టేందుకు కేంద్ర హోంశాఖ సైబర్ క్రైమ్ ప్రివెన్షన్ ఎగైనెస్ట్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ పథకాన్ని అమలు చేస్తోంది. వ్యక్తిగత స్వేచ్ఛ, హక్కులను కాపాడేందుకు డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ 2023 అమలులో ఉంది' అని స్పష్టం చేశారు.

ఏపీతో గూగుల్

(మొదటి పేజీ తరువాయి)

ఒప్పందాలపై సంతకాలు చేశారు. పెట్టుబడులు ఏ స్థాయిలో పెట్టాలనుకుంటున్నారు, విశాఖ సహా రాష్ట్రంలోని ఇతర ప్రదేశాల్లో ఎక్కడెక్కడ తమ కేంద్రాలను ఏర్పాటు చేయాలనుకుంటున్నారో వికాస్ వెల్లడించారు. ఈ నెల ఐదో తేదీన రాష్ట్ర ప్రభుత్వంతో గూగుల్ చేసుకున్న ఒప్పందం, ఆ తర్వాత విశాఖలో వికాస్ పర్యటన గురించి చర్చ జరిగింది. అమెరికా పర్యటనలో గూగుల్‌ను మంత్రి లోకేశ్ సందర్శించడం, రాష్ట్రానికి ఏఐ సేవలు అందించాలంటూ ఆహ్వానించడం వంటి అంశాలూ ప్రస్తావనకు వచ్చాయి. రాష్ట్రంలో తమ కార్యకలాపాలను విస్తరిస్తామని, త్వరలో వివరాలు వెల్లడిస్తామని వికాస్ వెల్లడించారు. మంత్రి లోకేశ్, సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, ఐటీ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌తో జరిపిన సంప్రదింపుల తర్వాత రాష్ట్రంతో వ్యూహాత్మకంగా కలసి ముందుకు వెళ్లాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో గూగుల్ కార్యకలాపాలను చేపట్టడం, అందునా విశాఖలో కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై లోకేశ్ సంతోషం వ్యక్తం చేశారు. రిలయన్స్, నిప్పాన్ స్టీల్స్, భారత్ ఫోర్జ్, టాటా గ్రూప్ వంటి సంస్థలు రాష్ట్రానికి రావడంపై చర్చ సాగింది.

ఐటీ అత్యంత ప్రభావశీలి: చంద్రబాబు

భారత్‌లో తమ సంస్థ వ్యాపార కార్యకలాపాల గురించి గూగుల్ బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించింది. ఐటీ రంగానికి ఆర్థికంగానూ, సామాజికంగా ప్రభావం చూపే శక్తి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక, సామాజికాభివృద్ధిలో ఐటీ రంగం కీలకమైందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఐటీ రంగాన్ని విస్తరిస్తే వచ్చే ప్రయోజనాలను గ్రహించానని అన్నారు. ఐటీని ఆంధ్రప్రదేశ్ పూర్తిగా సద్వినియోగం చేసుకుంటుందని వెల్లడించారు. ప్రపంచమంతా ఐటీ రంగంవైపు చూస్తోందని, విశ్వంలో ఐటీ అత్యంత ప్రభావశీలిగా మారిందన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, సీఎస్ నీరబ్ కుమార్ సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న గూగుల్, ప్రభుత్వ ప్రతినిధులు

హెల్మెట్ నిబంధన అమలేదీ?

పోలీసులు, ఎంవీఐ అధికారుల పనితీరుపై అసంతృప్తిగా ఉన్నాం: హైకోర్టు



> ఏపీ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాల డ్రైవర్లు తెలంగాణ సరిహద్దుకు వెళ్లగానే సీట్ బెల్టు పెట్టుకుంటున్నారు. అద్దాలకు నల్ల ఫిలిమ్ ఉన్న కార్లు హైదరాబాద్‌లో కనిపించవు. చట్టనిబంధనలు కఠినంగా అమలు చేయడమే ఇందుకు కారణం. ఏపీలో భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. కార్ల అద్దాలకు నల్ల ఫిలిమ్‌లు ఉంటున్నాయి. ఎవరూ సీటు బెల్టులు పెట్టుకోవడం లేదు. పోలీసులు కఠినంగా వ్యవహరించకపోవడమే కారణం.
>
> హెల్మెట్ ధరించని కారణంగా మరింత మంది ప్రాణాలు కోల్పోవడానికి వీల్లేదు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటారనే భయం ప్రజల్లో కలగాలి. చలానాలు వేసి చేతులు దులుపుకోకుండా, వసూలుకు చర్యలు తీసుకోవాలి.
>
> - హైకోర్టు

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. చలానాలు కట్టనివారి ఇళ్లకు విద్యుత్, నీటి సరఫరా నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటిరవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది. కేంద్ర మోటార్ వాహన సవరణ చట్టం నిబంధనలు అమలు చేయకపోవడంతో పెద్ద ఎత్తున రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, నిబంధనలు ఉల్లంఘించినవారికి జరిమానా విధించడం లేదని పేర్కొంటూ న్యాయవాది తాండవ యోగేష్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్ బుధవారం విచారణకు వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా హెల్మెట్ ధరించకపోవడం వల్ల 3 నెలల్లోనే 667 మంది చనిపోవడంపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పోలీసులు చట్టనిబంధనలు కఠినంగా అమలు చేస్తే ఇలాంటి పరిస్థితి రాదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించింది. హెల్మెట్ తప్పనిసరి చేయాలని తాము ఉత్తర్వులు జారీ చేసిన జూన్ 26 నుంచి సెప్టెంబరు 4 మధ్య అంతమంది చనిపోవడం చిన్న విషయమేమీ కాదని పేర్కొంది. చలానాలు చెల్లించకుంటే వాహనాలను సీజ్ చేసేందుకు చట్టనిబంధనలు వెసులుబాటు కల్పిస్తున్నాయని, అలా చేయకుండా మిమ్మల్ని ఎవరు ఆపారని పోలీసులు, ఆర్టీఏ అధికారులను న్యాయస్థానం ప్రశ్నించింది. అధిక జరిమానాలు విధించడం వల్ల సమస్యకు పరిష్కారం దొరక్కపోగా సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ప్రస్తుతం విధిస్తున్న జరిమానాలనే కఠినంగా వసూలు చేస్తే సరిపోతుందని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా 8,770 మంది ట్రాఫిక్ పోలీసులు ఉండాల్సి ఉండగా, 1994 మంది మాత్రమే ఉన్నారని, ఖాళీల భర్తీకి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ద్విచక్ర వాహనంపై ప్రయాణించేవారు ఎక్కువమంది మధ్యతరగతి, పేద ప్రజలే ఉంటారని, కుటుంబాన్ని పోషించే వ్యక్తి చనిపోతే ఆ కుటుంబం మొత్తంపై ప్రభావం పడుతుందని గుర్తు చేసింది. మోటార్ వెహికల్ చట్టం నిబంధనలు అమలు చేయడంలో పోలీసులు, ఆర్టీఏ అధికారుల పనితీరుపై తాము అసంతృప్తిగా ఉన్నామని పేర్కొంది. తదుపరి విచారణకు కోర్టు ముందు హాజరుకావాలని ట్రాఫిక్ ఐజీని ఆదేశించింది. ఐజీని అడిగి తెలుసుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయని తెలిపింది. రవాణా కమిషనర్‌ను వ్యాజ్యంలో ప్రతివాదిగా చేర్చింది. రాష్ట్రవ్యాప్తంగా మోటార్ వెహికల్ చట్టం నిబంధనలపై ఇప్పటివరకు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు? ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, చట్టనిబంధనలు అమలు చేసేందుకు ఏ చర్యలు తీసుకుంటున్నారో పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు

న్యాయవాది తాండవ యోగేష్ వాదనలు వినిపిస్తూ.. ద్విచక్రవాహనం నడిపేవారికి హెల్మెట్ తప్పనిసరి చేయాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి స్పందిస్తూ.. మోటార్ వెహికల్ చట్టనిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. హెల్మెట్ ధరించనివారిని గుర్తించి పోలీసులు చలానాలు విధిస్తున్నారన్నారు. ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు వరకు రాష్ట్రవ్యాప్తంగా 5,62,492 చలాన్లు విధించామన్నారు. కృష్ణా జిల్లాలో 20,824 చలాన్లు విధించి రూ.4.63 లక్షల జరిమానా వసూలు చేశామన్నారు. ధర్మాసనం స్పందిస్తూ... సీసీ కెమెరాల ఆధారంగా చలానాలు విధించడమే కాకుండా భౌతికంగా కూడా తనిఖీలు చేయాలని స్పష్టం చేసింది. తాండవ యోగేష్ స్పందిస్తూ.. ఇతర రాష్ట్రాల్లో హెల్మెట్ ధరిస్తేనే వాహనాల్లో పెట్రోల్ పోస్తున్నారన్నారు. హెల్మెట్ లేకుంటే ద్విచక్ర వాహనదారులను ప్రభుత్వ కార్యాలయాల్లోకి, కాలేజీల్లోకి అనుమతించడం లేదన్నారు. వివరాలను తదుపరి విచారణలో కోర్టు ముందు ఉంచుతామన్నారు. ఎస్‌జీపీ స్పందిస్తూ.. మొత్తం బాధ్యతను అధికారులపైనే మోపడం సరికాదని, ప్రజలు కూడా బాధ్యతగా మెలగాల్సిన అవసరం ఉందన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. ప్రజలకు చట్టనిబంధనల గురించి అవగాహన కల్పించాల్సిన బాధ్యత పోలీసులు, ఆర్టీఏ అధికారులదేనని స్పష్టం చేసింది.

గూగుల్.. గేమ్ చేంజర్!

» విశాఖలో డేటా సెంటర్.. స్థలం అన్వేషణలో గూగుల్ బృందం

విశాఖపట్నం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్, గూగుల్ వచ్చిన తర్వాతే అక్కడ సాఫ్ట్‌వేర్ ముఖ చిత్రం మారిపోయింది. ఇప్పుడు... విశాఖకు గూగుల్ రాక గేమ్ చేంజర్ కానుందని నిపుణులు పేర్కొంటున్నారు. బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి సమక్షంలో కుదిరిన ఒప్పందంతో ఈ దిశగా మరో అడుగు ముందుకు పడింది. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఇటీవల పెట్టుబడుల సేకరణకు విదేశీ పర్యటన చేసినప్పుడు గూగుల్ ప్రతినిధులతో చర్చించారు. ఈ నెల 6వ తేదీన విశాఖలో నిర్వహించిన డీప్ టెక్నాలజీ సదస్సులో దీనిపై ఒప్పందం జరిగింది. అప్పుడే గూగుల్ బృందం విశాఖపట్నం అంతా తిరిగి అనువైన స్థలం కోసం అన్వేషణ చేపట్టింది. ఇంటర్‌నెట్‌కు గుండెకాయ వంటి కేబుల్ లైన్లను సింగపూర్ నుంచి సముద్ర గర్భంలో (అండర్ సీ) విశాఖపట్నం వరకూ తీసుకొస్తారు. కేబుల్ ల్యాండ్ అయిన చోట ఇది శక్తిమంతంగా పనిచేస్తుంది. అందుకే ఇక్కడ డేటా సెంటర్ పెట్టడానికి అప్పుడు అదానీ, ఇప్పుడు గూగుల్ ముందుకొచ్చాయి. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కోరుకుంటున్న డీప్ టెక్నాలజీస్ అన్నింటిలో గూగుల్ సహకరిస్తుంది. గూగుల్‌తో రెండు దశాబ్దాల కిందటే ఒప్పందం చేసుకుని... ఆ సంస్థతో కలిసి పని చేసిన కంపెనీ విశాఖపట్నంలోనే ఉండడం విశేషం. చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు.. హైదరాబాద్‌లో గూగుల్ ఏర్పాటుకు విశాఖకు చెందిన ప్రవాసాంధ్రుడు కాట్రగడ్డ లలితేశ్వర్ కీలక పాత్ర పోషించారు. అప్పట్లో లలితేశ్వర్ సమీప బంధువు, 'సింబియోసిస్' నరేశ్‌కుమార్ కూడా ఆ చర్చల్లో పాల్గొన్నారు. గూగుల్ రాక విశాఖకు వరమని, దీని ద్వారా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని నరేశ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పర్వతరావు కన్నుమూత



బంజారాహిల్స్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎస్.పర్వతరావు బుధవారం కన్నుమూశారు. 1935లో జన్మించిన ఆయన విజయవాడలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. మద్రాస్ లా కాలేజీ నుంచి న్యాయవాది పట్టా అందుకున్నారు. ఉమ్మడి హైకోర్టు జడ్జిగా 1990లో నియమితులయ్యారు. 1997లో రిటైర్ అయ్యాక వినియోగదారుల ఫోరం చైర్మన్‌గా వ్యవహరించారు. ఉంగుటూరులో సుంకవల్లి భారతీయ విద్యా కేంద్రాన్ని సొంత నిధులతో నిర్మించి బీవీకే వైజాగ్ సంస్థకు అప్పగించారు. 35 ఎకరాలు గౌతమి సేవా సంస్థకు, ఐదు ఎకరాలు గోపాలకృష్ణ గోశాలకు వితరణగా అందచేశారు. ఆయనకు భార్య లక్ష్మీకాంతం, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద అల్లుడు రిటైర్డ్ జడ్జి చల్లా కోదండం. జూబ్లీహిల్స్‌లోని స్వగృహంలో జస్టిస్ పర్వతరావు భౌతికకాయానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డి, జస్టిస్ నవీన్‌రావు, జస్టిస్ ఎ.రాజశేఖర్, న్యాయమూర్తులు జస్టిస్ వినోద్, జస్టిస్ కె.లక్ష్మణ్ తదితరులు నివాళులర్పించారు. అంతిమ సంస్కారాలు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ముగిశాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.